

02-1980
ఫిబ్రవరి '80
రూ. 3/=


ఖటావ్ టెర్కోసా వారి చీరలు
Rediffusion/K/1006TLf


నటసార్వభౌమ
డా॥ యన్.టి.రామారావు
నటించిన
ఛాలెంజ్
రాముడు
దర్శకత్వం: టి.యల్.వి.ప్రసాద్



సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి
రాఘవయ్య

జ్యోతి
సచిత్ర మాసపత్రిక

ఫిబ్రవరి 1980

సంపుటి 18 — విషయసూచిక — సంచిక 1

ఈ నెల నవలానుబంధం

నదిలో నావ

చెల్లూరి సీతారాజేశ్వరరావు

ముఖచిత్రం: శ్రీదేవి

నవలానుబంధం ముఖచిత్రం: ఎన్. శివన్నారాయణ

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు



తొలిమాట

ఆద్యంతాలులేని కాలవృక్షం మరొక ఆకురాల్చింది. దేశం కనీవినీ యెరుగని రాజకీయ గందరగోళంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారకోలాహలం మధ్య మనం మరొక కొత్త సంవత్సరం లోకి అడుగు పెడుతున్నాం. రేపు అనే రెండక్షరాల మీద మానవుడికిగల ఆశవల్లనే ప్రపంచం పురోగమిస్తోంది. మనం కూడా అదే కోరుకుందాం – కొత్తసంవత్సరంలో జాతి జీవనవనంలో కొత్తగాలులు వీచాలని.

* * *

కార్టూను అనగానే తెలుగువారికి వెంటనే స్ఫురించే పేరు 'బాపు'. బాపుగారి కార్టూన్ల సంపుటి 'కొంటెబొమ్మల బాపు' మీద ప్రముఖ కార్టూనిస్టు డా. 'జయదేవ్' బాబు గారి వివరణాత్మకమైన విపుల సమీక్షని ఈ నెల 'కొత్త పుస్తకంతో కొంతసేపు' శీర్షికలో ప్రచురించాము.


* * *


కార్టూన్ల సంఖ్య పెంచమని చాలామంది పాఠకులు ఉత్తరాలు రాస్తున్నారు. ఈ విషయాన్ని తప్పకుండా పరిశీలిస్తాము.

* * *

'జ్యోతి' నవలల పోటీకి వచ్చిన నవలల పరిశీలన దాదాపు పూర్తయింది. మరికొంత వ్యవధి వుండివుంటే ఫలితాలు ఈ సంచికలోనే వచ్చివుండేవి. వచ్చే సంచికలో, పోటీలో బహుమతులు పొందిన నవలల వివరాలు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన నవలల పట్టికా ప్రచురిస్తాము.


కామధేను సిల్క్స్
(వసి)
బీసెంట్ రోడ్
విజయవాడ 2
ఫోన్: 62420
సరసమైన ధరలలో నాణ్యత కలిగిన అన్నిరకముల
పట్టుచీరలకు ప్రసిద్ధి!


మిరుమిట్లుగొల్పే తెలుపు
చూడగానే
అందరి నోట ఒకే మాట..
ఇది తప్పక
డెట్
డిటర్జెంట్
బిళ్ల వుతుకే
Supreme
Shilpi DM 35A/79 Tel



ఉత్తరాలు

ఇంగ్లీషు - తెలుగు వివాదం ఇప్పటిది కాదు

"తెలుగు రచనల్లో ఆంగ్లం ఉపయోగించవచ్చా—కూడదా" ఇదేమీ కొత్తగా పుట్టిన ప్రశ్న కాదు. నవల-చిన్నకథ-లకు వయసు దీనికీ వుంది.

అప్పటి రచయితలు పాత్ర చిత్రణకి, భావ స్పష్టతకీ ఎంతవరకూ ఇంగ్లీషు అవసరమో అంతవరకే ఉపయోగించేవారు. కనుక ఈ విషయం అప్పట్లో అంత వివాదాస్పదం కాలేదు. కానీ ఇప్పటి రచయితలు వారు కొత్తగా విన్న ఆంగ్ల పదాన్ని ఎప్పుడు తమ కథల్లో వాడదామా అనే ఆత్రుతతో వుండడంచేతా, సందర్భంవున్నా లేకపోయినా ఆ పదాన్ని తమ కథల్లో వుపయోగించడంచేతా ఈ వివాదం మళ్ళీ తల ఎత్తింది.

చక్కని, సహజమైన పాత్ర చిత్రణకి ఆంధ్ర సాహిత్యంలో ఆంగ్ల పదాలు ఉపయోగించవచ్చని, ఈ శతాబ్దారంభంలోనే మహాకవి గురజాడ 'గిరీశం' పాత్రద్వారా నిరూపించారు. గిరీశం వంటి "హిపోక్రిట్" నోటికి అతను మాట్లాడిన ఇంగ్లీషు చక్కగా అమిరింది. గురజాడవారు ఆంగ్లం వాడారు కనుక "కన్యాశుల్కం" గొప్ప నాటకం కాదనగలమా? సంచలన రచయిత కీ॥శే॥ చలంగారు తమ నవలల్లోనూ, కథల్లోనూ ఇంగ్లీషు వాడారు - పాత్రల సంభాషణలలోనే కాదు — కథ చెప్పడం (Narration) లో కూడా. ఆయన రచనలని మనం మర్చిపోయామా?

రావిశాస్త్రిగారి "రత్తాలు-రాంబాబు"లో ఒక నాగరిక యువకుడు ఒక వేశ్యని "How much. Baby? ఎంత?" అని అడుగుతాడు. అందులోనే మందులషాపు యజమాని "వీడె వడో అర్ ఓ డబ్ల్యు టి వైలా వున్నాడు సార్! నన్ను ఐ ఎన్ ఎస్ యు ఎల్ టి చేస్తున్నాడు" అంటాడు. ఇలాటివి ఇంకా ఎన్నో సన్నివేశాలు. బీనాదేవిగారి మణిపూస లాంటి నవల పేరే ఇంగ్లీషు పేరు—"Hang me quick" ("పుణ్యభూమీ కళ్ళుతెరూ" అని ఇంకోపేరుకూడా వుందనుకోండి). ఈ నవల "మిసెస్ రాజమ్మా - హౌడుయుడూ?" అనే వాక్యంతో మొదలవుతుంది. కొందరు బాగా చదువుకున్న వాళ్ళుంటారు. వాళ్ళు తమ మాతృభాషలో మాట్లాడుతూ వున్నా, మధ్యలో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజంట్లకు, శ్రేయోభిలాషులకూ మా నూతన సంవత్సర శుభాకాంక్షలు.

—ఎడిటర్

ఇంగ్లీషులోకి స్విచ్ ఆన్ అయిపోతూవుంటారు. వీళ్ళు తమ భావాన్ని విప్పిచెప్పడానికే తప్ప—గొప్పకోసం ఇంగ్లీషు వాడరు. అటువంటి పాత్ర చిత్రిస్తున్నప్పుడు ఆంగ్లం వాడడం తప్పనిసరి ఔతుంది. 'మరోచరిత్ర" సినిమాలో 'బాలు' పాత్ర అటువంటిది.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే — పాత్ర చిత్రణకీ, భావస్పష్టీకరణకీ ఎంతవరకూ అవసరమో అంతవరకూ ఇంగ్లీషే కాదు ఏ భాషా పదాలనైనా వాడవచ్చు. అప్పుడే కలకాలం నిలిచే సాహిత్యం ఆవిర్భవిస్తుంది.

—ఎ. రామశాస్త్రి, విజయవాడ.

తెలుగు 'వాడి' గొంతు

తెలుగువాడి గొంతు, మరో తెలుగువాడి నూసి, 'హల్లో' అంటూ హాలోగా ధ్వనించినప్పుడే తెలుగుకు ద్రోహం జరిగింది. అంతేగాని, తెలుగు కథలకి ఇంగ్లీషు పేర్లు పెట్టడంతో కొత్తగా ప్రారంభం కాలేదు.

తెలుగు కథ సహజత్వానికి దగ్గరగా వుండాలని కోరుకొనేటప్పుడు, ఆ కథలోని పాత్రలు సమాజంలోని తెలుగువారి మాట తీరునికూడా తప్పకుండా ప్రదర్శించాలని అనుకోవడంలో తప్పులేదు. అయితే, సమాజంలో మన కక్కని పించే తెలుగువాడు ఇంగ్లీషు పదాలుపయోగించకుండా తెలుగు మాటలాడడాయె! పాత్రలు మాత్రం ఇంగ్లీషు పదాలుపయోగించకుండా తెలుగు రచయిత జాగ్రత్తపడాలని తెలుగువాళ్ళమే కోరుకుంటామాయె! తెలంగాణ తెలుగువాళ్ళు కొన్ని ఉర్దూ పదాల్ని తెలుగులో జాతీయంచేసి మాటలాడుతూంటే నాకే మాత్రమూ ఎబ్బెట్టుగా అనిపించదు. అలాగే రాయలసీమ తెలుగువాళ్ళు అవసరం కలిసిన తేలుగులో అరిస్తేకూడా పెద్ద తప్పుగా భావించన్నేను. కానీ, కలకత్తాలో కలిసిన ఇద్దరు తెలుగువాళ్ళు ఇంగ్లీషులో మాటలాడ్డం ప్రారంభిస్తే ఏమీ అనుకోకుండా వుండలేను. అంచేత జాతిలో జీర్ణించుకపోయిన దాన్ని తప్పుపట్టి ప్రయోజనం లేదు గనుక, 'మనం' సాధ్యమైనంతగా తెలుగులో ఇంగ్లీషు కలపకుండా మాటలాడ్డానికి ప్రయత్నిద్దాం! పిల్లల్ని తెలుగు బళ్ళకి పంపించేందుకు విశ్వప్రయత్నమూ చేద్దాం!!

—రాజ్‌కుమార్ మెహ్రా, గుంటూరు.

లాభమేవుంది

శ్రీ కాటూరి రవీంద్ర త్రివిక్రమ్‌గారి 'మనసు చెప్పిన కథ'లో లాంటి పాత్రల్ని నిత్య జీవితంలో మనచుట్టూ సంఘంలో చూస్తూనే వుంటాం. ఇంకా చెప్పాలంటే అలా బ్రతుకుతున్నవాళ్ళు నాకు ఒకరిద్దరు తెలుసు కూడా, (సభ్యతగురించి [illegible] రాయలేను.)

ఇంగ్లీషుని మరీ అంత అంటరానిదిగానూ, తెలుగు కథల్లోస్థానం వుండకూడనిదిగానూ పలువురు పెద్దలు రాయటం బాధ కలిగించింది. నామటుకు నేను పెద్దగా చదువుకున్న దాన్నికాను. మావారు నాచేత ఇంగ్లీషుభాషని మెరుగుపరిచే పుస్తకాలు స్వబోధకాలు చదివించి పండితురాల్ని చెయ్యాలని ఓడిపోయారు. అయితే నాకే ఆశ్చర్యం కలిగించే సంగతి ఒకటుంది. కథలలో ఎక్కడయినా నాకు తెలియని యింగ్లీషు మాటలు వుంటే వాటి అర్థం తెలుసుకునేదాకా తోచదు. వాటి ప్రయోగం నాకు బాగా గుర్తుండిపోతుంది. ఆ మాత్రంచేత నేను పండితురాల్ని అయిపోయానని కాదు. విష్ణుశర్మ పంచతంత్రం కథల్లో రాజకీయసూత్రాలు చెప్పినట్లు, కొందరు రచయితలు కథాగమనానికి యెలాంటి దెబ్బ లేకుండా ఇంగ్లీషు వాక్యాలు వాడి, నాలాంటి ఏ కొందరికో అవి నేర్పగలుగుతారు. వాటి వల్ల నష్టంకన్నా కొందరికయినా లాభం వుండవచ్చని నా అనుమానం.

—వి. శ్యామలారాణి, హైదరాబాదు.

అప్పుడెప్పుడో ఒకటి, రెండు సార్లు "జ్యోతి" చదివాను లెండి (ఆసక్తితో మాత్రం కాదు). కాని డిసెంబర్ నెల జ్యోతిని చదివాక ఈ ఉత్తరం వ్రాయకుండా ఉండలేకపోయానంటే నమ్మండి. ఇకముందు, ముందుకూడా ఇలాగే మీరు జ్యోతిని వెలిగిస్తూ వుండండి.

"జ్యోతి లో ఫలానాకథ బాగుంది, ఫలానా సీరియల్స్ బాగున్నాయి, లేదా ఫలానా "ఉత్తరాలు" శీర్షిక బాగుంది అని వ్రాయడంకంటే "జ్యోతి" చాలాబాగుంది అనడమే సమంజ

సంగా వుంటుంది. (కార్టూన్ల సంఖ్య పెంచితే బాగుంటుందని నా అభిప్రాయం.) డిసెంబర్ నెల జ్యోతిలో శ్రీ జి. విజయమోహనరెడ్డిగారి లేఖ చదివాను. మేము ఇతర రాష్ట్రాలలో వుంటూ తెలుగు తెలియని ఏజంట్లతో తెలుగు పత్రికలు తెప్పించుకోవడానికి పడే ఇక్కట్లు వారికేం తెలుసు? ఆంగ్లంలో "JYOTHI" అని వ్రాయడంవల్లే ఈ జ్యోతులు మా ఇంటి వరకూ వచ్చే అవకాశాలు వున్నాయి.

—దయానంద్, పంజాబ్.

డిసెంబరు సంచికలోని కథలు అన్ని ఎంతో బాగున్నాయి. ముఖ్యంగా అంగర వెంకట శివ ప్రసాదుగారి "సొమ్మొకవాడిదే-సోకువాడిదే," ఎంతో బాగుంది. పత్రికాముఖంగా వారికి నా ధన్యవాదాలు తెలియజేస్తారని ఆశిస్తున్నాను. మిగిలిన కథల్లో "మైకంత్రీ"కథ 'మధ్యేతరగతి మందహాసం' ఎంతో నచ్చాయి. సీరియల్స్ పేజీలు కొంచెం ఎక్కువచేస్తారనిఆశిస్తున్నాను.

—శ్రీమతి లక్ష్మిఅనూరాధ, రూర్కెలా.

జయసుధ, సుభాషిణిల ముఖచిత్రంతో వచ్చిన జనవరి"జ్యోతి" ఆకర్షణీయంగావుంది. ఉత్తరాల శీర్షికలో జరుగుతున్న చర్చ చాలా కుతూహలం రేకెత్తిస్తున్నది. "రైలు ప్రయాణం," "తప్పదుమరి" కథలు బాగా వున్నాయి. "యుగాంతం" ప్రారంభం చాలా బాగున్నది. మినీకథలు అన్నీ చాలా బాగుంటున్నాయి. కార్టూన్ల సంఖ్య పెంచితే బాగుంటుంది. "శిలువనెక్కిన క్రీస్తు" కొత్త తరహాగా వుంది. శ్రీశ్రీ నిధి విజయవంతమవ్వాలని కోరుకుంటున్నాను.

—సి. రంగనాధరావు, కాకినాడ.

జ్యోతి శ్రీశ్రీ నిధి

స్థలాభావం వల్ల ఈ సంచికలో జ్యోతి శ్రీశ్రీ నిధికి విరాళాలిచ్చిన వారి పేర్లు, నిధికి సంబంధించిన ప్రకటన ప్రచురించలేకపోయాము. ఈ వివరాలు వచ్చే సంచికలో యిస్తాము.

—ఎడిటర్

జనవరి '80 సంచికలో నాకు 'ముసురు' కథ చాలా నచ్చింది. తులసి బాలకృష్ణగార్కి నా నమస్కారాలు. ఇక్కడ మధ్యప్రదేశ్‌లో ఒక్క జ్యోతి మాత్రమే దొరుకుతుంది.

మేము ప్రవాసాంధ్రులమైనా, మాకు ఇక్కడ జ్యోతి లభిస్తున్నందుకు మేము ఎంతయినా సంతోషిస్తున్నాము. నాకు తెలుగు అంత బాగా వ్రాయరాదు. మేము యిక్కడ ఇరవై ఏళ్ళనుండి వుంటున్నాము. తప్పులున్న క్షమించగలరు. ఎందుకో ముసురు కథ చదివిన తరువాత ఈ ఉత్తరం వ్రాయాలనిపించింది.

— జి. జగన్మోహన్ రెడ్డి మధ్యప్రదేశ్.

అసలు కథ

జనవరి '80 "జ్యోతి"లో ప్రచురించిన "తప్పదుమరి" కథ ఆల్బర్టు మొరేవియా వ్రాసిన "కంటాక్ట్ విత్ ది వర్కింగ్ క్లాస్" (Contact with the working class) కథకు యధాతధమైన అనుకరణ. (The Wayward Wife and Other Stories by Moravia - Penguin, P P 161 to 175

—ఆర్. ఎస్. సాగర్, రాజమండ్రి.

సాంస్కృతిక విశేషాలు

బరోడా ఆంధ్ర సమితి

అంతర్జాతీయ బాలలసంవత్సరాన్ని పురస్కరించుకొని బరోడా ఆంధ్ర సమితి ఇటీవల మహారాజా శాయాజీ యూనివర్శిటీ జనరల్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో బాలల చే సాంస్కృతిక ప్రదర్శనా కార్యక్రమాలు నిర్వహించింది ఆనాటి కార్యక్రమానికి తొలుత అధ్యక్షుడు శ్రీ బాలుసు సూర్యకుమార్ స్వాగతం పలికారు. మూడు గంటలపాటు జరిగిన కార్యక్రమంలో సుమారు నలభైమంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రేక్షకులను రంజింపచేసింది. రచయిత్రిశ్రీమతి మాధవపెద్ది పుణ్య శీలాప్రసాద్ బహుమతి ప్రదానం చేశారు.

—ఎన్. దుర్గాప్రసాద్, కార్యదర్శి.



18 **సీరియల్**

స్వప్నాయి మోగుతోంది:

పురోహితుడి గొంతు తారాస్థాయిలో మంత్రోచ్ఛారణ చేస్తోంది. స్వప్న స్వప్నావిష్టురాలిలా కూర్చుని వుంది సుధీర్, స్వప్న నిన్న యాదగిరిగుట్ట వచ్చారు. ఈరోజు వివాహం అయింది. వివాహం జరిగిన రెండు గంటల తర్వాత కూడా, స్వప్న యింకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్న మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛారణ వింటూ అలాగే బొమ్మలా కూర్చుని వుంది. సుధీర్ బైట వరండాలో, పురోహితులతో ఏదో మాట్లాడుతున్నాడు. స్వప్నకి యిదంతా కలో, నిజమో యింకా అర్థం గావటం లేదు. ఇది వాస్తవమేనని మనసు అంగీకరించలేకపోతోంది.

సుధీర్ పురోహితుల్ని పంపి లోపలకి వచ్చాడు.

కుర్చీలో కూర్చుని, గోడకి వెనక్కి తల అనించి కళ్ళు మూసుకుని వున్న స్వప్న అడుగుల శబ్దం వినగానే మెల్లగా కళ్ళు తెరిచి చూచింది. గది లోపలకి వచ్చిన సుధీర్ ముగ్ధుడైనట్టుగా తదేకంగా, స్వప్ననే చూస్తున్నాడు. స్వప్న కూడా అతన్నే చూస్తోంది. సుధీర్ చెంపమీద నల్లటి కాటుక చుక్క అతని ముఖానికి వింత అందాన్ని తెచ్చింది. అతని కళ్ళలో, అనిర్వచనీయమైన ఆనందం కన్పిస్తోంది. అపురూపమైన వస్తువుని పొందిన గర్వం లీలగా మెరుస్తోంది. పెదవులమీద మనోహరమైన చిరునవ్వు నాట్యం చేస్తోంది.

"స్వప్నా!" అస్పష్టంగా, ఆత్మీయతగా వున్న ఆ పిలుపులో యీ ప్రపంచంలో

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్ చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందుకు సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్ష లయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది. క్రైస్తవ సన్యాసినిగా మారిపోవాలన్న స్వప్న నిర్ణయాన్ని మార్చి ఆమెను తనవైపుతిప్పుకోగలిగాడు సుధీర్.

వున్న మాధుర్యం అంతా నిండినట్టుగా వుంది. స్వప్న యింకా రెప్ప వాల్చకుండా అతనివైపే చూస్తోంది.

"ఏమిటలా చూస్తున్నావు?" దగ్గరగా వచ్చి అడిగాడు.

స్వప్న సమాధానం చెప్పలేదు. మనసు దిమ్మెరపోయినట్టుగా వుంది. మాటిమాటికీ మరీ మరీ అన్పిస్తోంది! యిదెలా సంభవం అయింది? ఎక్కడ సుధీర్! ఎక్కడ తను! జీవితం ఎంత చిత్రంగా యిద్దరినీ కలిపింది.

అతను స్వప్న గడ్డంపట్టి పైకెత్తాడు. "స్వప్నా! ఈ క్షణం నుంచి మనిద్దరి వ్యక్తిత్వాలు, ఆలోచనలు, జీవన గమ్యం, ఏకోన్ముఖం అయినట్టుగా అన్పిస్తోందినాకు. ఆ రోజు నువ్వు మీ మామయ్యతో వూరు వెళ్ళిపోయేటప్పుడు గొలుసు నాకు ఇచ్చేసావు గుర్తుందా? "దయయుంచి ఇక ముందెప్పుడూ, నా విషయంలో జోక్యం కలగజేసుకోకు. నన్ను యాచకురాలిని చేయవద్దు" అంటూ చీటీ వ్రాసావు. ఆ చీటీని చూడగానే నాకు చాలా బాధ అనిపించింది. నేను నీకు సాయం చేయకుండా వుండలేను. అది నిష్క దాతృత్వం, ఋణభావం అనుకుంటే నాకు వేదనగా వుండేది. నువ్వు యిచ్చిన గొలుసు నీకు తిరిగి యివ్వటానికే నిశ్చయించుకున్నాను. కానీ-ఏవిధంగానో తెలుసా" అతను మెడ దగ్గర షర్టులోపలకి ఒక్క-క్షణం చెయ్యి పోనిచ్చాడు. మరుక్షణంలో గొలుసు తీసి, స్వప్న మెడలో వేసాడు "ఇది ఎప్పటికయినాసరే యిలాగే తిరిగి యివ్వాలని అనుకున్నాను" అంటూనే, స్వప్నని జబ్బపట్టిలాగి లేవదీసాడు. "నా నిర్ణయం యింత త్వరగా నెరవేరుతుందని అనుకోలేదు. ఇప్పుడు చెప్పు. ఈ క్షణం నుంచి నీకోసం నేనేదయినా చేయవచ్చుగా? నాకు సర్వాధికారాలు వున్నాయిగా! నాకు చెప్పకుండా ఎప్పుడు వెళ్ళిపోతావో అనే భయం నుంచి నేను విముక్తుడిని అయానుకదూ!"

స్వప్న కళ్ళల్లో అప్పటికే నీళ్లు జలజల లాడుతున్నాయి. అది చూసిన అతను, స్వప్న తలని గుండెలకి అదుముకున్నాడు. స్వప్న ఏడ్చేసింది. ఆ ఏడుపులో వింత అయిన హాయి వుంది. మనసుకి సంకెళ్ళ భారం వదిలినట్టుగా సుఖం వుంది.

"స్వప్నా! నో! నో! ప్లీజ్!" అనునయంగా అన్నాడతను.

"నేను-నేను-యింకా నమ్మలేకపోతున్నాను."

అతను స్వప్న ముఖం రెండు చేతులతో పట్టుకుని, అగి గళ్ళ మీద ముద్దు పెట్టు కుంటూ "నేను కూడా అదే స్థితిలో వున్నాను" అన్నాడు.

"మీ-మీవాళ్ళంతా ఏమంటారు?"

"ఏమన్నా యిక చేసేదేం లేదుగా! ఆ తలనొప్పి అంతా నేను భరిస్తానుగా! నువ్వు మాత్రం కొద్దిరోజులు, చెవిటిదానిలా వాళ్ళ మాటలు వినకు. మూగదానిలా జవాబు చెప్పకు. ఎవరయినా నిన్ను ఏదయినా అంటే, అతను నన్ను పెళ్ళి చేసుకున్నాడు వెళ్ళి అతన్ని అడగండి అను! యింకా ధైర్యం వుంటే, మా జోలికి రాకండి అని బెదిరించు" అతను స్వప్న ముఖాన్ని గుండెలకు మళ్ళీ అదుముకున్నాడు. స్వప్నకి ఆ క్షణంలో అతని గుండెల్లో అలా తలదాచుకోవటం ఎంతో హాయిగా వుంది. అతను అంటున్నాడు "స్వప్నా! ఇదివరకు అయితే యిద్దరం ఒంటరివాళ్ళం. ఇప్పుడు ఒకరికి ఒకరు తోడు వున్నాం. ఈ ప్రపంచంలో మనిషికి సరైన 'నా అనే తోడు' వుంటే, సర్వలోకాల్ని ఎదిరించే శక్తి వస్తుంది. మనిద్దరం జంటగా, ఎదురయ్యే సమస్యల్ని ఎదుర్కొందాం. మనం వెళ్ళబోయే దోవ రాచబాట కానిమాట నిజమే. ఎత్తుపల్లాలు వుంటాయి. మనిద్దరం ఒకరిచెయ్యి మరొకరు దృఢంగా పట్టుకున్నంత కాలం, క్రిందపడతాం అనే భయం వుండదు. ఒకరిమీద ఒకరికి నమ్మకం వున్నంత సేపూ, ఎలాటి మాటలూ మన అనురాగాన్ని ఛేదించలేవు. స్వప్నా! నిన్ను పెళ్ళి చేసుకోవటంవల్ల ఎలాటి ఘర్షణ ఎదురవుతుందో నాకు తెలుసు. దాన్ని తట్టుకోవటానికి నేను సిద్ధంగానే వున్నాను. నావాళ్ళతో నేనుచేసే యుద్ధం చూసి భరించటానికి మాత్రం నువ్వు సిద్ధమై వుండాలి. తెలిసిందా?"


అతని గుండెలకి ముఖం ఆనించి కళ్ళు మూసుకుని వున్న స్వప్న తల తిప్పింది.

"ప్రతి సుఖంలోనూ ఒక యిబ్బంది వుండటం సహజం. అమ్మకి నేను ఒక్కడినే. ఆ ఒక్కడినే అవటం, చాలా విషయాల్లో నాకు లాభసాటిదే అయినా, ఈ విషయంలో మాత్రం యిబ్బందికరమైనదే. నా పెళ్ళి గురించి అమ్మ ఎన్నెన్నో కలలు కన్నది. యిలా పెళ్ళి చేసుకుని, అవిడ కలలు నేల రాచానని తెలుసు. కానీ....కానీ అమ్మ ఎప్పటికయినా నన్ను అర్థం చేసుకుంటుందనే నమ్మకం నాకుంది. ఎందుకంటే ఆవిడ ఏది చెప్పినా, ఏం చేసినా నా సుఖమే ముఖ్యంగా భావిస్తుంది."

స్వప్నకి అతని బాధ అర్థమైంది.

"నిన్ను పెళ్ళి చేసుకోవటంలో, నేను చేసిన పని సరయినదేనని నాకు బాగా తెలుసు. అమ్మ అర్థం చేసుకోవటానికి కొంత కాలం పడుతుంది. అమ్మని సుముఖం చేసుకోవటంలో నాకు నువ్వు సాయపడాలి స్వప్నా! నీ సహకారం వుంటే, ఆ పని సులభం అవుతుంది."

"తప్పకుండా! మనసా వాచా, నా శాయశక్తుల తప్పకుండా సహకరిస్తాను"



"థాంక్ యూ!"

"స్వప్నా! భార్యాభర్తల మధ్య ఒకరిపట్ల ఒకరికి అనురాగమే కాదు, అర్థం చేసుకునే సంస్కారం, మంచి మనసుంటే, ఆ దాంపత్యం ఎంతో హాయిగావుంటుంది! ఏ సమస్యల గాలులు, ఏ బాధల పెనుతుఫానులూ దాన్ని కదల్చలేవు."

"ఐ విల్ ట్రై! ఐ విల్ ట్రై" డగ్గుత్తికతో అంది స్వప్న.

* * *

సుధీర్ డ్రైవ్ చేస్తున్న కారు యింటి ముందు వచ్చి ఆగింది! అది చూడగానే నౌకరు, "అమ్మగారూ! అబ్బాయిగారు వచ్చారు" అంటూ కేక పెట్టాడు.

"అరుగో! అబ్బాయిగారు వచ్చేసారు!" చాటంత ముఖం ఆయినట్టుగా నవ్వుతూ అన్నాడు వంట అతను.

అప్పుడే స్నానంచేసి, పట్టుచీర కట్టుకుని పూజ గదిలోకి వెళ్ళబోతున్న అహల్యమ్మగారు ఆగి, భోజనాల గదిలోకి వచ్చింది.

అప్పటికే సుధీర్ లోపలకి వచ్చాడు. అతని చేతిలో ప్రసాదం వుంది.

"అమ్మా!" అంటూ తెచ్చి తల్లిచేతికి యిచ్చాడు.

"ఏమిట్రా యిది? ఎక్కడకి వెళ్ళావు?" అంది ఆవిడ.

"యాదగిరిగుట్ట వెళ్ళానమ్మా!"

ఆ పేరు వినగానే ఆవిడ ముఖం ప్రసన్నం అయింది. "వెళ్ళేవాడివి కాస్త చెప్పి వెళ్ళకూడదూ? ఎంత భయపడ్డానో తెలుసా? రాత్రంతా నిద్ర పోలేదు. ఏదో ఫైల్ చూస్తున్నవాడివి, ఎక్కడనుంచో ఫోన్‌వస్తే వెళ్లావని డ్రైవరు చెప్పాడు. రాత్రి రాకపోతివి. ఉదయం కోర్టువేళకి కూడా అంతులేవయ్యె. మామయ్యకి ఫోన్‌చేస్తే,

ఏ స్నేహితులతోనో, ఎక్కడో చిక్కడిపోయి వుంటాడులే అన్నాడు. ఎక్కడున్నా నాకు యింటికి ఫోన్ చేస్తాడు. చేయకుండా వుండడు అంటాను నేను. విమల, అత్తయ్య మధ్యాహ్నం వచ్చి, నా దగ్గర చాలాసేపు కూర్చుండి వెళ్ళారు. ఇదిగో గంటక్రితం కాబోలు, ఆ పెద్దమనిషి ఎవరో నిన్న నువ్వు 'అర్జెంట్‌గా పని మీద వెళ్తున్నాను. ఖంగారుపడద్దు. పని అవగానే వచ్చేస్తాను' అని వ్రాసి పంపిన చీటీ తెచ్చి యిచ్చాడు రాత్రి వచ్చి యిద్దామని అనుకుంటే ఆయన కూతురికేదో సుస్తీ చేసిందిట. ఆ చీటీ చూసిన తర్వాత తలస్నానం చేసి ఇదుగో, దేవుడికి దీపం పెట్టటానికి వెళ్తున్నాను" అంది. సుధీర్ కళ్ళలో తల్లిపొందిన ఆతృత చూస్తుంటే, జంకులాటిది కలిగింది.

"బట్టలు మార్చుకో! స్నానం చేసావా. కాఫీ తాగుదువుగాని!" ఆవిడ పూజ గదిలోకి వెళ్ళబోతూ అంది.

"ఒక్కసారి యిలా రా అమ్మా! చూడు. నీకోసం ఒక బహుమతి తెచ్చాను" తల్లి చేయిపట్టుకుంటూ నవ్వుతూ అన్నాడు.

"బహుమతా! ఏం బహుమతిరా!" అంది ఆవిడ.

"వచ్చి చూడమ్మా! నీకే తెలుస్తుంది!"

"ఈ వయసులో నువ్వు నాకు యిచ్చే బహుమతి మనుమలకంటే యింకేమీ వుండదు. ఆ పని నువ్వేటూ చేయడంలేదు. యింకే బహుమతి తెచ్చినా నాకు వుత్సాహం వుండదు. ఆనంధం కలుగదు." అంటూనే ఆవిడ కొడుకువెంట ముందు హాలులోకి వచ్చింది.

స్వప్న అక్కడ హాలులో కిటికీదగ్గర నిలబడి బైట మొక్కలవైపు తదేకంగా చూస్తోంది.

'నువ్వు ధైర్యంగా వుండాలి. నువ్వు పెళ్ళి చేసుకున్నది నాకోసం. నాకోసం అన్న సంగతి మర్చిపోకు.' ఆ మాటలు సుధీర్ ఇప్పటికి పెళ్ళి జరిగినప్పటినుంచి వేయి సార్లు అయినా, స్వప్న చెవుల్లో నూరిపోసాడు. స్వప్న మనసు పరీక్ష వ్రాయబోయే విద్యార్థినిలా వుంది.

"చూడమ్మా! నీకోసం ఎవరిని తీసుకువచ్చానో?" అతను తల్లి చేయి పట్టుకుని వేలుపెట్టి స్వప్న వైపు చూపిస్తూ అన్నాడు.

కిటికీలోనుండి బయటకు చూస్తున్న స్వప్న తల త్రిప్పి యిటువైపు చూపింది.

స్వప్నని చూడగానే అహల్యమ్మగారు నిటారుగా అయింది.

స్వప్న ఆవిడవైపే చూస్తోంది.

"ఈ అమ్మాయా!" వెనక్కి ఒక అడుగు వేస్తూ అంది.

"ఈ అమ్మాయా! నాకు బహుమతా! సుధీ! నీకు మతి పోయిందిరా!" అంది అవిడ.

"అమ్మా స్వప్నని యీ యింటికి తెచ్చాను! నీకు కోడలిగా! నాకు భార్యగా!-"

"ఏమిటీ!"

"అవునమ్మా! నిన్న - నిన్న నేను స్వప్నని యాదగిరిగుట్టలో పెళ్ళి చేసుకున్నాను."

ఆవిడ స్వప్నవైపు చూసింది.

స్వప్న మెడలో పల్చటి చీరలోనుంచి మంగళసూత్రాలు కన్పిస్తున్నాయి.

ఆవిడ, సుధీర్‌ని స్వప్నని, మార్చి మార్చి చూసింది. కొడుకువైపు తిరిగింది! ఆవిడ కళ్ళలో, కలలో కూడా వూహించలేని విషయం జరిగినట్టుగా నిర్ఘాంతపోయి చూస్తోంది.

"అమ్మా! నేను చేసిన పనేమిటో నాకు బాగా తెలుసు. నేనేం తొందరపడలేదు. నా మనసు బాగా కావాలని కోరుకొన్నదే చేసాను! అమ్మా-" అతను ఎర్రబడిన ముఖంతో అన్నాడు, "స్వప్నను నేను పెళ్ళి చేసుకున్నాను. నా భార్యగా యీ ఇంటికి తీసుకువచ్చాను. అమ్మా! నేను-నేను నీ కొడుకుని కదూ. నామీద యేమాత్రం అభిమానం వున్నా నన్నిప్పుడు యేమీ అనకు. స్వప్నని అవమానిస్తే నన్ను అవమానించినట్టే. ఆ సంగతి మర్చిపోకు!"

ఆవిడ రాయిలాంటి నిశ్చలత్వంతో నిల్చుండిపోయింది.

కొద్దిసేపు ఆ హాలులో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. అహల్యమ్మగారు, తన మనసులో రేగుతున్న, పెనుతుఫానుని, ఒక్క గుటకలో మింగినట్లుగా మింగింది. తర్వాత శక్తి కూడతీసుకున్నట్లుగా మెల్లని స్వరంతో అంది.

"స్వప్నా! ఎందుకిలా నిలబడతావు? సుధీర్ తన భార్యగా నిన్ను యీ ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్షణంనుంచీ యీ ఇల్లు నీది! యీ యింట్లో సర్వాధికారాలు నీకు వున్నాయి. వెళ్ళు. లోపలికి వెళ్ళు. అదిగో! ఆ కుడివైపున కనిపించే గదే సుధీర్ గది" అంది.

స్వప్న తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది.

పెద్దగా వీస్తుందనుకున్న పెనుతుఫాను పిల్ల తెమ్మెరలా తేలిపోయినట్లుగా వుంది.


సుధీర్‌వైపు చూసింది.

"వెళ్ళు స్వప్నా!" ఆనందం నిండిన ముఖంతో అన్నాడు.

స్వప్న లోపలికి వెళ్ళబోతుంటే అహల్యమ్మగారు పిలిచింది. 'యిలారా!'

స్వప్న అడుగులో అడుగు వేసినట్లుగా నడుస్తూ ఆవిడ దగ్గరకి వచ్చింది.

అహల్యమ్మగారు నడుందగ్గర పెట్టుకున్న తాళంచెవులగుత్తి తీసి, స్వప్న చేతికి యిచ్చింది. 'ఈ యింటి తాళంచెవులు యివి. ఇవి నీ కప్పగించడంతో నా బాధ్యత తీరింది. ఈ క్షణంకోసమే నేను కలలుగన్నాను. మావాడి పుణ్యమా అని నా కలలు బాగా పండాయి."



స్వప్న తన చేతిలో బలవంతంగా పెట్టబడిన తాళం చెవులగుత్తివైపు, సుధీర్ వైపు అయోమయంగా చూసింది.

"లోపలికి వెళ్ళు స్వప్నా!" అన్నాతను.

స్వప్న లోపలికి వెళ్ళింది.

స్వప్న వెళ్ళగానే, సుధీర్ తల్లిచేయి అందుకుని, అందులో ముఖం దాచుకున్నాడు. "నువ్వు యెంత మంచిదానివి అమ్మా! నేను అనవసరంగా భయపడ్డాను. ఏదేదో అనుకున్నాను."

"సుధీ! నన్ను-నన్ను మామయ్యదగ్గర దించిరా!"

"ఇప్పుడా? ఎందుకమ్మా!" తలెత్తుతూ అడిగాడు.

"కారణాలు అడగకు! నువ్వు దింపనంటే నేను యే టాక్సీలోనైనా, ఆటోలోనైనా వెళ్ళిపోతాను."

"ఏముటమ్మా యిది-" అతను ఖంగారుగా చూసాడు.

"చూడు! నేను మీ అమ్మను కదూ! నామీద నీకేమాత్రం అభిమానం వున్నా నా మాట కాదనకు! నన్నిప్పుడు యేమీ అనకు."

"అమ్మా!"

"అమ్మని నువ్వు నిన్ననే మర్చిపోయావురా! నువ్వు-నువ్వు ఎవరిని చేసుకున్నా నేనేమీ అనేదాన్ని కాదు. కానీ - కానీ ఒక హత్య చేసిన ఆ అమ్మాయిని వద్దు; నీ యిష్టంతో చేసుకున్నావుగా నేనేమీ అనను!" హఠాత్తుగా ఆవిడ సోఫాలో కూలబడి ఏడవసాగింది.

(సశేషం)

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

హంసలా కలకాలం

చెహరా వెంకటసుబ్బారావు

అయ్యగారు తోటలోకి వచ్చారని గంగులు చెబితే నమ్మలేదు పోలయ్య. తనపని చూసుకొంటున్నాడు. తోటకి చుట్టువున్న ముళ్ల కంచెను సర్దుతున్నాడు.

"అయ్యగారొచ్చినార్రా మావాఁ" మరలా అన్నాడు.

తనమాట నమ్మనందుకు చీకాకూ, పోలయ్య అయ్యగార్ని చూడ్డానికి వెళ్లనందుకు భయమూ ధ్వనించాయ్ గంగులు మాటల్లో.

వెనక్కు తిరిగి చూసాడు పోలయ్య. ఆశ్చర్యపోయాడు. చివాల్న లేచి.

"ఎంత సేపయిందిరా అయ్యగారొచ్చి?"

భయంగా అడిగాడు.

"ఇప్పుడే మావాఁ" చెప్పాడు గంగులు.

గబగబా కొబ్బరిచెట్టుఎక్కి రెండు కాయలు దించాడు. అయ్యగారి దగ్గరికి పరుగెత్తుకొని వెళ్లాడు. అయ్యగార్ని సమీపించి.

"కొబ్బరి బొండాలు తెచ్చానయ్యగారూ" అన్నాడు వినయంగా.

ఆ అయ్యగారు పోలయ్య మాటలను వినిపించుకోలేదు. ఎటో చూస్తూ పరధ్యాన్నంగా వున్నారు. అటువేపే చూశాడు పోలయ్య కూడా.

ఎదురుగా కొంచెం దూరంలో రెండు కోడి పిల్లలు పోట్లాడుకొంటున్నాయ్....రెక్కలు విచ్చుకొని ఒకదానిమీది కొకటి ఎగుర్తూ కాళ్ళతో తన్నుకొంటున్నాయ్. తల్లి కోడి కొంచెం దూరంగా పోవడంతో ఆ పిల్లలు తమ పోట్లాటను విరమించుకొని తల్లి దగ్గరికి పోయాయ్.


"మంచి ఎండలో వచ్చారు, తీసుకోండి బాబూ! పంచదార నీళ్ళలా వుంటాయ్!" అన్నాడు మరలా.


అయ్యగారు బొండాంని అందుకొని త్రాగడం మొదలుపెట్టారు. అయ్యగారివైపే చూస్తూ వుండిపోయాడు పోలయ్య. అయ్యగారిలో యిదివరకటి వుత్సాహమూ మందహాసమూ కన్పించలేదు. చీకాకుగా కన్పిస్తున్నారు. తనకు తెల్సినంతలో అయ్యగారు ఆ కొబ్బరి తోటలోకి రావడం చాలా అరుదు. గత పది సంవత్సరాల్లోనూ అంటే తాను పనికి కుదిరిన తర్వాత అయ్యగారు ఏ నాలుగైదు సార్లో వచ్చి వుంటారు. ఒంటరిగా యెప్పుడూ రాలేదు. ఈమధ్య మినిష్టరుగారయ్యాక అసలు వూళ్ళోకే రావడం ఘూనేశారు. వచ్చినా ఎంతో కాలం వుండరు. ఎప్పుడూ హైదరాబాదులోనే వుంటూ వుంటారు. లేదా కేంపులు తిరుగుతూ వుంటారు. ఎలక్షన్లు అయాక అంటే అయ్యగారు ఎల్లక్షన్లలో గెలిచాక అదే చూడ్డం పోలయ్యకి. అయ్యగారు గతరాత్రి వూళ్ళోకి వచ్చారని తెల్సింది. వెళ్ళి ఒకసారి చూడాలనుకొన్నాడు. అయ్యగారే తోటలోకి ఒంటరిగా రావడం ఆశ్చర్యం వేసింది పోలయ్యకి.

"బాబుగారూ!" అని సంకోచిస్తూ ఆగిపోయాడు పోలయ్య.

అయ్యగారు తమ చూపుల్ని పోలయ్యవైపు మరల్చారు. యేమిటో అడగమన్నట్లు చూశారు.

"మనం ఎలచ్చన్లో గెల్చినాం గందా! ఆ





రచయిత గురించి



బర్మా మనదేశంనుండి విడిపోవడమూ, తూర్పుగోదావరిజిల్లాలో శ్రీ బెహరా వెంకటసుబ్బారావు పుట్టడమూ ఒకే సంవత్సరంలో జరిగాయి. విజయనగరం జిల్లాలో 'పూసపాటిరేగ' గ్రామంలో సబ్‌పోస్టుమాష్టరు వుద్యోగం. ఇప్పటివరకూ సుమారు నలభైకథలు అన్నిప్రముఖ వార మాస పత్రికల్లోనూ ప్రచురించ బడ్డాయ్. 1977లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక వారు నిర్వహించిన దీపావళి కథల పోటీలో సంపాదకుని బహుమతితోబాటు ఆ పత్రిక వారు నిర్వహించిన పాఠకులబ్యాలట్‌లో వీరి "వన్ మినిట్" కు ప్రథమ బహుమతి లభించింది.

పియ్యే బాబూ, కార్లూ మరిగంటే ఆడు ఆడి పేరు తెల్దు! ఎప్పుడూ మీ ఎనకాలే వుండేవాడు ఆడూ యింకా రానేదేం బాబూ? ఆళ్ళంతా ఎనకాల కార్లో వత్తామన్నారా బాబూ?"

పోలయ్య అమాయకపు ప్రశ్నలకి చిరునవ్వు చిందించారు మాజీ మంత్రి శ్రీశ్రీ తిరోగమనపు తిరుమలరావుగరు.

అయ్యగారి పెదవులపై చిరునవ్వు చూశాక కొంత ధైర్యం వచ్చింది పోలయ్యకి. చొరవ తీసుకొన్నాడు.

"అవును బాబూ! ఆరు హుడా యిమానంలో వత్తే కరుసులు దండగ! కారులోనే రానీయండి!" అన్నాడు.

అయ్యగారు యిదివరకటిలా హైదరాబాదు నుండి విమానంలోనే వచ్చారనుకొన్నాడు.

"వాళ్ళెవరూ రా రు రా!" తగ్గుస్వరంలో. అన్నారు తి.తి. రావుగారు.

ఆశ్చర్యపోయాడు పోలయ్య.

"ఎందుకు రారు బాబూ? మనం ఎలెచ్చన్లో గెల్చినాంగందా! పదివేలా? పాతికవేలా? దగ్గిర దగ్గిర రెండు లచ్చలు కరుసయినాయ్! ఈపాలి అదేదో కొత్త పారిటీ కళ్ళెంపట్టిన రౌతంట! అక్కడెక్కడో గెల్చినాదని యిక్కడికూడా పారొచ్చింది! మన కరుసును పెంచీసినాది! తవఁరు సెప్పనేక పోనారా బాబూ! పియ్యేల్ని ఆళ్ళనీ పంపించమని!"

వాడి అమాయకపు ధోరణికి ఆశ్చర్యపోయారు తి.తి. రావుగారు.

"మన కలాంటి సిబ్బంది వుండరురా!"

సౌమ్యంగా చెప్పారు.

"ఎందుకుండరు బాబూ?" దబాయించాడు పోలయ్య.

"ఇక మీదట మనం మంత్రి కాదు కాబట్టి!"

షాక్ తిన్నాడు పోలయ్య.

"ఎందుకు మంత్రిగారు బాబూ? తవఁరు గెల్సినారు గందా?"

"మనం గెల్చాం! కానీ ఏం లాభం? మన పార్టీ మనుషులు యెక్కువగా గెలవలేదు! ఆ బెత్తం పార్టీ మనుషులు యెక్కువమంది గెల్చారు!"

"ఏ పారిటీ మనుషులు ఎక్కువమంది గెలిస్తే మనకేం బాబూ! మనం గెల్సినాం! ఇదివరకటినాగే తవరికి మంత్రి పదవి రావల!

గట్టిగా తవరు అడగలేదు గావాల!"

వాడికి యెలా చెప్పాలో తెలియక తికమక పడ్డారు తి.తి. రావుగారు.

"మన పార్టీవాళ్ళు కారురా! వాళ్ళ పార్టీ ఎమ్మెల్యేలంతా కల్సి ప్రభుత్వాన్ని యేర్పాటు చేసుకొన్నారు. వాళ్ళ పార్టీ మనుషులకే మంత్రి పదవు లిస్తారు. మనం గెల్చి లాభం లేదు!"

అయ్యగారి మాటల్లో నిరాశా నిస్పృహా వెల్లడికాయ్.

"రెండు లచ్చలు కరుసుసేసి యిరవై వేలు మెజారిటీతో గెల్చిన మనవూ ఆ ఓడిపోయిన కళ్లెం పట్టిన రౌతు గుర్తు నూకరాజూ ఒకటే నంటారాబాబూ! అలా అనకండి బాబూ! తవఁరు మినిట్టరు గావాల! మినిట్టరుగారి కమతంలో పని సేత్తున్నావఁని యింతకాలవూ౹ సెప్పుకొనేవాళ్ళం! తవఁరు హంసలా కలకాలవూ౹ జీవించాల! తవరి పాదాలకాడ మేం గర్వంగా బతకాల!"

కన్నీరు నింపుకొన్నాడు పోలయ్య. తనకే మంత్రిపదవి పోయినంతగా ఏడ్చాడు. వాడికి స్వామిపై వున్న భక్తి విశ్వాసాలకి ముగ్ధులయ్యారు అయ్యగారు.

కళ్ళను వొత్తుకొని మరలా అన్నాడు పోలయ్య.

"బాబూ!"

"..........."

"మరి గంటే, ఆ పార్టీవోళ్ళకయితే మంత్రి పదవి రావడం ఖాయమే అంటారా బాబూ?"

"ఖాయం కాకపోయినా దొరికే అవకాశం వుంటుందిరా!"

"అయితే వో పని సేద్దాం బాబూ!" రకీమని అన్నాడు.

ఏవిటన్నట్లు చూశారు మాజీమంత్రి శ్రీ తి.తి. రావుగారు.

"మనవూ౹ ఆరి పారిటీలోకే పోదాం బాబూ! ఏ పారిటీ అయితేనేం! తవఁరు మంత్రి గావాల! మాకు సంతోషంగుండాల!"


నిస్సంకోచంగా తనకు తోచినది చెప్పాడు పోలయ్య.

తి.తి. రావుగారు మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డారు.

"పార్టీ ఫిరాయింపు!" ఆ ఆలోచన తనకెన్నోసార్లు వచ్చింది. తన బంధుమిత్రులు చాలామంది ఆ సలహా యిచ్చారు కూడా. ఇప్పుడు అమాయకుడూ నిష్కల్మష హృదయుడూ అయిన పోలయ్య కూడా అదే మాట! పార్టీ మారితే? మంత్రి పదవి లభిస్తుందన్న గ్యారంటీ లేదు. అప్పటికే తనకన్న సీనియర్లు పార్టీ మారి అధికార పార్టీలోకి చేరిపోయారు. అయినా వారికి మంత్రిపదవి లభించిందా? లభించకపోయినా అధికార పార్టీవాడు కాబట్టి అనేక విధాల లాభాలూ సదుపాయాలూ వుంటాయ్! ఎలక్షన్ల ముందు సభల్లో తన నియోజక వర్గంలో చాలా గ్రామాలకి రోడ్లు వేయిస్తానని వాగ్దానం చేశాడు. కొందరి పెద్దలకి ఆ రోడ్ల కాంట్రాక్టులు యిప్పిస్తానని హామీలు యిచ్చి తన బలాన్నీ బలగాన్నీ బాగా పెంచుకొన్నాడు. బస్సు సౌకర్యాలు కల్గిస్తానని రోడ్లు కూడా లేని మారుమూల గ్రామస్తులకి ప్రామిస్‌లు పారేశాడు. తనను ఆశ్రయించుకొని ఆశతో తిరిగేవాళ్ళకి పర్మిట్లూ కాంట్రాక్టులూ యిప్పించాలి. తన ప్రజ తనమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. అవన్నీ సాధించాలంటే ఎలా? అధికార పార్టీలో చేరిపొమ్మని ఎంతోమంది ప్రోత్సహిస్తున్నారు. ఆఖరుకు పోలయ్య కూడా అదే మాట! అలా అయితే తన పరువు? ప్రతిష్ఠ? పార్టీ ప్రెస్టేజీ! అప్పైన పోలసీ మాట?

ఆ మధ్య అంటే అసెంబ్లీ ఎలక్షన్ల ముందు ఒక ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకుడు ఒక రోజల్లా తన చెవిని యిల్లు కట్టుకొని హితబోధ చేశాడు. కొంచెం బంధుత్వం కూడా కలిపి చనువు తీసుకొని హెచ్చరించాడు కూడా.

"ఓ తిరుమలయ్యా ఆఖరిసారిగా నే చెప్పేది విను! విని నిదానంగా ఆలోచించు. త్వరలో ఒక



నిర్ణయానికి రా! హైస్కూలు మొహం కూడా చూడని నీకు మంత్రి పదవి ఎలా లభించిందనుకొన్నావ్? ఎందుకిచ్చారో తెలుసా? నీకి జిల్లాలో పలుకుబడి వుంది. బలగం వుంది. ఆ మధ్య నీవు పార్టీ మారే ప్రయత్నంలో వున్నట్లు పుకార్లు పుట్టాయ్. మీలో మీరు చెవిలో గుసగుసలాడుకొన్నా మీ మాటలు రాజధానికి విన్పించాయ్. నీవు నిష్క్రమిస్తూ నీతోబాటు మరో పదిమందిని బయటకు లాక్కుపోతావని వాళ్ళకి తెల్సు! అందుకే ఈ సంధ్యా సమయంలో నీకో మంత్రి పదవిని పారేసారు. ఇదెంత మూడునెలల ముచ్చట! మరో మూడు నెలల్లో అసెంబ్లీకి ఎలక్షన్లు జరగబోతున్నాయ్. మీ పార్టీ మరలా అధికారంలోకి రావడం అసంభవం! ఒకవేళ అధికారంలోకి వచ్చినా నీకు తిరిగి మంత్రి పదవి లభించడం యెలాగూ వుండదు. నీకన్నా చదువూ, పలుకుబడీ, డబ్బూ వున్నవాళ్ళు యెంతోమంది వున్నారు. నీ శ్రేయస్సు కోరి చెబుతున్నా! రా! మా కొత్త పార్టీలోకి వచ్చి చేరు! నీ భవిష్యత్తు దివ్యంగా వెలుగుతుంది!"

ఆ హితబోధకు ప్రభావితుడు కాలేదు తాను. కారణం? తాను ప్రస్తుతానికి మంత్రి! రాకరాక వచ్చిన పదవి! మూడు నెలలైనా మూడు వారాలైనా మంత్రి మంత్రే! ఆ తర్వాత మాజీ మంత్రి! కాకిలా కలకాలం బతికే కన్నా హంసలా ఆరునెల్లు కాదు ఆరు వారాలు బతికినా చాలు! అయినా తన పార్టీ ఓడిపోవడం జరగని పని. ముఖ్యమంత్రికి తన మద్దత్తునూ విశ్వాసాన్ని ఎల్లవేళలా ప్రకటిస్తూన్న తనకు మరలా మంత్రి పదవి రావడం ఖాయం! అయితే తాను గెల్చి పార్టీ కాండిడేట్లు చాలా మంది ఓడిపోతే! ఛీ! ఈలాంటి ఆలోచన రావడానిక్కూ ఆస్కారంలేదు! రూలింగ్‌పార్టీ ఓడిపోవడమా?"

అలా అప్పట్లో చాలారోజులూ వారాలూ ఆలోచిస్తూ గడిపారు తి.తి. రావుగారు. మంత్రి పదవినీ, పార్టీనీ వదలుకోలేక పోయారు.

పర్యవసానం? తాను కాకిలా ఏకాకిగా జీవించాలి!

మరలా ఆలోచనలో పడ్డారు మాజీ మంత్రిగారు. బాగా చీకటిపడేవరకూ తోటలోనే గడిపారు. మనశ్శాంతికోసం ఏకాంతంగా గడపాలని వెళ్ళినా శాంతిలేదు! విశ్రాంతిలేదు. ఇల్లు చేరేసరికి రాత్రి అయింది. అర్ధాంగి తృప్తి కోసం అయిదు పుంజీల మెతుకులు మేసారు.

రాత్రి నిద్రపట్టలేదు. గడియారం కొట్టే గంటలు లెక్కపెడుతూ గడుపుతున్నారు.

తనను రాజకీయాల్లోకి దించి తన్నింతవాడిని చేసిన గురువూ, ప్రముఖ రాజకీయనాయకుడూ మాజీ మంత్రీ (తనలాగే) అయిన ఆదినారాయణగారు జ్ఞప్తికి వచ్చారు. ఎలక్షన్ల ముందు ఒకనాడు ఆయన రాజకీయపు భగవద్గీత చదివి వినిపించారు. అర్థ తాత్పర్యాలు విడమర్చి చెప్పారు.

"...కావున ఓ తిరుమలా! ఎన్ని అవాంతరాలు వచ్చినా అవరోధాలు కల్గినా, ఎదురుదెబ్బ తగిలినా పరాజయం పొందినా పార్టీ ఫిరాయింపు

మాత్రమూ యెన్నడూ చేయకు; కనీసం ప్రోత్స హించకు; అది క్షమించరాని నేరం; మాతృ మూర్తికి చేసిన ద్రోహంతో సమానం; నన్నడిగితే పార్టీకి పెట్టుకొనే ప్రాథమిక దరఖాస్తు ఫారంలోనే ఈ విధమైన ప్రతిజ్ఞ లేక ప్రమాణం యిరికించాలి. నేనే కనుక పార్టీ అధ్యక్షుణ్నయితే ఆ విధంగా ఒక ప్రమాణాన్ని దరఖాస్తు ఫారంలోనే పొందుపరుస్తాను. ఈ పార్టీ ఫిరాయింపు నిషేధిస్తూ ఓ శాసనం చేయా అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలనుకొంటున్నాను;

"ఇంకా చెప్పేది సావధానంగా విను; పార్టీలు మార్చేవానిపై ప్రజలకు అంటే ఓటర్లకు సదభిప్రాయం వుండదు; దురభిప్రాయం కలుగుతుంది. ప్రజలు అనగా ఓటర్లు నిన్ను అనుమానిస్తారు; అపైన అవమానిస్తారు; నీచంగా చూస్తారు; పురుగును చూసినట్లుగా విదిలించుకొంటారు. రేపు వాళ్ళింటికి వెళ్ళి ఓటివ్వమని అడిగితే——

"రేపొద్దున్న గెల్చాక మరలా పార్టీ ఫిరాయించవన్న గ్యారంటీ యేవిటి?" అని నీ మొహాన్నే అడిగేస్తారు. మొడబట్టి గెంటినా ఆశ్చర్యపోనవసరంలేదు. నీలోని ఈ లోపాన్ని నీ ప్రత్యర్థులు ఆసరాగా తీసుకొని తమ ప్రచారాన్ని సాగిస్తారు; పార్టీలు మార్చేవాణ్ని నమ్మి ఓటు వేసి గెలిపించి మిమ్మల్ని మీరు మోసగించుకోకండి; తద్వారా దేశానికి ద్రోహం చేయకండి; ఆ తర్వాత విచారించి లాభంలేదు; రాజకీయాల్లో నిలకడలేనివాడినీ, పార్టీలు మార్చేవాడినీ, రంగులు మార్చే వూసరవెల్లుల్నీ యెన్నుకొని మీరు సాధించేది ఏదీలేదు;" అని యింకా కొన్ని కల్పించి నీమీద దుష్ప్రచారం చేస్తారు.

కనుక ఓ తిరుమలా....!" అని యింకా ఏవేవో కొన్ని అధ్యాయాలు చదివి విన్పించారు ఆదినారాయణగారు ఆనాడు.

నిజానికి ఆయనకు తానెంతో ఋణపడి వున్నాడు. తననీ స్థితికి తెచ్చినవాడు ఆయనే.

పార్టీ మార్చమని అంతరాత్మ ప్రబోధం ఒకవైపు....గురువుగారి హితబోధ మరియొక వైపు. మధ్య నలిగిపోతూ జాగరణ చేశారు మంత్రి శ్రీ తి.తి రావుగారు. తెల తెలవారుతూండగా ఓ నిశ్చయానికి వచ్చారు. గుండెలను చీల్చుకొని అంతరాత్మను తన పిడికిటికి తీసుకొని పీక పిసికి దూరంగా పారేసారు. అంతరాత్మకు చావు లేదని యెంతోమంది చెప్పినా నమ్మలేదు. కానీ కళ్ళారా చూసాక న్నమ్మక తప్పిందీగాదు!

అంతరాత్మ లేచి నిలబడింది. మందహాసం చేస్తూ మూడడుగులు ముందుకు వేసింది. జాలిగానూ సానుభూతితోనూ చూసింది. అయినా ఖాతరు చేయలేదు రావుగారు. గురువుగారి అడుగుజాడలలోనే నడవాలని నిశ్చయించుకొన్నారు. మనసును సమాధాన పరచుకొనే ప్రయత్నంలో పడ్డారు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

అయ్యగారికి తెలివి వచ్చేసరికి రెండు బారలు పొద్దెక్కింది. నిద్ర లేవగానే ఎదురుగా వున్న టీపాయ్‌మీద ఆనాటి "ఈనాడు" కనిపించింది. తీసి హెడ్డింగులు చదవటం మొదలెట్టారు.

మొదటి పేజీలోనే అడుగున వున్న హెడ్డింగును చూసి నిర్ఘాంతపోయారు.

"మాజీ మంత్రి శ్రీ అవకాశం ఆదినారాయణగారు అధికార పక్షంలో చేరిక."

కళ్ళు బైర్లు కమ్మాయ్ తి. తి. రావుగారికి.

కళ్ళు నులపుకొని, చేతిని గిల్లుకొన్నారు. ఆ వేరామ పూర్తిగా చదివారు. హతాశయులయ్యారు.

దూరంగా నిలబడి తనను గమనిస్తూ మందహాసం చేస్తూన్న అంతరాత్మను చూస్తూ మరలా మంచంమీదికి ఒరిగిపోయారు.

అంతరాత్మ విజయగర్వంతో తిరిగి ఆ మజీ మంత్రిగారిలో ప్రవేశించింది.

"కాకిలా కాదు; హంసలా కలకాలం జీవించు;" అంది. □

బ్రహ్మపదార్థం

కప్పగంతుల మల్లికార్జునరావు

మనుష్య మొహం కన్పించని ప్రతి రాయినీ రప్పనీ దేవుడేననుకొని దండాలు పెట్టేవాడు చిరంజీవి. చిన్నతనంలో అతనికి అదో హాబీగా తయారవటానికి తగిన కారణాలు లేకపోలేదు.

చిరంజీవి తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. తల్లి మూసివాయనాలు పట్టుండేది. అవసరమైతే వంటలు చేసేది. ఎన్ని చేసినా ఆ ఇంట్లో దరిద్ర దేవత ఎప్పుడూ తాండవిస్తూనే వుండేది.

"దేనికయినా కాలం ఖర్మం కలిసిరావాలి. ఆ భగవంతుడికి మనమీద దయ కలగాలే కానీ సిరి తోసుకు రావటం ఎంతసేపు!"

సిరి తోసుకొచ్చే కాలం కోసమే చిరంజీవి దేవుళ్ళని ప్రార్థించటం అలవాటు చేసుకొన్నాడు. కానీ ఆ కాలం ఎంతకూ రాదేం?

"ఇలా కన్పించిన రాయికీ రప్పకూ సాష్టాంగ దండ ప్రమాణాలు చేయటం 'రిడిక్యులస్'గా వుంటుంది చిరంజీవీ. భారతీయులంటే విదేశీయులకి అందుకేట అంత చులకన; దేడీ చెప్తుంటాడు" రుక్మిణి అలా మందలిస్తూ చిరంజీవి ధోరణిని కంట్రోల్ చేస్తుండేది.

రుక్మిణి పెద్ద ధనవంతుల బిడ్డేం కాదు. ఆమె తండ్రి ఆఫీసర్. జీపులు, నౌకర్లు వుండటంవల్ల వాళ్ళ కుటుంబం గొప్పహోదాలో దర్జాగా వున్నట్లు కన్పించేది. దానికి తోడు రుక్మిణి తండ్రి ఆ హోదాను మెయింటైన్ చేసేవాడు. పిల్లల్ని కాన్వెంటులో చేర్చేడు. అప్పుడప్పుడూ వంట చేయటానికి చిరంజీవి తల్లిని పిలిపించేవాడు.

దేవుడిని నమ్ముకోవటంవల్ల చిరంజీవికి చిన్నమెత్తు వుపయోగం జరుగలేదు. సిరి తోసుకొచ్చేకాలం రానేలేదు. పైగా అందరు దేవుళ్ళకూ అన్నన్ని నమస్కారాలు పెట్టుకొనిపోయి పరీక్ష రాస్తే అది కాస్తా ఫెయిలయ్యాడు. మరునటిసారి దేవుడన్న వాడిని తల్చుకోనన్నా తల్చుకోకుండా పరీక్ష పాసయ్యాడు.

కాలేజీలో చేరేక చిరంజీవి ధోరణిమారింది. పచ్చి నాస్తికుడయ్యాడు. భగవంతుడిని తిట్టటం ఓ ఫేషన్ అయింది. హేతువాదం పేరిట చెలామణీ అవుతున్న నాస్తిక గ్రంథాలలోని సారాంశాన్ని అమ్మోనియంలా తలకెక్కించుకొన్నాడు. 'హేతువాది'నన్న బోర్డును మొహానికి తగిలించుకొని పెడవాదనలు చేయటం, వుపన్యాసా లివ్వటం అలవాటయింది.

'ఇదేం హేతువాదనయ్యా దేవుడా! హేతువాది మొదటి క్వాలిఫికేషన్ జిజ్ఞాస. హేతువాదం ప్రశ్నలతో ప్రారంభమవుతుంది. దేవుడి విషయమే తీసుకో. దేవుడు అంటే ఏమిటి? ఆ భావనాస్వరూపం ఎలా రూపు దిద్దుకొంది? రాతిని చూసి భగవంతుడనుకోవటంలో గల అర్థ పరమార్థా లేమిటి? యిలా ఆలోచించకుండా, భగవంతుడన్న భావనే మూర్ఖంగా కొట్టేయడం మూఢత్వంకాదూ? రాతిలో దేవుడున్నాడన్న వొక మూఢ విశ్వాసం నుంచి, అసలు దేవుడన్న కాన్సెప్టే తప్పనే మూఢ

విశ్వాసంలోకి పోవటం హేతువాదం అవుతుందా?'

'అయితే దేవుడున్నాడా? వుంటే కన్పించదేం? వొకప్పుడు రాతి విగ్రహాలకు దణ్ణాలు పెట్టే నన్ను నువ్వే ఎగతాళి చేశావుగా!' అలవాటయిన పద్ధతిలో ఉద్రేకంగా అడిగేవాడు.

'దేవుడు లేడయ్యా! రాతి విగ్రహాలలో అసలు లేడు. నీ మనసులో భావనకు సింబల్స్ అవన్నీ. అసలు కాన్సెప్ట్ అర్థం చేసుకోకుండా గుడ్డిగా దణ్ణాలు పెట్టేవని ఎగతాళి చేసేను కాని దేవుడు అన్న భావన వెనుక వున్న తత్వాన్ని అర్థం చేసుకోవద్దన్నానా?'

రుక్మిణి మాటలు చిరంజీవికి అంతుపట్టేవి కాదు. అర్థం చేసుకోవాలన్న ప్రయత్నం చేయటమూ చిరాకే. అతను అప్పటికే 'కమిటెడ్' హేతువాది అయిపోయాడు.

అయితే కాలేజీలో చదువు అతడిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది. రాజకీయాల్లోకి దిగేడు. అక్కడా రాణించలేదు.

ఈలోగా రుక్మిణి చదువులో ఎక్కొచ్చింది. అదే ఆమెపాలిటి శాపంగా పరిణమించింది. ఆమె సంపాదించుకొన్న యమ్మెస్సీ ఫస్టుక్లాసు డిగ్రీ ఆమె పెళ్ళికి ప్రతిబంధకమయింది.

తల్లి దండ్రులతో విసిగిపోయి కులాంతర వివాహం చేసుకోడానికి సిద్ధపడింది.

'అంతకాడికి నన్ను చేసుకోమంటే నేను చేసుకొనేవాడినిగా?'

రుక్మిణి అతడివైపు చురుగ్గా చూసింది. ఆలోచించి నెమ్మదిగా ఎగతాళిగా అంది

'మన మధ్య శాఖాభేదాలున్నాయిగా? వాటిని కాదనే ధైర్యం నీకు లేదనుకొన్నాను.'

చిరంజీవి భుజాలు తడుముకొన్నాడు. అహంకారం దెబ్బతింది. రోషంగా అన్నాడు

'ఏమిటి? శాఖలా గాడిద గుడ్డా? దేవుడినే కాదన్నవాడిని. హేతువాదిని. శాఖల్ని పట్టుకొని వేళ్ళాడతానని ఎలా అనుకొన్నావ్?'

"దేవుడిని ఎందుకు కాదన్నావ్? కోపం వచ్చి అలిగేవ్ - చిన్న పిల్లాడిలా. నువ్వు నమస్కారం పెట్టగానే అడిగినవన్నీ దేవుడన్నవాడుంటే నీకు యిచ్చెయ్యాలన్నది నీ తత్వం. అంతేకాని దేవుడంటే ఏమిటో, హేతువాద దృక్పథం ఏమిటో తెలుసుకోవాలని ఎన్నడు ప్రయత్నించావ్? అంత తెలివితేటలు, ధైర్యం వుంటే పెళ్ళి చేసుకోమని నువ్వే ఎన్నడో అడిగి వుండేవాడివి. పిరికివాళ్ళని, అప్రయోజకుల్ని నేను ప్రేమించలేను-గౌరవించలేను.'

ఆ తర్వాత యిద్దరి దోవలు వేరయ్యాయి. రుక్మిణికి పెళ్ళికి ముందే వుద్యోగం వచ్చింది. పెళ్ళి చేసుకొన్న కొద్ది రోజులకే భర్త ఏక్సిడెంట్‌లో చనిపోయాడు.

బ్రతకటానికి ఏ దోవా లేక, ఏ ఇండస్ట్రీలోనూ కూలిపనిచేసే శక్తి లేక, పొట్ట చేతపట్టుకొని సినిమా పరిశ్రమను వెతుక్కుంటూ మద్రాసు చేరుకొన్నాడు చిరంజీవి.

* * *

తండ్రి నుంచి చిన్నప్పుడు వినికిడిగా నేర్చుకొన్న ఎంగిలి మంత్రం ముక్కలు నాలుగు, వర్జ్యాలు, వారాలు చూడటం, శుభా శుభాలకు శకునాలు చెప్పటం— యివే చిరంజీవిని ముందుగా సినిమా పరిశ్రమకు పరిచయం చేసేయి. అయితే అక్కడా పోటీనే. ఎక్కలేకపోయాడు.

ఆ తర్వాత సుడిగాలిలో పడి కొట్టుకుపోయే పులిస్తరాకులా పదేళ్ళపాటు సినిమారంగంలో కొట్టుకులాడేడు. బతకటానికి తంటాలుపడ్డాడు. అతను వేలుబెట్టని శాఖలేదు. ఎందులోనూ వో కాలన్నా పూర్తిగా మోపే అవకాశం రాలేదు. ఏ పనీ కడుపు నిండా అన్నం పెట్టలేదు. అన్ని పనులూ ఆకలితో చంపకుండా అర్థాకలితో బ్రతికించేవే! భగవంతుడిని మనసులో ఎన్నిసార్లు పొడిచి పొడిచి చంపేడో!

"నీకు పట్టిన శని త్వరలో వదులుతుంది. నువ్వు పట్టిందల్లా బంగారమవుతుంది" పది పైసల చిలక జోస్యం అది. అవుతేనేం! ఆ రెండు ముక్కలే అతడిని చాలాసార్లు బ్రతికించేయి. రేపటిపైన ఆశను పెంచాయి.



చివరికి శని వదిలినట్లయింది. చిరంజీవి అసోసియేట్ డైరెక్టర్ అయ్యాడు. ఆహోదాలో పనిచేసిన అతని మొదటి సినిమా విజయవంతం కావటంతో గుర్తింపు వచ్చింది. రెండు కాళ్ళను సినిమా రంగంలో మోపుకొనే అవకాశం కలిగింది.

దాంతో అతనికి జ్యోతిష్యంమీద నమ్మకం పెరిగింది. భగవంతుడిపైన విశ్వాసం కలిగింది. కాని పైకి మాత్రం 'హేతువాది'నన్న బోర్డును చెరపలేదు.

అసోసియేట్-డైరెక్టరుగా పనిచేసిన నాలుగు సినిమాలు విజయవంతం కావడంతో అతనికి డైరెక్టర్‌గా ఛాన్స్ వచ్చింది.

అది తన జీవితంలో పెద్ద మలుపని అతనికి తెలుసు.

ఆ సినిమా విజయం, అపజయంపై తన భవిష్యత్తు ఆధారపడి వుంది.

ముహూర్తం రోజు ఉపవాసమున్నాడు. జపాలు చేసేడు. పూజను భక్తి విశ్వాసాలతో సిన్సియర్‌గా చేసేడు. పదిమంది జ్యోతిష్కులను సంప్రదించి పెట్టిన ముహూర్తానికి సినిమా ప్రారంభించాడు.

ఆ సినిమాలో అన్నీ అవాస్తవికాలే. పరస్పర విరుద్ధ సంఘటనలు, సంభాషణలు. అయినా అతని అదృష్టం బాగుంది. ఆ సినిమా హిట్టయి కూర్చుంది. చిరంజీవి హిట్ సినిమా దర్శకుల జాబితాలోకి ఎక్కి కూర్చున్నాడు.

రెండో సినిమా కూడా సక్సెస్ కావటంతో గ్లామర్ పెరిగింది.

కులంలో పిల్లను పెద్దవాళ్ళు కుదిరిస్తే కట్నం తీసుకొని హాయిగా పెళ్ళి చేసుకొన్నాడు.

తమాషా ఏమిటంటే అతని మూడో పిక్చర్ కుల వ్యత్యాసాలను ఖండించేది. కుల

వ్యత్యాసాలు సృష్టించిన భగవంతుడిని హీరోయిన్ నిలేసి ప్రశ్నలడిగే ఘట్టం జనం బుర్రలోకి బాగా ఎక్కింది. ఆ పిక్చర్ బంపర్ హిట్ కావడంలో అగ్రదర్శకుడయ్యాడు.

ఆ తర్వాత ఆరేళ్ళు అతను తీసిన సినిమా అల్లా డబ్బు సంపాదించింది. దర్శకుడి నుంచి అతను నిర్మాత కూడా అయ్యాడు. స్క్రీన్‌ప్లే తోపాటు కథ కూడా రాయటం మొదలు పెట్టేడు.

విజయాలు నెత్తిన వర్షించేకొద్దీ, ధనం అతని ఖాతాలోకి జమ అయ్యేకొద్దీ అతనికి మూఢ విశ్వాసాలు హెచ్చయ్యాయి. సెంటిమెంట్లు ప్రగాఢంగా మనసులో పాతుకు పొయ్యాయి.

వెంకటేశ్వరస్వామిని చూడందే కళ్ళు విప్పడు. శకునం చూసుకొని షూటింగ్‌కు కారులో బయలుదేర్తాడు. షూటింగ్ ఆరంభించే ముందు ఎవరూ తుమ్మటం యిత్యాది చెయ్యకుండా ముందే జాగ్రత్తలు తీసుకొంటాడు నిర్మాత. వొకవేళ పొరపాటున ఎవరయినా తుమ్మితే యిక ఆ వేళకి షూటింగు ఆగిపోయినట్టే.

పిక్చర్ పూర్తి కాగానే డబ్బాల్ని తిరుపతికి తీసుకెళ్ళి పూజలు చేయందే రిలీజ్ చెయ్యడు.

అయితే చిత్రం ఏమంటే అతను దర్శకత్వం వహించే ప్రతి సినిమాలోనూ భగవంతుడిని హీరోయిన్ తిట్టే ఘట్టం వొకటి తప్పనిసరిగా వుంటుంది. మూఢనమ్మకాలను ఏదో విధంగా హేళన చేయకుండా సినిమా తీయడు.

"హేతువాది" అన్న ముద్ర అతని మొహం మీద చెరగలేదు. కాగా దానిని పనిగట్టుకొని ప్రచారం చేయించుకోవటం అతనికున్న సర్దాలలోకల్లా గొప్ప సర్దా.

✻ ✻ ✻

వరుసగా రెండు సినిమాలు సూపర్ ఫెయిల్యూర్ కావడంతో చిరంజీవికి చింత పట్టుకొంది. కారణాలు అన్వేషించసాగాడు.

ఆ సినిమాలు మొదలు పెట్టిన ముహూర్తాలు బాగున్నాయి. శకునాల విషయంలో ఎక్కడా లోపం జరుగలేదు. డబ్బాలకు తిరపతిలో యధావిధిగా పూజలు జరిగేయి. మరి ఎక్కడొచ్చింది లోపం?

ఇన్వెస్టిగేషన్‌కి దూతల్ని పంపించాడు.

"గురువుగారూ! విజయవాడలో, ఆ పిక్చర్ రిలీజ్ అయిన సినిమా థియేటర్ల పేర్లకు సినిమా పేర్లకు శాస్త్రప్రకారం కుదరలేదు. హైదరాబాద్‌లోనేమో మొదటి టిక్కెట్ కొన్న వాడిది భస్మాసుర హస్తం."

పిక్చర్ మార్నింగ్ షోతో రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో వర్కింగ్ డే అయినా, థియేటర్ ముందు జనం గుంపుగా వున్నారు. టిక్కెట్లకోసం తోసుకుంటున్నారు. ఎండలో చమటలు కక్కుతూ తన్నుకొంటున్నారు. తన్నుకొంటూనే మధ్యలో సినిమాల్ని గురించి చిరంజీవిని గురించి చెప్పుకొంటున్నారు.

"ఈ పిక్చర్ కూడా తన్నిందంటే యిక చిరంజీవిగాడి పని గోవిందా!"

"వాడు నాస్తికుడట. అందుకే భగవంతుడికి కోపం వచ్చి...."

చిరంజీవి ఏజెంట్లు జనంలో రీయేక్షన్‌ను రికార్డు చేసుకుంటున్నారు.


నిజానికి చిరంజీవికి తెల్సు ఆ సినిమా కూడా ఫెయిల్ అయితే ఫీల్డులో యిక నిలదొక్కుకోవటం కష్టం. ఫ్లాప్ డైరెక్టరన్న ముద్ర వేస్తారు. డిమేండ్ పోతుంది. క్రమంగా అందరూ మర్చిపోతారు.

అందుకే చిరంజీవి క్రితం రాత్రి అంతా వుపవాసమున్నాడు. తెల్లవారిం దగ్గరనుంచి జపం చేస్తున్నాడు.

అప్పటికే షో టైం మించిపోయింది. మరి రిలీజ్ చేసే ముహూర్తం అలా కుదిరింది.

చిరంజీవి భక్తితో గల్లాపెట్టెకు పూజ చేసేడు. మేనేజర్ గదిలో పటాలకు సాష్టాంగ దండ ప్రమాణాలు చేసేడు. మొదటి టిక్కెట్ తన చేతులతో అమ్మటానికి సిద్ధంగా వున్నాడు.

కానీ కొనటానికి రావల్సిన వ్యక్తి యింకా రాందే!



"ఏమండీ మేనేజర్‌గారూ, కొనేమనిషి కోసం యిప్పుడా కబురు చేయటం? ఎన్నాళ్ళయింది కబురు చేసి?"

"నేనూ చాలారోజు లయిందండీ కబురు చేసి. కానీ ఆమెగారు సినిమా చూడనంటు న్నారుట!"

"త్రీ! జాకెట్టో చీరో యిస్తానని ఆశ పెట్టక పోయారా?"

"ఆమెగారిని తీసుకురమ్మని కారిచ్చి పంపించానండీ."

"మీ రెళ్ళాల్సింది.''

ఇంతలో ఆ ప్రేక్షకురాలి కోసం వెళ్ళిన కారు తిరిగి వచ్చింది. "ఆమె సినిమాకు రమ్మన్న ఆహ్వానాన్ని తిరస్కరించింది.

"పోనీ మరో మంచి హస్తవాసి వున్న ప్రేక్షకు...."

"నో—" చిరంజీవి కోపంగా అరిచాడు. "నా మొదటి సినిమాకు మొదిటి టిక్కెట్ కొన్న ప్రేక్షకురాలే నా చేతిమీద గుండా టిక్కెట్ కొనాలీ రోజు. యింకెంత టైం వుంది?"

"పది నిముషాలు మాత్రమే."

"అయితే పదండి. ఆ ప్రేక్షకురాలిని నేను స్వయంగా ఆహ్వానించి పిల్చుకొస్తాను."

అలాంటి మూఢత్వం సినీమారంగంలో వారికి కొత్త కాదు. అంచేత ఎవరూ ఆశ్చర్య పోలేదు.

కారు ప్రేక్షకురాలి ఇంటి ముందు ఆగింది.

చిరంజీవి ఆమె దర్శనం కోసం తొందర పడుతున్నాడు. ఆమె ఆలస్యంచేసి బయటి కొచ్చింది.

''రుక్మిణీ! నువ్వా?"

రుక్మిణి పట్టుచీరె కట్టుకొని వుంది. జుట్టు ముడి వేసింది. పెద్దరికపు హుందా అణువణు వునా కన్పిస్తోంది. బొట్టు లేకపోయినా మొహాన ఏదో వెలుగు!

సౌజ్ఞతోనే వందిమాగధుల్ని బయటకు పంపించేసేడు చిరంజీవి.

"నీ మొదటి సినిమాకు మొదటి టిక్కెట్ కొన్నది నేనే చిరంజీవీ! ఎందుకో తెల్సా? అంత పెద్ద నాస్తికుడివి, హేతువాదివి. ఎంత విప్లవాత్మకమైన భావాలతో సినిమా తీసేవో చూద్దామని వెళ్ళేను."

"ఆ సినిమా హిట్టయింది రుక్మిణీ! నీ చేతి చలవవల్లే నేనింత పెద్ద దర్శకుడినయ్యాను. నా కొత్త సినిమా యివాళ రిలీజ్ అవుతోంది. దీని మొదటి టిక్కెట్టూ నువ్వే కొనాలి."


"హేదువాదమంటే యిదేనా చిరంజీవీ!"

"ఆ చర్చలు తర్వాత చేసుకుందాం రుక్మిణీ! జనం టిక్కెట్ల కోసం చాలా సేపటినుంచి క్యూలో నిల్చుని వున్నారు. పైగా ముహూర్తం టైం...."

"నీ సినిమాలు నాలుగు చూచాక నాకు సినిమాలు చూడాలన్న వాంఛ చచ్చిపోయింది చిరంజీవీ. నువ్వు ఎన్ని కథలు తీసినా, ఎన్ని భావాలు చెప్పినా, అన్నీ వొక్క బ్రహ్మ పదార్థం చుట్టూ తిరుగుతాయి. ఆ బ్రహ్మ పదార్థం ఏమిటో నీకు నేను చెప్పక్కర్లేదు. డబ్బు. చిన్నప్పటినుంచీ నీ జీవితంలాగా, ఆలోచనా ధోరణిలాగా, నీ సినిమాల్లోనూ అస్పష్టత, అస్తవ్యస్తత కన్పిస్తుంది. ఐడోంట్ లైక్ హిపోక్రసీ అండ్ ఐ కెనాట్ టాలరేట్ యువర్ జిమ్నాస్టిక్స్."

చిరంజీవికి ఎడాపెడా చెంపదెబ్బలు కొట్టి నట్లయింది. మాట్లాడలేకపోయాడు.

"ఆశకొద్దీ ముందు అస్తికత్వాన్ని నటించావు. వోడిపోయి నాస్తికుడివి అయ్యావ్. ముద్దుగా 'హేతువాది' ననిపిల్చుకొన్నావ్. భగవంతుడనేవాడున్నా నిన్నంతకన్నా చెడగొట్ట లేడని నీ ధీమా అప్పట్లో. కాగా నీ వుపన్యాసాలకు, తిట్లకు భయపడే పిరికివాడవుతే నీకు లంచంగా మేలు చేసినా చేయవచ్చునన్న ఆశ! కానీ యిప్పుడలా కాదు! సంపాదించిన డబ్బు, పేరు ఏ క్షణాన పోతాయోనన్న భయం. ఇంకా యింకా వాటిని పెంచుకోవాలన్న ఆశ! ఆ భయం ఆశలే ఆరాటాలే అన్ని మూఢ విశ్వాసాలకు మూలం చిరంజీవీ! ఎన్ని వుండి ఏం లాభం దర్శకుడా! నిజమైన విశ్వాసం



శాంతికి బీజం. ఆ విశ్వాసమే భగవంతుడన్న భావన. అంతేకానీ ఆ బొమ్మలు, ముహూర్తాలు, మొదటి టిక్కెట్ ఎవరికమ్మాలన్న సెంటిమెంటు యివన్నీ భగవంతుడన్న భావనలో భాగాలు కాదు. యిప్పటికయినా సత్యాన్ని దర్శించు."

చిరంజీవి ఆమె మాటల్ని వినలేదు. అసలు వినబడలేదు.

"నా కోసం యీ సినిమా చూడు రుక్మిణీ" ప్రాధేయపడ్డాడు.

"నీ కోసమనే యీ సినిమాను చూడను చిరంజీవీ."

చిరంజీవి అటూ యిటూ చూచి చటుక్కున ఆమె చేతుల్ని పట్టుకొన్నాడు.

"చిన్నప్పటినుంచి నువ్వు చిత్రమైనదానివే. నేను అవునన్నది నువ్వు కాదనటం అలవాటు. నిన్ను నేను అర్థం చేసుకోలేను. నిన్ను బలవంతపెట్టి లాభం లేదు. కానీ ఒక్క రిక్వెస్టు. దీన్ని కూడా కాదనకు."

"ఏమిటది?"

"ఒక్క అర్ధరూపాయి యివ్వు."

"ఎందుకు?"

"ఆ ప్రశ్న అడగకుండా యివ్వవా?"

"ఆ ప్రశ్న వేసుకోవటం మనిషికి ఆరోగ్య లక్షణం. అదే హేతువాదం. అలాంటి ప్రశ్నలు వేసుకోకే యిలా తయారయ్యావ్ నువ్వు" అర్ధరూపాయి యిస్తూ అంది ఆమె.

అతను ఆమె మాటల్ని పట్టించుకోలేదు. అర్ధరూపాయిని కళ్ళకద్దుకున్నాడు. ఆమె గుప్పిట్లో ఓ చిన్న కాగితం ముక్కను కుక్కేశాడు.

"బోణీ అయింది. టిక్కెట్ కొన్నావు. సినిమా చూడటం చూడకపోవటం నీ యిష్టం. యింట్లో కూర్చునయినా సినిమా హిట్ కావాలని నీ యిష్టదైవాన్ని ప్రార్థించు" చిరంజీవి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

రుక్మిణి గుప్పిట తెరిచింది.

కొత్తగా రిలీజ్ అవుతున్న సినిమా మొదటి టిక్కెట్! ఎర్రటి ఆ కాగితం ముక్క కోసం వేలమంది దేశమంతటా ఎండలో సినిమాహాళ్ళ దగ్గర పడిగాపులు కాస్తుంటారు.

కానీ అది తన కాళ్ళదగ్గరికి నడిచివచ్చింది. దాని వెల అర్ధ రూపాయి.

ఎలా? ఎందుకు? దాని విలువ అంత దిగజారింది?

"సెంటిమెంటల్ నాన్సెన్స్" అంటూ టిక్కెట్‌ను చిన్న చిన్న ముక్కలుగా చించి చెత్తబుట్టలో పారేసింది రుక్మిణి. □



పోరి కోడి

వీరభద్రరావ్ పల్లి



మహంకాళమ్మ జాతర బ్రహ్మాండంగా సాగిపోతోంది. మధ్యాహ్నం మొదలైన అమ్మవారి ఊరేగింపు రాత్రి పన్నెండు గంటలకు చెరువుగట్టునున్న జమ్మిచెట్టు దగ్గరకు చేరుకుంటుంది. మొక్కులు తీర్చుకునే వాళ్ళు, ఆనవాయితీ వున్నవాళ్ళు గొర్రెల్ని, మేకల్ని కోళ్ళను బలి యిస్తారు.

తాగిన వాళ్ళు గంతులేస్తున్నారు. ఘటాలు ఎత్తుకున్న వాళ్ళు వీరశైవుల్లా ఆడుతున్నారు. డప్పుల మోత, ఊరంతా వినబడుతోంది. చాకలి యీరమ్మ ఒంటిమీదకి అమ్మోరొచ్చింది. చిందులు తొక్కుతోంది.

* * *

ధర్మరాజుగారు తాగలేదు.

కాని గంతులేస్తున్నారు.

ఆయన ఘటం ఎత్తుకోలేదు.

అయినా కోపంతో ఆడుతున్నారు.

ఆయన ఒంటి మీదకి 'అమ్మోరు' రాలేదు.

అయినా చిందుల్తొక్కుతున్నారు.

సుబ్బడు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.

వాడి మొహం చూడగానే ఆయనకి విషయం అర్థమైపోయింది.

అయినా "ఏరా ఏమైంది?" అన్నాడు.

"దొరకలేదండి" నీళ్ళు నమల్తూ అన్నాడు.

"సీ-దరిద్రపు తొత్తుకొడకా!"

"ఊళ్ళో జాతర కదండి. ఎవరి దగ్గరా కోళ్ళు లేవండి."

సుబ్బడు సంజాయిషీ ఇచ్చాడు.

"నువ్వో దయిద్రపు ఎదవ్వి—నువ్వెళ్తే పెట్ట కడుపులో గుడ్డు లోపలే సచ్చిపోద్ది."

ధర్మరాజుగారు అన్నమాటలకి సుబ్బడు అమాయకంగా నవ్వాడు.

తిరిగి ఏదేనా అనడాన్కి కావల్సిన అర్హతలు వాడి దగ్గరలేవు.

పుట్టింది మాలపుట్టుక—చేసేది పాలేరుతనం.

డబ్బున్నవాడు అనడం - లేనివాడు పడటం.

ఉన్నవాడు తన్నడం—లేనివాడు తినడం.

ఈ దేశంలో అనాదిగా వస్తున్న ఆచారం.

మిగతా దేశాల్లా జనానికి తిరుగుబాటు నేర్పిన ఆకలి — ఈ దేశానికి బానిసత్వం నేర్పింది.

"సెంద్రిని పిలు."

ధర్మరాజుగారు హుకుం జారీచేసారు.

సుబ్బడు అక్కణ్నించి కదిలాడు-అతనికి మనసులో బాధగా అనిపించింది. చంద్రి ఆ ఇంట్లో పనిమనిషి - ఆమె మాలయువతే. కాబట్టి ఇంట్లోకి రాకుండా దొడ్లో ఊడ్వటం, నీళ్ళు జల్లడం, గొడ్లసాలలో పనులు చూడటం చేస్తుంది.

ధర్మరాజుగారి ఇంటికి వెనకవైపు ఓ ఖాలగా గొడ్లసాల వుంది. అటుగా వెడుతూ ".ాపం దాసుగాడు" అనుకున్నాడు సుబ్బడు.

* * *

ధర్మదాజుగారు ధర్మాపురానికి చాలా ఏళ్ళుగా ప్రెసిడెంట్‌గా వుంటున్నారు.

ఆయనకా వూళ్ళో ఏభై ఎకరాల మాగాణి వుంది.

పెద్ద మేడుంది.

ఒంటినిండా కామం వుంది.

చూపుల్లో అహంకారం ఉంది.

మీసంలో పొగరుంది.

అంతేకాదు—భర్త సుఖంకోసం రోజూ తులసికోట దగర పూజచేసే భార్యుంది.

ఎం.ఏ. పాసైన కూతురుంది.

ధర్మరాజుగారి కెదురు చెప్పి, ఆ ఊళ్ళో ఎవరూ నిలబడలేరు.

ఆయన కళ్ళెర్రజేస్తే కాకులు అరవ్వు. గేదెలు పాలియ్యవు. ఆవులు గడ్డితినవు. కుక్కలు మొరగవు.

ప్రాణుల్లోకెల్లా ఎక్కువ ప్రాణభీతికల జాతి మనుసులు. వాళ్ళసలు ఆయనకు ఎదురుతిరిగే ప్రయత్నమే చెయ్యరు.


ఆయనతో సంబంధం వున్న నర్సు భాగ్యమ్మను డ్యూటీ సరిగా చెయ్యమన్న నేరానికి ఆ వూరి డాక్టర్‌ని శ్రీకాకుళం అడవుల్లో వేయించిందాయనే.

భవిష్యత్తులో సంబంధం పెట్టుకోవచ్చన్న ధీమాని కలిగించిన టీచర్ జ్యోతిని తన వూరు వేయించుకున్నదీ ఆయనే!

ఆ వూళ్ళో హరిజన కుటుంబాలు చాలా వున్నాయి. వాళ్ళ ఒంటినిండా గుడిసెల్నిండా దరిద్రముంది—వాళ్ళ ఉద్ధరణ పేరిట వాళ్ళ గూడెంను ఊరికి దూరంగా కట్టించి అంటరానితనాన్ని మరింత పెంపొందింప చేశారు పెద్దలు.

ధర్మరాజుగార్కి ఎదురు తిరిగిన కోటేశు ఎందుకనిపించకుండా పోయాడో వాళ్ళకి తెలుసు. పాపడి పెళ్ళాం గవరమ్మను ఆయన పొలం గట్టున బలాత్కారం చెయ్యబోతే పంట చెరువులో దిగి చచ్చిపోయిందన్న విషయం వాళ్ళకి తెలుసు.

అయినా వాళ్ళేమీ చెయ్యలేదు ధర్మరాజుగార్ని.



దరిద్రం మనిషిలో భయాన్ని పుట్టిస్తుంది.

అవసరం మనిషిని బలహీనుణ్ణి చేస్తుంది.

ధర్మరాజుగారికున్న ఒక్కగానొక్క కూతురు భారతి....

ఆమెకు చదువంటే చిన్నప్పట్నుంచి శ్రద్ధ ఎక్కువ. ఆమె కేవలం డిగ్రీలకోసం కాకుండా విజ్ఞానం కోసం చదువుకుంది. ఆమెకు నిర్దుష్టమైన సాంఘిక, రాజకీయ అవగాహన వుంది.

తన తండ్రి సాగిస్తున్న హిరణ్యాక్ష పరిపాలనను ఆమె అర్థంచేసుకుంది. ఆ విషయమై బాధపడింది. ఏమీ చెయ్యలేని తన నిస్సహాయత తను తానే అసహ్యించుకుంది

ఆమె ఎం.ఏ. చదువుతుండగా తనతో చదువుకునే వెంకట్రావనే కుర్రాడితో మనసు కలిపింది. అతన్ని పెళ్ళి చేసుకుందామనుకుంది. ఇంటికొచ్చి తండ్రికి చెప్పింది.

ధర్మరాజుగారు "ఆడి కులమేంటి?" అన్నారు.

"ఆడి ఆస్తిపాస్తులేటి" అన్నారు.

అన్నీ విని "నిన్ను చదివించడం నాదే బుద్ధి తక్కువ" అన్నారు. అని వూరుకోలేదు. "నోరు మూసుకుని ఇంట్లో పడుండు. నెత్తి మీద సొంత వెంట్రుకలు లేనోడికి, అందులో తక్కువ కులపోడికి నిన్నిచ్చి ఎట్టా నేస్తాననుకున్నావ్" అన్నారు.

"అతనికి కులానికి ఆస్తికి మించిన విలువైన విజ్ఞానం ఉంది నాన్నా-అతని సంస్కారానికి మించిన సంపద నాకొద్దు నాన్నా."

అని చెబ్దామనుకుంది భారతి.

చెప్పలేదు. చెప్పినా అర్థంకాదన్న విషయం ఆమెకు తెల్సు.

ధర్మరాజుగారు ఏ పరిస్థితిని చెయ్యిదాటిపోనివ్వరు. వారం తిరక్కుండా ఆస్తిపరుడైన అల్లుణ్ణి కుదుర్చుకొచ్చేరు.

తనకాబోయే భర్త ఆస్తివున్నా అక్షర

జ్ఞానం లేనివాడని తెల్సినప్పుడు భారతి బాధ పడింది.

"చదువు లేకపోయినా సంస్కారం వున్న వాళ్ళు ఎంతమంది లేరు?" అని సమాధాన పరుచుకుంది.

"నన్ను ప్రేమగా చూసుకుంటే 'చాలు'" అని ఆశపడింది.

పెళ్ళయి నెల తిరక్కుండానే భారతికి భర్త పూర్తిగా అర్థమైపోయాడు. ఆమె తండ్రి ఎలా ధర్మరాజు కాడో, ఆమె భర్త రామరాజు అలాగే శ్రీరామచంద్రుడు కాడు. అతను సర్వగుణాభి రాముడు.

అతనికి తెల్లారేసరికి రెండు సీసాలు కావాలి.

పొద్దు కూకేసరికి ఓ అమ్మాయి కావాలి.

ఆమె కాపురానికెళ్ళిన నెలకే డబ్బు తెమ్మని తన్ని పుట్టింటికి పంపేశాడు.

"నా జీవితం ఎందుకిలా తగలేసావ్?" అని ఆమె కనిపించని దేవుణ్ణి అడగలేదు-కనిపించే తండ్రినే అడిగింది.

ఆయన ఏ సమాధానమూ చెప్పలేదు.

తన అంచనా ఎందుకు తప్పిందా-అని ఆలోచించుకుంటున్నాడు:

రామరాజు డబ్బు అవసరం పడినప్పుడల్లా అత్తారింటికి వస్తాడు. డబ్బు తీసికెడతాడు తప్ప— భార్యను తీసికెడతానని అనడు.

ఇన్నాళ్ళూ ఊరిని గడగడలాడించిన ధర్మ రాజుగార్ని అల్లుడు గడగడలాడించేస్తున్నాడు.

అల్లుడు ఆయనకో సమస్యైపోయాడు.

ఇంటికి రమ్మంటే తప్పు—రమ్మనకపోతే తప్పు.

కూతుర్ని ఎప్పుడు తీసుకెడతావంటే తప్పు ఎందుకు తీసుకెళ్ళవంటే తప్పు.

"ఈడు నా కూతురికి కాదు-నాకు మొగుడై కూర్చున్నాడు."

అని ఆయన చాలాసార్లనుకున్నారు.

ఆ రోజు మధ్యాహ్నం రామరాజు అత్తారింటికి వచ్చాడు.

ధర్మరాజుకి గుండెల్లో రాయి పడింది.

భారతికి మనస్సులో జుగుప్స నిండుకుంది.

"ఆడొచ్చాడంటే రెండేలకు కాళ్ళొచ్చాయి" అనుకున్నారు ధర్మరాజుగారు.

"మనసుకి శాంతిలేకుండా పోతుంది" అనుకుంది భారతి.

అల్లుడు రావడం, కూతురు అల్లుడు మాటా మాటా అనుకోవడం, అల్లుడు ఆమెను నాల్గు తన్నడం అరగంటలో జరిగిపోయాయి.

మేడమీద జరిగే విషయాలేవీ తనకి తెలియనట్టు అరుగుమీద కూర్చున్నారు ధర్మరాజుగారు.

మామకి అల్లుడి మీద కోపమొచ్చినా, అల్లుడికి మామమీద కోపమొచ్చినా నష్టపోయేది మామేనన్న సూక్ష్మం ఆయన గ్రహించారు. అలాగే నడుచుకుంటున్నారు.

అల్లుడంటే ఇష్టమున్నా లేకున్నా అతిథి మర్యాదలు సరిగా చెయ్యాలి. లేకుంటే "నన్ను పాలేరెదవలా సూస్తావ్‌రా?" అని మొహం మీదే అడుగుతాడు.

అడిగేసి వూరుకోడు. మరో రెండు వేలడుగుతాడు.

అల్లుడికి భోజనంలోకి కోడిని కొయ్యాలి. ఆ రోజు అమ్మవారి జాతర మూలంగా ఊరంతా మనుషుల్ని తిప్పినా కోడి దొరకలేదు. ఆయనకి చిరాకెత్తిపోతోంది."

"ఇదంతా నా ఖర్మ" అని చాలాసార్లనుకున్నారు ధర్మరాజుగారు.

* * *


ధర్మరాజుగారు అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నారు. రామరాజు మేడమీద గదిలో ఒంటరిగా కూర్చుని రమ్ముసీసాతో మాట్లాడుకుంటున్నాడు. భారతి మరోగదిలో పడుకుని కళ్ళకు కనబడే తండ్రిని, కనబడని దేవుణ్ణి తిట్టుకుంటోంది.

సుబ్బడు అరుగుకింద ఓ మూల వినయంగాను, మరోమూల చంద్రి భయంగాను నిలబడివున్నారు.

"దాసుగాడు ఇంట్లో వున్నాడా?"

ధర్మరాజు నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాడు.

"లేడండి మునసబుగారి కోతపనికెళ్ళాడు"



తలొంచుకునే చెప్పింది.

"అల్లుడుగారొచ్చారు,"

ఆ మాట వినేసరికి చంద్రికి ఒళ్ళంతా తేళ్ళూ, జెర్రులు పాకినట్టయ్యింది. అతను వచ్చినప్పుడల్లా తనకేసి చూసే ఆకలి చూపులు వేసే వెకిలి వేషాలు గుర్తొచ్చి ఆమె మనస్సు నిండా అసహ్యత నిండుకుంది.

"ఏం ఇంటన్నావా?" గద్దించినట్టు అడిగాడు ధర్మరాజుగాడు.

"సిత్తం-ఇన్నానండి!" ఆమె మాటల్లో వణుకు.

"ఊరంతా తిరిగినా కోడి దొరకలేదు. అది లేందే అల్లుడుగారు భోజనం సెయ్యరు. నువ్వింటికెల్లి పుంజునట్టుకురా - నీ మొగుడొచ్చాక కరీదెంతో కనుక్కుని డబ్బు లట్టుకుపో—"

అనుకున్నంతా అయ్యింది.

ఆమెకి మాట పెగల్లేదు.

ఆమె భర్త దాసు ఆ పుంజుని ప్రాణంలా చూసుకుంటాడు. పైగా అది పందెం పుంజు- ఆ సంవత్సరం రెండు పందాలు కొట్టి దాసుకి వెయ్యిరూపాయలు ఆర్జించి పెట్టింది. అది పిల్లగా వున్నప్పట్నుంచి దాసు దాన్ని కళ్ళల్లో వత్తులేసుకుని పెంచాడు. ఆ పుంజుని కూర కోసం కోసేశారని తెలిస్తే వాడిగుండె పగిలి పోతుంది. తన భర్త బాధపడటం ఆమె చూళ్ళేదు. వీల్లేదంటే ధర్మరాజుగారు యేం చేస్తారోనని భయం.

చంద్రి ఏం మాట్లాడలేదు.

"ఏం-చెప్పింది వినబడిందా?" ఆయన గొంతులో కోపం.

"మా మామ ఆ పుంజునియ్యడండి" ఆమె మాటల్లో భయం.

"ఆడిచ్చేదేంటి ఆడి బొంద-మర్యాదగా సెప్తే ఇను మీరు."

రాజుగారి మాటల్లో అహంకారం.

"మీకు దణ్ణం పెడతానయ్యా-ఆ పుంజు జోలికి పోకండి, ఆడు పిచ్చోడై పోతాడు" చంద్రి బతిమాలింది.

"ఏడిశావ్-ఎదవ కబుర్లూ నువ్వూను. నేనే మన్నా ఊరికే ఇమ్మనాన్నా? ఒరేయ్ సుబ్బా! దానింటికెల్లి ఆ పుంజునట్టుకురా."

"మీ కాల్లకు దణ్ణం ఎడతానయ్యా-ఆ పుంజు నొదిలెయ్యండి."

చంద్రి కళ్ళల్లో నీళ్ళు.

"ఎర్రిా ఎదవ నా కొడకా-పుంజునట్టుకురా-ఎవడడ్డొస్తాడో సూస్తాను"

సుబ్బడు బరువుగా కదిలాడు.

దాసు వాడికి చుట్టంకాదు. చంద్రీ కాదు, కాని వాళ్ళూ తనలాగే....ఒకళ్ళ కింద పన్జేసుకు బతికేవాళ్ళు. సుబ్బడి ఇంటి యెదురుగా వుండే దాసు పుంజుని ఎలా ప్రాణంలా చూసుకుంటాటో అతనికి తెలుసు.

తన చేతుల్తో దాసుగుండె పగలగొట్టలేడు.

అలాగని రాజుగారి కెదురు తిరిగి తన బుర్ర పగులగొట్టించుకోనూలేడు.

సుబ్బడు అక్కణ్నుంచి కదిలేముందు చంద్రి కళ్ళల్లో నీళ్ళు చూశాడు. వాడికి మనసు కకావికలమైపోయింది.

"నీ ఎదవ బతుకు—లేని ఆత్తిపాత్తులు లేనేలేవు. ఉన్నోటిని దక్కించుకునే యోగం కూడా లేదు,"

సుబ్బడు మనసులో అనుకున్నాడు-కోడి కాలికున్న తాడు విప్పుతూ—

దాన్ని పొడివిపట్టుకున్నప్పుడు 'కొక్కొ-రోకో' అని గట్టిగా కూసింది పుంజు అతని కళ్ళల్లోకి చూస్తూ.

దాని కళ్ళల్లో అతనికి మూగవేదన కనిపించింద. చేతుల్లోంచి బైటపడటానికి విదిలించుకుంది. గట్టిగా పట్టుకున్నాడు.

'ఏ తల్లి కడుపులోంచి అది గుడ్డుగా బైటపడిందో—ఏ తల్లి కడుపుకింద పొదగబడి, భయంకరమైన పురిటిచావునుంచి తప్పించుకుని బైటపడిందో, ఏ తల్లి రెక్కల కింద దాక్కుంటూ, దాక్కుంటూ గింజలు, పురుగులు ఏరుకుతింటూ బతికిందో, ఎన్ని పాముల్నుంచి, ఎన్ని దేగల్నుంచి తప్పించుకుందో, ఏ ఆకాశంకింద, ఏ వెలుగురేఖల్లో, ఏ గాలి పీలుస్తూ పౌరుషాన్ని పెంచుకుందో, ఎన్నికోడి పెట్టల ప్రాకృతమైన కోర్కెలికి సమాధానం చెప్పిందో, ఎన్ని పుంజులమీద కత్తుల కాలు దువ్విందో—ఈవేళ నా సేతుల్లో ప్రాణాలు ఒదుల్తొంది.'

సుబ్బడికి మనస్సునిండా ఆలోచనలు....

"ఎన్ని పుంజుల్ని కొయ్యలేదు—ఈ వేళ ఎందుకిలా ఎర్రిగా ఆలోశిత్తన్నాను" అనుకున్నాడు వాడే.

సుబ్బడికి కోడిభాష రాదు.

వస్తే "చూడు—నిన్ను రచ్చించుకోవాలనుకోడం మా పాణాలమీదకి తెచ్చుకోడమ్మే—చమించు". అని చెబ్దామనుకున్నాడు.

రాజుగారి ఇంటివెనకాలకి తీసికెళ్ళి పుంజుని కొయ్యాల్సి వచ్చినప్పుడు సుబ్బడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. క్షుద్రదేవతకి స్నేహితుడి కొడుకుని బలి యివ్వాల్సి వచ్చినట్టు ఫీలయ్యాడు.

పుంజుకి రెండు చేతులతో దణ్ణంపెట్టాడు.

అటుగా వెడుతూ అది చూసిన రామరాజు నవ్వుతూ

"అదేవన్నా అమ్మోరేట్రా దణ్ణం ఎడతన్నావే ఎర్రి నా కొ డ కా — తొందరగా కొయ్యరా" అన్నాడు.

పుంజు సుబ్బడి కళ్ళల్లోకి చూసింది.

ఈసారి దాని కళ్ళల్లో వేదన లేదు.

పౌరుషం ఉంది.

"ఛీ! పిరికిసన్నాసుల్లారా! మిమ్మల్ని మీరే రక్షించుకోలేరు నన్నేం రక్షిస్తారు? పెంచిన మీ కండలు పాలేరుతనం చెయ్యడానికి తప్ప ఇంకెందుకూ పనికిరావు. పక్కమనిషికి భయపడి మానం, అభిమానం చంపుకుని పొట్టకోసం బతుకుతారు. సిగ్గులేని బతుకులు మీవి-మీలాంటి వాళ్ళు బతికినా చచ్చినా పెద్ద తేడా లేదు—బానిసలు మీరు....

నేను చూడు—ఎప్పుడూ తోటి పుంజుకి భయపడి తలొగ్గలేదు. పందెంలో కత్తిదెబ్బ తిని చచ్చిపోడానికైనా సిద్ధమే .... కాని మరో పుంజుకి భయపడను—నాలా బతకండిరా!"

పుంజు తనను్దేశించి అంటున్నట్టనిపించింది సుబ్బడికి—"ఛీ సీ యమ్మ........" హేళన భరించలేకపోయాడు.

కత్తి పైకెత్తాడు,

పుంజు యెగిరి సుబ్బడి మొహంమీద తన్ని పారిపోయింది.

సుబ్బడికి తల తిరిగింది. సంబాళించుకుని చూసేసరికి పుంజు చాలా దూరంగా వుంది.

దాన్ని పట్టుకోడానికి వెనకాలే పరుగెత్తాడు.

అది దొరక్కుండా పారిపోతోంది, వాడు పరుగెడుతూనే వున్నాడు.

పశువులశాలలోంచి కేకలు వినబడ్డాయి సుబ్బడికి.

కోడిని వదిలేసి అటుగా పరుగెత్తాడు.

అక్కడ గడ్డిమీద అసహాయంగా పొర్లుతూ చంద్రి—

ఆమె నోరు మూసేసి బలవంతంచేస్తూ రామరాజు.

వెళ్ళగానే రామరాజును గట్టిగా తన్నాడు సుబ్బడు.

అతనోపక్కగా పడ్డాడు—అతని కళ్ళల్లో క్రోధం.

బట్టలు సర్దుకుంటూ లేచి నిలబడింది చంద్రి.

ఆమె కళ్ళల్లో దీనత్వం—

"అడ్డొత్తావురా—నిన్ను సంపేత్తాను నంజి కొడకా!"

రామరాజు మూలవున్న బాణాకర్ర ఎత్తి వస్తున్నాడు.

"సెంద్రీ! ఇక్కణ్నుంచి పారిపో—" సుబ్బడు గట్టిగా అరిచాడు.

ఆమె పారిపోతూ సుబ్బడి కళ్ళలోకి చూసింది.

సరిగ్గా అవే చూపులు.......

కొన్ని నిముషాలక్రితం అతని అశక్తతని, చేతకానితనాన్ని — హేళనచేసిన కోడిపుంజు చూపులు—

రామరాజు కర్ర విసిరాడు.

సుబ్బడు తప్పించుకున్నాడు.

మనిషిచేతిలో చచ్చే కోడిలా కాదు—పందెంలో పుంజులా బతకాలి.

సుబ్బడి బుర్ర చురుగ్గా పన్జేసింది.

స్థంభానికి గుచ్చివున్న కొడవలి అందుకున్నాడు.

ఒక్కక్షణం.......

రామరాజు అమ్మవారి జాతరలో బలియియ్యబడిన కోడిలా .... గిజగిజకొట్టుకుంటున్నాడు.

పందెం నెగ్గిన పుంజులా సుబ్బడు....

సుబ్బడు భయపడటంలేదు, కంగారుపడటంలేదు.

ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు.

"సుబ్బా!"

పిలుపికి సుబ్బడు అదిరిపోయాడు.

కంగారుగా చూశాడు.

తనవైపు వస్తున్న భారతి....

ఆమె ముఖాన్న ఎర్రటిబొట్టు చూశాక తప్పు చేశానేమోనన్న అనుమానం కల్గింది.

"అమ్మాయిగారు....అసలు...."

"జరిగిందంతా నే చూశాన్రా—ఆ కొడవలి నా చేతికిచ్చి నువ్వీ వెనకాల్నుంచి వెళ్ళిపో!"

ఆమె చాలా ప్రశాంతంగా మాట్లాడింది.

"అమ్మాయిగారూ...."

"ఏం కంగారు పడకురా-నే చెయ్యలేని పని నువ్వు చేశావ్."

"నాన్నార్కి తెలిస్తే యింకేమన్నా వుందా అమ్మా...."

"నేనే చేశానని తెలుస్తుంది. ఏం చేస్తాడు. కన్నకూతురు. కడుపుతీపి....కడుపులోనే దాచుకుంటాడు నువ్వెళ్ళరా వెర్రాడా!"

"ఒద్దు అమ్మాయ్‌గారు—ఇది నే జేసిన పాపం....నేనే అనుభవించాలి."

"కాదు-ఇలా చెయ్యకపోవడం నే చేసిన పాపం. మా అత్తారింట్లో పన్జేసే పిల్లని ఈయన ఇలాగే....

నేను మాటల్తో అడ్డుచెప్పాను. అడ్డంపడ్డాను. వారించలేకపోయాను. అన్యాయాన్ని మాటల్తో అడ్డుకుని, అడవిమృగానికి నీతులు చెప్తే అర్థం కాదు—ఇలాగే జరగాలి —"

ఆమె మాటలు సుబ్బడికి అర్థంకాలేదు.

అక్కణ్నుంచి వెళ్ళిపోతూ దొడ్లోకి వచ్చాడు.

బాగా చీకటి పడింది.

సుబ్బడి చేతుల్నుంచి తప్పించుకున్న పుంజు గోడ ఎక్కి అప్పుడే తెల్లారినట్టు కొక్కొరోకో అని గట్టిగా కూసింది. □

చిట్టి చిట్టి చిన్ని చిన్ని పొట్టి పొట్టి గట్టి కథ!

గుడ్ మార్నింగ్ సర్!

పలపాల శ్రీనివాసరావు

చిరంజీవి 'కార్బన్' కంపెనీలో గుమస్తాగా పనిజేస్తున్నాడు. ఆరోజు శనివారం. ఆ దినం అత్తగారుపెట్టిన వైట్ గబర్డిన్ ప్యాంటు వేసుకొని వైట్ షెరీకాట్ షర్ట్ టక్‌చేసి ట్రిమ్‌గా తయారయ్యాడు.

స్టైయిల్‌గా నడుస్తూ, హుషారుగా తల వూపుతూ, సన్నగా విజిల్ వేస్తూ ఆఫీసు మెట్లెక్కుతున్నాడు.

మూడు మెట్లెక్కాడు. కొలీగ్ గుర్నాధం యెదురయ్యాడు. ఎప్పుడూ కనీసం విష్ చేయని గుర్నాధం నమస్కారం చేశాడు. ఆశ్చర్య పోతూ ప్రతిగా తలతో వూపుతూనే విష్ చేసి గర్వంగా రెండు మెట్లెక్కాడు.


స్టెనో మాలిని ఎదురై విష్‌చేసింది. స్టన్న య్యాడు. అనుకోకుండా చేయి గాలిలో ఎగిరి విష్‌చేసింది. ఇదంతా తాను వేసుకున్న కొత్త డ్రస్ మహిమ అని వుప్పొంగిపోయాడు.

ఎదురుగా హెడ్‌క్లర్క్ రామలింగం వస్తూ నమస్కారం చేశాడు. చిరంజీవి ఆశ్చర్య పోయాడు. ప్రతి నమస్కారం చేసి వడివడిగా ఆఫీసు గదిలోకి ప్రవేశించాడు.

తనలో ఆశ్చర్యం, ఆనందం రెండూ వుప్పొంగి పోయాయి. తనేదో ఆఫీసరయి పోయినట్లు కలగన్నాడు. ఆ ఆనందంలో అనుకోకుండా ప్రక్కగా నున్న రాధిక టేబుల్‌కి గుద్దుకున్నాడు. అనుకోకుండా వెనక్కి తిరిగి చూస్తే తన ఆఫీసర్ 'రామానుజం' తన వెనుకనే నడుస్తూవున్నాడు.

"గుడ్‌మార్నింగ్ సర్!" అన్నాడు గుడ్లు తేలవేస్తూ చిరంజీవి.

సరికొత్త సైంటిఫిక్ రొమాంటిక్ సీరియల్ నవల



యుగాంతం!

యండమూరి వీరేంద్రనాథ్

5

"మాదిగోడికి పొలమేమిట్రా? మన ఇట్టరీలో ఏడన్నా నూ సి నా వా అది?" మున్సబు చుట్ట పీకి, "ఛూ" అని వుమ్మతూ అన్నాడు.

రాజయ్య మాట్లాడలేదు.

భూషణం చెయ్యి మీసంమీదికి పోయింది. కడుపులోంచి క్రితం రాత్రి మున్సబుతో కలిసి కొట్టిన మందు త్రేన్పుగా వస్తూంది.

"ఎల్లెల్లు. ఏదో ఆయనిచ్చింది తీసుకొని— పన్నేసుకో. పో—" మళ్ళీ అన్నాడు మున్సబు.

"ఇంకో రెండు గింజలు ఎక్కువ కావాలంటే భూషణాన్ని అడిగి తీసుకోరాదట్రా. పొలం నాదనటం దేనికీ?...." కరణం అన్నాడు.

రాజయ్య వాళ్ళవైపు చూసేడు.

మునసబు. భూషణం. కరణం.

వెనక్కి తిరిగి తన వాళ్ళవైపు చూసేడు.

ఎల్లమంద. ఈరిగాడు. యూసపు.

అవతలి వాళ్ళందరూ మాట్లాడుతున్నారు. ఇవతలివాళ్ళు వినటం తప్ప యింకేమీ చేతకాని వాళ్ళు. వింటున్నారు. మధ్యలో తను. అన్యాయం జరిగినవాడు.

భూషణం కళ్ళు ఎర్రగా వున్నాయి తాగీ తాగీ.

తన కళ్ళూ ఎర్రగానే ఉండొచ్చు రాత్రంతా ఏడ్చి ఏడ్చి.

కోపమొచ్చినా ఎర్రబడుతాయట కళ్ళు. తెలీదు. జీవితం మొత్తంమీద కోపమొచ్చిందెప్పుడు? యెప్పుడైనా తెచ్చుకొందామన్నా— దానికి వీలు కల్పించగలిగే పెళ్ళాం-పెళ్ళయిన రెండేళ్ళకే వెళ్ళిపోయింది.

"ఏమంటావురా?" మునసబు అడిగేడు.

"ఆ పొలం మా తాతల్నాటిది దొరా?"

"నిజమేరా. మీ తాత నాకు తెల్సుకదా! భూషణం తాత దగ్గర పన్జేసేవాడు. అడికా

బంజరు రాసిచ్చింది ఆయనేగా."

"రాసిచ్చింది తీసుకొంటే ఎట్టనయ్యా?"

"రాసివ్వటం అంటే ఏకంగా రాసిచ్చినారేంటిరా? మూడు సంవత్సరాలకె కౌలు కిచ్చినారు."

"బంజరు భూమి అది. దాన్ని మా తాత వదిలేసిండు. మా నాయన వదిలేసిండు. నేను దున్నిన. మూడేళ్ళనుంచి అది పండుతోంది. ఇప్పుడు తీసుకుంటానంటే యెట్టనయ్యా."

"మూడేళ్ళయిపోయింది కద. ఇదిగో యీ కాగితం చూడు" మాసిన కాగితంమీద మరకల ఇంకు.

ముప్పై సంవత్సరాల క్రితం వ్రాసిందా? మూడు నెలల క్రితం సృష్టించిందా?

"న్యాయమంటే న్యాయమే. కాగితాన్ని, కాగితంమీద వ్రాసిందాన్నీ నువ్వు కాదనలేవు కదా. ఇది నీ సంతకమే. అంటే అదే—ఏలుముద్ర అనుకో....దాన్ని కాదనలేవు కదా!! చూడు రాజయ్యా. ఈ చెట్టుకింద కూర్చొని నేనెన్నో తీర్మానాలు చేసినా, న్యాయాలు చెప్పినా. నువ్వో యినుకో. ఆ పొల్యం భూషణం సాధీనం చెయ్యి. కావల్నంటే ఆయనకిందే పన్జెయ్యి. ఆ పొలం నువ్వే దున్ను.పండించు. నీ కూలీ తీస్కో....ఆయన మంచాయన. మెం అందరం చెప్పినాం కాబట్టి వొప్పుకుంటుండు."

పన్జెయ్యి. దున్ను. పండించు....కూలీ దీస్కో. పండించింది ఆయన కియ్యి. ఆయన మంచాయన. కూలీ యివ్వటానికి ఒప్పుకుంటుండు.

రాజయ్యకి నవ్వో ఏడుపూ రాలేదు. చచ్చినోడు తగలబడ్తూంటే బతికున్నోడు స్మశానంలో కూచుంటే కలిగే స్థితి. చేతులు కట్టుకొని అన్నాడు.

"ఏదైనా సెబ్దామన్నా నాకు ఎక్కువ బాస రాద్దొరా. అయినా సెప్పాలి కదా. సెప్తే నాయం జరుగుద్దని కాదు. సెప్పకుండా సెడిపోయానన్న బాధ, ముందు ముందు నాకు లేకండా వుండేందుకన్నా అది సెప్పాలి. ముప్పై యేళ్ళ క్రితం మూడేళ్ళకి బూమి రాసిచ్చినాయన—మరింత కాలమూ దాన్నెందుకు అడగలేదంట? అడుగుతున్నానని నారా జవకయ్యా. ఇదిగో యీ సేతుల్తోడు—ఈటితోనే దున్నినా. ఆ పొలం తడిసింది నీల్లతో కాదయ్యా, సెమటతో. ఇప్పుడిప్పుడే అది కాసింత కనికరించి గింజల్ని రాలుస్తోంది.... మీ రీ కాగితం సూపించినారు. ఇది మా తాత రాసిండంట. అల్ల తాతకి! సచ్చినోడు ఎట్టానూ రాడు. సావలేక బతకలేక శవాల్లా బతుకుతున్న మా లాటి వోల్లకి సాచ్చం సెప్పటానికి ధేవుడు కూడా దాక్కుంటాడు."

కరణం కదిలేడు. అసలింతసేపు వీణ్ణి మాట్లాడించటం ఏమిటీ అన్నట్టు మునసబు వైపు చూసేడు.

"ఈ సంతకం నీదే కదయ్యా?" దీనికేం చెబ్తావన్నట్టూ మున్సబు అడిగేడు. రాజయ్య నవ్వేడు.

"సిన్నప్పుడు బడిపంతులు మ నూల్లో యిల్లిల్లూ తిరిగి; పిల్లగాళ్ళందర్నీ సదువుకు రమ్మని పిల్సేవోడు గుర్తున్నదా దొరా? మా నాయన అప్పుడన్నడు-'నా కొడుకుని పంపుతే ఏమున్నది పంతులూ. పన్నెండేళ్ళు నీ యిస్కూల్లో వుంచుకొని ఎనిమిదో కలాసు దాకా సెప్పి పంపిస్తావు. ఆ తరువాత సెప్పేందుకు నీ దగ్గరేమీ వుండదు. సెప్పించుకొనేటందుకు మా దగ్గరా పైసలుండవ్. ఆడక్కడితో ఆగిపోతాడు. అంత చదువు చదివినాడు కాబట్టి ఆడితో మెరక దున్నించలేను. అంత కొద్దిగే సదివినాడు కాబట్టి సర్కారోళ్ళు ఉద్దోగం కూడా యియ్యరు. రెంటికీ సెడిపోతాడు'—అన్నాడు మా నాయిన. 'చదువే ముఖ్యం' అన్నాడు పంతులు. 'పెపంచాన్ని సూసేటందుకు సదువుకోవాల్నంట. అప్పుడే దేశం బాగుపడుద్దన్నడు. నాకు బాగా గురుతు. దేశం బాగుపదేదంటే ఏందో తెలియకున్నా, పంతులు సెప్పిన మాటలు మాత్రం బాగా యాదుకున్నయ్.పోరగాళ్ళతో కలిసి ఇస్కూలు కెళ్ళాలనంటే గదో సర్దా. మా నాయిన 'గద్సరే పంతులూ, మావోడు కూలికెల్తే రోజుకు రెండు రూపాయల కూలి దొరుకుద్ది కదా. మరి

ఆకాశానికి నమస్కారం

లాస్ఏంజిల్స్, డిసెంబర్ 14: మన సౌరకుటుంబమూ, నక్షత్ర సముదాయమూ పాలపుంతలోని నక్షత్ర సముదాయాలూ గంటకు 16 లక్షల కిలోమీటర్ల వేగంతో కన్యారాశివైపుగా దూసుకుపోతున్నాయని, ఆ దిశలో వున్న బృహత్తర నక్షత్రమండలి పెను బలంతో మన పాలపుంతను ఆకర్షిస్తోండటమే దీనికి కారణం అని జార్జిస్మూట్ అనే శాస్త్రవేత్త భావిస్తున్నారు. మన భూమితోసహా మన నక్షత్రసముదాయమంతా సెకనుకు అయిదువందల కిలోమీటర్ల వేగంతో రోదసిలో పయనిస్తోందని కాలిఫోర్నియా యూనివర్శిటీకి చెందిన ఆ శాస్త్రవేత్త చెబుతున్నారు.

మన సమస్తనక్షత్రాలూ ప్రళయవేగంతో ఎందుకు ప్రయాణం చేస్తున్నాయో అన్నది కలవరపరిచే ప్రశ్న అనీ బహుశా ఏ రాకాసి గ్రహాలో తిరుగులేనంత బలంతో మనని ఆకర్షిస్తున్నాయన్నది మాత్రం నిర్ణయం అని స్మూట్ చెప్పారు.

అటువంటి మహానక్షత్ర సముదాయం ఒకటి వున్నట్లయితే అటువంటివి ఇంకా అనేకం వుండవచ్చునని ఊహకందని బ్రహ్మాండ పరిమాణంలో పదార్థ సముదాయాలు ఆ ప్రదేశంలో వుండవచ్చునని ఆయన అన్నారు.

15-12-79 నాటి "ఈనాడు" వార్త.

నీతో పంపిస్తే ఏం దొరుకుద్ది' అని అడిగిండు. నాటకాల్లో ఏసాలేసే పంతులు నాటకంలో లాగే 'ఇజ్ఞానం దొరుకుద్ది' అన్నాడు సప్పున. 'మాకిజ్ఞానం వద్దు బాబూ. ఇంత తిండి దొరికితే సాలన్నాడు మా నాయిన. 'ఇస్కూల్లో ఇంతమంది సదువుతున్నట్టు సర్కారోడికి లెక్క సూపించాలి ఎట్టా?' గన్నడు పంతులు. 'మావోడు యిస్కోలు కొస్తున్నట్టు రాసుకో. ఆడ్ని కూలి కొదిలిపెట్టు' అన్నాడు నాయిన. ఇద్దరికీ అట్ట రాజీ కుదిరిపోయింది. బర్రెల్ని తోల్కపోయే పని నాకు మిగిలిపోయింది. మీయందర్నీ యిట్ట నిలబెట్టి మాట్లాడతన్నానని కోపం దెప్పించుకోకండయ్యా. ఇంతకీ నే సెప్పేది నాకు సదువు అంటలేదని. 'అ' కి 'ఆ'కి తేడా దెల్వనోడికాడ కాగితంబెట్టి నీకు సర్కారోడు ఎరువులు మంజూరు చేసిండు అంటే ఒక సోట ఏంది దొరా—ఎయ్యిమన్న సోటల్లా ఏలుముద్ర లేస్తాం నేనూ, ఈసోపూ, ఈరిగాడు. ఇప్పుడా కాగితం సూపించి 'ఇదే నాయం' అంటే ఏం జేస్తం? నాయం గదేనేమో అనుకుంటం. అంతకన్నా ఏం జేస్తం? చెట్టుకింద కూచొని నువ్వెన్నో నాయాలు సెప్పినవ్. ఈరోజు మల్లీ గదే సెబ్తున్నవ్. దాన్ని యినుకొని నే న్నా యిల్లు వదిలిపెత్త, ఉండేటందుకు ఏ సెట్టో సూస్కుంట. ఈ చెట్టుకింద కూర్చొని నువ్వు సెప్పింది యినుకొని....నేనూ యింకో సెట్టుకిందికి సేరిపోత...." అంటూ వెనక్కి తిరిగేడు.

భూషణం మున్సబును చూసి నవ్వేడు. మున్సబు కరణాన్ని చూసి నవ్వలేదు. ప్రిస్టేజికి భంగమని.

రచ్చబండమీద నుంచి అందరూ లేచేరు. అప్పటికే అన్యాయం జరిగినోళ్ళు నాలుగొందల గజాలు వెళ్ళిపోయేరు.

న్యాయం చెప్పిన వాళ్ళు ఇళ్ళవైపు సాగిపోతున్నారు.

అప్పుడో శబ్దం వినిపించింది.

ఫెళఫెళా విరిగిన శబ్దం.

అటు వాళ్ళూ ఇటు వాళ్ళూ వెనుదిరిగి చూసేరు.

అప్పటివరకూ పచ్చగా కళకళ లాడిన ఆ చెట్టు యెవరో తోసినట్టు పైకి లేచి పెద్ద శబ్దంతో పక్కకి వొరిగిపోయింది.

6

ఇరానీ హోటల్లో కూర్చొని వున్నాడు రమణ. జేబులో అర్ధరూపాయుంది. 'టీ'కి ఆర్డరిచ్చేడు. హోటల్లో యెవరూ లేరు. ఒక మూల యెవరో పొట్లంలో భోజనం చేస్తున్నాడు.

భరించలేనంత నిస్పృహత! ఈ ఉద్యోగమూ రాలేదన్న భావం మనసుని పరపరా కోస్తూంది. ....చదివిన చదువు వ్యర్థం అయిపోతూంది. ....ఇంట్లో తండ్రికి బాగాలేదు .... అన్నయ్య జీతం యింట్లో రెండుపూటలా తిండికే సరిపోవటం లేదు. ఎలా? అవునెలా?

ప్రశ్న చాలా చిన్నది.

సమాధానం విశ్వమంత పెద్దది.

చెంపమీద యేదో జారినట్టూ అనిపిస్తే తడిమేడు. కన్నీటి చుక్క. అంత బాధలోనూ నవ్వొచ్చింది.

"ఏమిటి—? యేడుస్తూ నవ్వుకొంటున్నావు?"

హఠాత్తుగా వినిపించిన ప్రశ్నకి తలెత్తి చూసేడు. ఒక ముసలివాడు—యాభై అయిదేళ్ళవాడు—చిరు గడ్డం—తెల్లబడిన బట్టతల—ఒక లాంగ్‌కోటు—పైజామా లాటి లూజు ప్యాంటూ—తైల సంస్కారం లేని జుట్టు—కొద్దిగా మాసిన గడ్డం—పీక్కుపోయిన దవడలు....

"వాతావరణంలో ఆక్సిజనుంది. వంట్లో హైడ్రొజనుంది. ఆ రెండూ కలిస్తే కంట్లో నీరుంది. బై ది బై ఒక టీ కొట్టించు" అని చొరవగా ఒక కుర్చీలో కూర్చొన్నాడు.

రమణకి నవ్వొచ్చింది. తన దగరున్నదే అర్ధరూపాయి. వదిన్ని అడుక్కొన్నది. అడుక్కొన్న వాడి దగ్గర అడుక్కొనేవాడు!

"కూర్చో" అన్నాడు రమణ.

"కూర్చొనే వున్నాను" అన్నాడు. "బై ది బై నీ వయసెంత? ఇరవై అయిదుండవూ? నాకు డెబ్భై అయిదు. అఫ్‌కోర్స్....అంతలా కనపడననుకో. కానీ నీ కన్నా మూడురెట్లు యెక్కువ. అందుకని మూడక్షరాలతో పిలువు. 'కూర్చోండీ' అను. వెధవ సెల్ఫ్ రెస్పెక్టొకటి ఏడిచింది కదా!"

"సారీ!" అన్నాడు రమణ నొచ్చుకుంటూ. "ఏదో పరధ్యానంలో ఉన్నాను."

"ఏదైనా లవ్వెఫైరా—లేక ఉద్యోగమా నీ సమస్య—? యూత్‌ని బాధిస్తున్నవి అవి రెండే."

"ఉద్యోగం" అన్నాడు రమణ. "ఇప్పుడే ఇంటర్వ్యూనుంచి వస్తున్నాను."

"ఏమడిగేరు?"

అడిగిన ప్రశ్నలూ—తను చెప్పిన సమాధానాలూ వివరించేడు. ఒక్కొక్కటీ చెబ్తూంటే అతడు ఆసక్తిగా ముందుకు వంగి విన్నాడు. అంతా విని, "నువ్వు అస్ట్రానమీ స్టూడెంటువా?" అని అడిగేడు.

కాదన్నాడు రమణ.

"మరింత కరెక్టుగా సమాధానం యెలా చెప్పేవ్?"

"ఈ కాలంలో ఇంటర్వ్యూల కెళ్ళాలంటే ఎన్‌సైక్లోపీడియా అంతా కంఠతా వచ్చి వుండాలి" క్లిష్టంగా అన్నాడు రమణ.

ఇంతలో టీ వచ్చింది. ఇద్దరూ టీ తాగి బైటికొచ్చేరు.

"నువ్వు నా దగ్గరెందుకు ఉద్యోగం చెయ్యకూడదూ? బై ది బై ఒక చార్మినార్ సిగరెట్టుకి డబ్బులుంటే చూడు. టీ తాగిం తర్వాత వెధవది సిగరెట్ వుండకపోతే ప్రాణం నిలబడదు. అన్నట్టు....ఏం చెబ్తున్నానూ—ఉద్యోగం గురించి. ఎస్. నువ్వు నా దగ్గర ఉద్యోగం యెందుకు చెయ్యకూడదూ?"

అకస్మాత్తుగా అతడి మెదడు గురించి అనుమానం వచ్చింది రమణకి. దాన్ని ప్రదర్శించకుండా "మీరేం చేస్తూవుంటారూ" అని అడిగేడు.

"ఆకాశంకేసి చూస్తూ వుంటా."

"నేనేం చెయ్యాలి?...." నవ్వాపుకొంటూ అడిగేడు.

"నాతోపాటూ ఆకాశంకేసి చూడాలి" సిగరెట్ అందుకొంటూ అన్నాడు.

"జీతం?"

"ఎంత కావాలి గ్రాడ్యుయేటూ?"

"వెయ్యి రూపాయలు" ఎంత ఆపుకుందామన్నా నవ్వాగటంలేదు.

"అంత యిచ్చుకోలేను. నాలుగొందలు యిస్తాను. ఒక చోటనుంచి రావల్సిన డబ్బు వుంది. అది రాగానే వెయ్యి చేస్తాను."

"ఎక్కడ్నుంచి రావాలి?"

"స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్ నుంచి. ఆల్‌ఫ్రెడ్. బి నోబుల్ అనే ఆయన పంపాలి."

"ఎంత?"

"లక్ష పౌండ్లు. సుమారు ఇరవైలక్షల రూపాయలు."

"నోబుల్ ప్రైజా?"

"అతే...."

తెరలు తెరలుగా నవ్వొచ్చింది రమణకి. ఇక ఆపుకొనే ప్రయత్నం ఏదీ చెయ్యలేదు. నవ్వుతూనే అతని యింటి కాంపౌండులోకి ప్రవేశించేడు. చాలా పురాతనమైన యిల్లు అది. బైట బాగా పిచ్చి మొక్కలు పెరిగి వున్నాయి. ప్రహరీ గేట్లు పడిపోవడానికి సిద్ధంగా వున్నాయి. ఇంట్లోంచి బైటికీ, బైట్నుంచీ ఇంట్లోకీ, గబ్బిలం ఒకటి యెగురుతూ వుంది. పై కప్పు ఇరవై అడుగుల ఎత్తుంది. సాలెగూళ్ళు వేలాడుతున్నాయి.

"ఎవరిదీ యిల్లు?" చుట్టూ చూస్తూ అడిగేడు.

"నాదే" అన్నాడతను. "మా అమ్మమ్మ నాన్నకి ఆ కాలపు నవాబు రాసిచ్చేడు. ఇది నాకు వచ్చింది."

వీధికి చాలా లోపలగా, మూలగా వున్నదా భవనం. నవాబుల ఒకప్పటి రమ్యహర్మ్యాలు యిప్పుడు ఆ స్థితిలో వుండటం అతడికి తెల్సిందే. అందుకే అతడికి ఆశ్చర్యం కలగలేదు. అలాటి పాడుబడిన ఇళ్ళు ప్రస్తుతం బిక్షగాళ్ళకి, నివాస కేంద్రాలు. దూరంగా గ్రౌండులో పిల్లలు ఆడుకొంటున్నారు.

అతడు నడుస్తూ వుంటే కాలికింద దుమ్ము పైకి లేస్తోంది. చాలా పెద్ద యిల్లు అది. నగరపు నడిబొడ్డులో వుంది. అద్దెకిస్తే నాలుగు వేలకి తక్కువ రాదు. అతను ఆలోచనల్లో వుండగానే కాలికేదో తగిలింది. తీసి చూస్తే మున్సిపల్ కార్పొరేషన్ వాళ్ళ కాగితం. పన్ను కట్టమని నోటీసు.

"అలాంటి పన్లన్నీ నువ్వు చెయ్యాలి" అన్నాడు. "నేను మర్చిపోతూ వుంటాను. టీ కొచ్చి డబ్బులు మర్చిపోయినట్టు...." మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు "అన్నట్టూ నీకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ టైపుచేసి కావాలా—ఓరల్‌గా సరిపోతుందా? టైప్‌ది కావాలంటే వెళ్ళి టైపు చేయించి తెచ్చుకో....యేది కావాలి?"

"నాకు అడ్వాన్సు కావాలి...." అన్నాడు రమణ.

'ఇంటికెళ్ళి చేసే పనేమీలేదు. ఇక్కడ బాగానే ఉబుసుపోతోంది' అనుకొన్నాడు.

"అడ్వాన్సు నోబుల్‌ప్రైజ్ వచ్చాక. ప్రస్తుతం డబ్బంతా యిన్వెస్టుమెంటులో వుంది."

"మీ పేరు?"

"ప్రొఫెసర్ ఆరోగ్యమరపు ఆనంద మార్గం" అన్నాడు యెడమవైపు గదిలోకి నడుస్తూ. "అందరూ ఏ. ఎమ్. ఏ. ఎమ్. అంటారు. చివరికదే 'అయోమయం' అయింది."

రమణ నవ్వుతూ "ప్రొఫెసర్ అయో మయాంగారూ...." అంటూ ఏదో అనబోయి చప్పున ఆగిపోయేడు.

అప్పటికి వాళ్ళు యెడమవైపు గదిలోకి ప్రవేశించారు. దానికి పైకప్పు లేదు. పెద్ద అద్దం బిగించి వుంది. పెద్ద రివాల్వింగ్ డోమ్ మీద అజిమొటాల్ మౌంటింగ్‌లో యాభై మీటర్ల పొడవూ, నలభైఅయిదు మీటర్ల డయామీటరూ వున్న టెలిస్కోపు హుందాగా నిలబడి వుంది.

ప్రపంచంలోకల్లా పెద్ద టెలిస్కోపు రష్యాలో వుందని విన్నాడు. కానీ యిప్పుడు చూస్తున్నాడు. అతడు ఆశ్చర్యంనుంచి తేరు కోక ముందే వెనుక నుంచి ప్రొఫెసర్ కంఠం వినిపించింది.

"మీ జనరల్‌నాలెడ్జి పుస్తకంలో యిది కన పడదు. జెలింస్కుయా. నార్త్ కేకాసస్‌లో వున్న స్కోప్ కంటే ఇది పెద్దది నేనే తయారుచేశాను దీన్ని. బైదిబై ఇంకో సిగ రెట్టుంటే యివ్వు. దీన్ని....ఐ మీన్ యీ స్కోప్‌ని తయారుచెయ్యడానికి పన్నెండు సంవత్సరాలు పట్టింది. మా అమ్మమ్మ నాన్నకి ఆ నవాబు యిచ్చిందంతా ఖర్చయింది. దీని బరువు తొంభైఅయిదు టన్నులు. లెనిన్‌గార్డు అప్టికల్ యింజనీరింగ్ అమాల్గమేషన్ వాళ్ళు దీన్ని చూస్తే మూర్ఛబోతారు. దీన్ని అమ్మితే యెంతొస్తుందో తెలుసా?....నీ జీతం అడ్వాన్సు యివ్వలేదని అనుమానపడకు. దీనికి ఉపయో గించిన యినుముతో పదకొండు పెట్టెలున్న పాసింజరు ట్రైను తయారు చెయ్యొచ్చు. జీడీల వాడికి అమ్ముకొంటే రెండువేలమంది జీవి తాంతం తినటానికి సరిపోయేటన్ని జీడీలు వస్తాయి. దీని పేరు యేమిటో తెలుసా? లిప్పర్‌షే. టెలిస్కోపు కనుక్కున్నది గెలీలియో అని మీరందరూ అంటారు. కాదు. లిప్పర్‌షే. అసలు మీకు జనరల్ నాలెడ్జి ఏం తెలుసని? ఊరు మధ్యలో వున్న టెలిస్కోప్ సంగతి ఎవరికీ తెలీదు. కాలిఫోర్నియా—మౌంట్ విల్సన్ అబ్సర్వేటరీలో వున్న ప్రొఫె సర్ ఆడమ్స్—యిప్పుడు లేడులే పోయేడు. అతని కొక్కడికీ తెలుసు. బైదిబై ఈ టెలి స్కోప్‌లో యెంతదూరం చూడొచ్చని నువ్వు అనుకొంటున్నావు?"

నోట్లో తడారిపోతుండగా తెలీదన్నట్లు తల అడ్డంగా వూపేడు.

"పదివేల మిలియన్ల కాంతి సంవత్సరాలు. కాంతి సంవత్సరం అంటే" ఆగేడు, "....సెక నుకి లక్షా ఎనభైఆరువేల మైళ్ళ వేగంతో కాంతి ప్రయాణం చేస్తుంది. లెక్క కట్టు. సెకన్లు అరవై యింటూ నిముషాలూ అరవై యింటూ గంటలు ఇరవైనాలుగు యింటూ మూడువందలా అరవైఅయిదు రోజులు అయితే ఒక సంవత్సరం. దాన్ని లక్షా ఎనభై ఆరువేలమైళ్ళతో హెచ్చిస్తే ఒక కాంతి సంవ త్సరం. ఈ టెలిస్కోప్ అంతదూరం చూస్తుంది. లెక్క కట్టేవా గ్రాడ్యుయేటూ— 54132960000000000000 మైళ్ళు. అన్ని మైళ్ళ విశ్వాన్ని రోజూ చూస్తాన్నేను. అజి మొటల్ మౌంటింగ్, అంటే ఆకాశంలో యే మూలకైనా తిరుగుతుంది ఇది. నాకింకో కోర్కె వుంది. విశ్వం నలుమూలల్నుంచీ వచ్చే 'కంటినువమ్ రేడియేషన్'ని పెద్ద 'అంటెనా' పెట్టి చూడాలని. తెలుసుగా అంటెనా అంటే?...."


రమణకి తెలీదు. అయినా తెలుసన్నట్టు తలూపేడు. అతను, తను చూస్తున్నది కల కాదని నమ్మకం కలిగించుకోవటానికే బ్రహ్మ ప్రయత్నం చెయ్యవలసి వస్తోంది.

"చెప్పు గ్రాడ్యుయేటూ—చేస్తావా నా దగ్గర పని?"

—చప్పున వాస్తవంలోకి వస్తే....యింటి దగ్గర పేదరికం. మాలతి కళ్ళలో తనపట్ల ప్రేమ. ఆమె తండ్రికి తనపట్ల నిర్లక్ష్యం. నాన్న దగ్గు—అన్నయ్య చాలీచాలని జీతం. చాక్లెట్లకోసం నోరు తడి చేసుకొనే గోపి— బాధల్ని చిరునవ్వుతో నొక్కిపట్టే వదిన—

"జీతం...." అన్నాడు.

"నా దగ్గర ప్రస్తుతం చాలా తక్కువుంది



గ్రాడ్యుయేటూ. ఉన్నదంతా....చూసేవుగా. ఖర్చు పెట్టేసేను."

అతడి మొహంలో కనపడిన విషాద ఛాయకి విచలితుడై "నేనేం చెయ్యాలి?" రమణ అడిగేడు.

"నాతోపాటూ ఆకాశంలోకి చూడాలి. కొత్త 'ప్లానెట్' దొరకవచ్చు. కొత్త 'గలాక్సీ' కనప డొచ్చు. నోబుల్ ప్రైజు రావటానికి అది చాలదా? అదిగో. కదలకుండా చూపు తిప్పి ఎడమవైపు చూడు. ఎలుక ఒకటి మనల్ని వెక్కిరిస్తున్నట్టూ మీసాల్ని ఎలా తిప్పు తూందో! కనీసం దాని గర్వాన్ని అణచటాని కైనా మనం ఒక గొప్పవిషయాన్ని కనుక్కో వాలి. ఏమంటావ్?"

రమణ తలూపేడు చేస్తానన్నట్టు.

జూన్ ఇరవైతొమ్మిది,

తెల్లవారుఝాము. నాలుగున్నర!

సాన్‌ఫ్రాన్సిస్కో–ది ప్రకృతిసిద్ధంగా ఏర్ప డిన ఎయిర్ కండిషన్డ్ వాతావరణం. పసిఫిక్ సముద్రం పక్కగా, కాలిఫోర్నియా దక్షిణ ప్రాంతపు కొండల్లో వుండటంవల్ల దానికా సౌలభ్యం చేకూరింది. మూడువైపులా సముద్రం, ఒకవైపు కొండలూ వుండటంవల్ల ప్రపంచపు గొప్ప రేవుపట్టణాల్లో ఒకటిగా పేరు పొందింది. పట్టణంలోకి ప్రవేశించటానికి ముఖ్య ద్వారం గోల్డెన్‌గేట్.

రకరకాల వాతావరణం, రకరకాల మను ష్యులూ వున్న పట్టణం అవటంచేత దాని పెరుగుదల గమ్మత్తుగా జరిగింది. ఉత్తర ప్రాంతాల్లో రష్యన్లూ—నాబ్‌హిల్ దాటేక ఇటాలియన్ క్వార్టర్లూ....గోల్డెన్‌గేట్, ప్రెసీడి యోల మధ్యనున్న రిచ్‌మాండ్ సెక్షన్లో ఓల్డు టౌనూ కనిపిస్తాయి.

సముద్రతీరానికీ, మిషన్‌స్ట్రీట్‌కీ మధ్య దక్షిణ దిశగా పారిశ్రామిక వాడలు పెరిగి నాయి.

బేషార్‌హైవేమీద మెక్ కారు దూసుకు పోతున్నది. ఏదో అకస్మాత్తుగా ఉపద్రవం వస్తే తప్ప తనకి అంత అర్జెంటుగా పిలుపు రాదని అతడికి తెలుసు. దాదాపు ప్రపంచం మొత్తాన్నీ ఆజ్ఞాపించగల ఒక దేశపు అత్యు న్నత పదవిలో వున్న మనిషికి ఫస్టు సెక్రటరీ అతడు. ఎటువంటి ఉపద్రవం?....యేదైనా కావచ్చు.

ప్రపంచంలో నిముషానికి యాభై లక్షల ఖర్చు—ఆయుధాల ఉత్పత్తి గురించి జరుగుతూంది. ఎంత గొప్ప చేదు నిజం. ప్రొఫెసర్ కాంట్రోవిట్జ్ చెప్పింది నిజమైతే—యింకో అయిదు సంవత్సరాల్లో 'లాసర్ బీమ్' ఆయుధాన్ని రష్యా తయారు చేస్తుంది. కాంతి వేగంతో అవతలి గమ్యాన్ని నాశనం చేసే సాధనం అది.

నిజానికి యుద్ధం ఒకటే కాదు ప్రమాదం.

రోజు రోజుకీ పెరుగుతున్న జనసాంద్రత ....పూర్వం లేనన్ని వాతావరణ విపరీతాలు, భూకంపాలు, తుఫాన్లు...హింసా ప్రవృత్తి.... డ్రగ్స్, శాడిజం, పాకిపోతున్న సుఖవ్యాధులూ, వాతావరణ కాలుష్యం.

మానవ జాతి మరణించకుండా ఏ శక్తి ఆపగలదు?

—కారు ఎల్కామినో రియల్‌నుంచి స్కైలైన్ బొల్‌వార్డ్‌వైపు సాగిపోతూ వుండగా అతను అనుకొన్నాడు.

ఇంకా తెల్లవారటానికి వ్యవధి వుంది. కొద్దిగా మంచు కురుస్తూంది.

థర్డ్ స్ట్రీట్‌లో వున్న పెద్ద భవంతి ముందు కాంటెస్సా ఆగింది.

విశాలమైన మెట్లు, కొద్దిగా తెరిచి వున్న తలుపు, లోపల యూనిఫాంలో ఉన్న గార్డులు.

ఓవర్‌కోట్ సవరించుకొంటూ మెక్ లోపలికి ప్రవేశించాడు.

కారిడార్‌లో లైట్లు వెలుగుతున్నాయి. అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వుంది. అక్కడక్కడ అసిస్టెంట్లు మౌనంగా తిరుగుతున్నారు. పెద్ద తుఫానురావటానికి ముందున్న వాతావరణం అక్కడ నెలకొని వుంది. పది అడుగులు ఎత్తున్న చెక్క తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. నాబ్ తిప్పి, నెమ్మదిగా తెరిచేడు. ....లోపల లైట్లు దేదీవ్యమానంగా వెలుగుతున్నాయి. మధ్యలో ఓవల్‌షేప్‌లో పెద్ద బల్ల వుంది. చుట్టూ కూర్చొని వున్నవాళ్ళని వరుసగా చూసేడు.

అండర్ సెక్రటరీ టు దీ డిఫెన్సుమినిస్టర్ చార్లెస్ మెక్డొనాల్డ్, ప్రెసిడెంట్ ఆఫ్ ది పార్లమెంటరీ కమిటీ జాన్ నిక్లల్సన్, సెక్రెటరీ ఆఫ్ స్టేట్—రాబర్ట్ ఫిన్చ్, ప్రెసిడెంట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ రోగర్స్ ...మెక్ చూపు పక్కకి కదిలి ఆగిపోయింది. అంత చలిలోనూ నుదుటిమీద చెమట పట్టింది.... చేతులు రెండు వళ్ళో పెట్టుకొని ముందుకు వంగి కాగితాల్ని పరిశీలిస్తూ ఒక వృద్ధుడు అక్కడ కూర్చొని వున్నాడు.

అతడు ఫస్ట్ సెక్రటరీ ఆఫ్ సెంట్రల్ కమిటీ ఆఫ్ కమ్యూనిష్టు పార్టీ ఆఫ్ సోవియట్ రష్యా—బోరిస్. ఎఫ్. కొస్టినోవా.

* * *

రెండు చేతులూ చెంపల కాన్చుకొని ఆలోచిస్తూంది శైలజ.

ఆమె ముందు ఇంటర్వ్యూ తాలూకు ఫైలూ, అభ్యర్థుల మార్కుల లిస్టూ వుంది.

ఆ రోజు రమణకి ఇంటర్వ్యూ జరుగుతున్నప్పుడు ఆమె ఏదో పని వుండి ఆ రూమ్‌లోకి వెళ్ళింది. రమణని చూసి 'ఎక్కడో చూసినట్టు వుందే' అనుకొంది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది రాణి ఫొటో చూపించిన సంగతి.

ఆమె బైట కొస్తూంటే అతనన్న మాటలు వినిపించినయ్.

"....ఇలాంటి ఇంటర్వ్యూ లుండవు. ఎయిర్ కండిషన్డు రూములుండవు....ప్రశ్నలుండవు సమాధానా లుండవు."


అమెకి నవ్వొచ్చింది.

నిజానికి అతడు అంతకుముందు సమాధానాలన్నీ చక్కగా చెప్పేడు అతడి సబ్జెక్ట్ కాకపోయినా.

కానీ మానేజిమెంటు అభ్యర్థి ఇంకొకతను వున్నాడు. రికమెండేషను కేండేటు. అతడి నిర్ణయం యెప్పుడో జరిగిపోయింది. ఈ ఇంటర్వ్యూ కేవలం బైటవాళ్ళని సంతృప్తి పరచటానికే.

ఆమె లిస్టు చూసింది.

ఉద్యోగం యివ్వాలనుకొన్న అభ్యర్థికి నూటికి తొంభై మార్కు లిచ్చేరు కమిటీ



సభ్యులు. రెండోవాడెవడో రామన్ అట. అతడికి యాభై మార్కులు వచ్చినయ్.

ఆమె రమణ పేరు కెదురుగా చూసింది.

సున్నా వుంది.

ఆమె పేలవంగా నవ్వుకొంది.

నిజానికి అతడు చెప్పిన సమాధాలకి నూటికి నూరు రావాలి. కేవలం అతడికి ఉద్యోగం యివ్వటం యిష్టంలేక, అతణ్ణి రెచ్చగొట్టి, ఆ నెపంమీద సున్నా మార్కు లిచ్చేరు.

రికమెండెడ్ కాండెట్ క్వాలిఫికేషనువైపు చూసింది.

ఇంటర్మీడియెట్—పాసు క్లాసు.

ఆమెకి రమణమీద జాలి వేసింది. సర్టిఫికేట్లు సర్దుకొంటూ అతడు నిస్సహాయంగా చూసిన చూపు ఆమె కింకా జ్ఞాపకం వుంది.

కానీ ఏం చెయ్యగలదు?

....ఫైలు సర్ది లోపల పెట్టి, ఆ రోజు పోస్టు తీసింది. ఒక్కో వుత్తరమే చదవ సాగింది.

నాలుగో వుత్తరం చదువుతూ ఆమె ఉలిక్కిపడింది. ఉద్యోగం వచ్చిన అభ్యర్థి దగ్గర్నుంచి అది. 'ఇంతకన్నా మంచి ఉద్యోగం వచ్చినందువల్ల దీంట్లో చేరలేనందుకు విచారిస్తున్నాను' అని. రికమెండేషను వున్నవాడికి ఇంతకన్నా మంచి వుద్యోగం రావటంలో ఆశ్చర్యం లేదు.

అయితే ఈ వుద్యోగం ఇప్పుడెవరకి వస్తుంది?

రామన్ అనే మద్రాసీకి.

అంటే కమిటీ మెంబర్లలో ఎవరికీ రెండో కేండెట్ మీద ఇంట్రెస్టు లేదన్నమాట.

ఆమె మనసులోకి తెరలాగా ఒక ఆలోచన వచ్చి సన్నగా వణికింది.

అలా చేస్తే....

ఎవరికైనా తెలుస్తే—

ఎలా తెలుస్తుంది?

అయినా ఎందుకు చెయ్యాలి?

అన్యాయం జరిగిన ఒక యువకుడికి న్యాయం చేకూర్చటంకోసం.

అయినా రిస్కు....

....

పరస్పర విరుద్ధ భావాల్తో ఆమె కొంచెంసేపు కొట్టుమిట్టులాడింది. చివరకు ఓ నిర్ణయానికి వచ్చినట్టు కలం చేతిలోకి తీసు

కొంది.

రామన్ అన్న ఇంగ్లీషు పేరుకి చివర 'ఎ' అన్న అక్షరం కలిపింది.

* * *

ఒక పెద్దపులి. రెండుకాళ్ళతో నడుస్తూ మీద మీదకి వస్తున్నది. మిగిలిన రెండు చేతులూ భయంకరంగా సాచి, గోళ్ళతో చీల్చి చెండాడటానికి ముందుకొస్తున్నది. కేక వేయబోయేడు. నోటి వెంబడి మాట రాలేదు. పరుగెత్తసాగేడు. వెనుకే పులి. ఆగి వెనక్కి చూసి మళ్ళీ పరుగెత్తసాగేడు. ఎంత పరుగెత్తినా అడవి తరగటంలేదు. అడవి. అంతా అడవే. పులి వెనుకే వస్తున్నది.

చప్పున ఆగిపోయేడు. ఎదురుగా పెద్ద వాగు. పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది, వెనుక పులి గాండ్రింపులు వినిపిస్తున్నాయి. చుట్టూ చూసేడు. చుట్టూ ఫైళ్ళు. పెద్ద పెద్ద చెట్లలా బీరువాలు. చెట్లకి ఆకులు లేవు. ఫైళ్ళు వేలాడుతున్నాయి. ఆర్డినరీ....అర్జెంట్....ఇమ్మీడియట్....కాగితాలు లేస్తున్నాయి. దుమ్ము. పేపర్ బాస్కెట్‌లోంచి సుడిగాలిలా లేస్తున్న కాగితాలు.

అంతా చుట్టూ చేరింది.

వెనుకనుంచి పులి మీదకి దూకింది.

కెవ్వున అరిచేడు.

"ఏమండీ....ఏమండీ...." అని తట్టిలేపింది జానకి.

ప్రకాశరావు కళ్ళు తెరిచేడు. ఒళ్ళంతా చెమట పట్టింది. మనిషి వణికిపోతున్నాడు.

"ఏమైందండీ?" అడుగుతూంది.

అతడు కొంచెంసేపు మాట్లాడలేదు. తరువాత బలహీనమైన కంఠంతో "మంచినీళ్ళు" అన్నాడు.

ఆమె లేచివెళ్ళి మంచినీళ్ళు తెచ్చియిచ్చింది. వణుకుతూన్న చేతుల్తో అందుకొని గబగబా తాగేడు.

జానకికి భర్త సంగతి తెలుసు.

"ఏమైందండీ?" అని అడిగింది.

"కల, భయంకరమైన కల" అన్నాడు.

"ఏమిటి?"

కలని వర్ణించి చెప్పేడు.

"పులి రెండు కాళ్ళమీద నిలబడి వుందా?"

"ఆఁ....! రెండు కాళ్ళమీద మనిషిలాగే వుంది."

"మొహం పులిలాగే వుందా?"

"ఆ. పులిలాగే....వుహూఁ....కొద్దిగా పులీ—కొద్దిగా మనిషీ—అలా వుంది."

"మనిషి ఎలా వున్నాడు?"

"మా హెడ్ క్లర్క్‌లా వున్నాడు."

ఆమెకి అతడిమీద జాలేసింది.

"ఆఫీసులో యేదైనా గొడవ జరిగిందా?...."

అతనో క్షణం ఆగి అన్నాడు. "ప్రతిరోజూ వుండేదే. నాకు డ్రాఫ్టు వ్రాయటం కూడా సరిగ్గా రాదట. అందరిముందూ పట్టుకొని....నాకన్నా ప్యూన్ దగ్గిరి నయమట."

"లాగిపెట్టి కొట్టలేకపోయారా?"

"అంత ధైర్యమే వుంటే ఇంతవరకు ఎందుకొచ్చేదీ?"

ఆమెకి విసుగేసింది. "మరేం చేసేరు? చేతులు కట్టుకొని విన్నారా?"

"అతడు మా హెడ్‌క్లర్కు."

"అయితే నేమండీ! వాడు మెట్రిక్యులేషన్ అయినా పాసవలేదని మీరే అన్నారు. మీరు యమ్మెల్బీ. నిజంగా మీరు డ్రాఫ్టు చాలా బాగా వ్రాస్తారు. ఎస్సెల్సీ చదివిన నాకే అది ఎంతో ముచ్చటగా వుంటుంది. అటువంటిది మీ హెడ్ క్లర్కుకి నచ్చలేదంటే అది వాడిఓర్వలేనితనాన్ని సూచిస్తుందే తప్ప మిమ్మల్నేమీ కించపర్చటం లేదు. మీరు చెయ్యాల్సిందల్లా వాణ్ణి ఎదుర్కోవటమే. ఒక్కసారి తిరగబడండీ....! అప్పుడు చూడండి ఏమవుతుందో....ఆఫీసరు కూడా మీ మాటే అవునంటాడు. మీలో మీరిలా కుంచించుకుపోవటం మొదలుపెడ్తే, చివరికి మీ ప్యూన్ కూడా మీకు పని చెప్తాడు. కొంచెం బలం తెచ్చుకోండీ! మనసు దిటవు చేసుకోండి. పులి తాలూకు భయం ఎక్కడో లేదండీ! మీ మనసులోనే వుంది. అసలే మీ ఆరోగ్యం మంచిదికాదు. దానికి తోడు ఈ పాడు ఆలోచలు ఒకటి. అన్నీ మర్చిపోండి. ఇలా దగరకి రండి. నా వళ్ళో తల పెట్టుకొని పడుకోండి! ఎందుకండీ భయపడ్తారు? మనం బ్రతుకుతున్నది భయపడటానికి కాదండీ. ఒక మాట చెప్పనా...."

చీకటి నెమ్మదిగా విచ్చుకొంటోంది. దూరంగా యెక్కడో ఒక కోడి ప్రపంచాన్ని లేపుతోంది.

తూర్పు ఎర్రటి మేలిముసుగు సవరించుకొంటూ సూర్యుణ్ని ఆహ్వానించటానికి ఆయత్తమవుతూంది.

"....మనిషి ఒక్కసారే చచ్చిపోతే పర్లేదండీ. కాని క్షణం క్షణం మానసికంగా చావకూడదు. మనిషి మానసికంగా చావకూడదండీ."

* * *

"మనిషి సాంఘికంగా చావకూడదయ్యా. అట్లా సాంఘికంగా చచ్చిపోనివ్వకుండా వుండటానికే ఈ న్యాయస్థానాలూ ఈ చట్టాలూ. ఎట్లా దీస్కుంటడంట నీ పొలం? చూద్దాం యెట్ల దీస్కుంటడో" అన్నాడు రంగారావు. అతడి అసలు పేరు రంగయ్య. కొద్ది కొద్దిగా రాజకీయాల్లో చేరేక పేరు రంగారావుగా మార్చుకొన్నాడు. అతనికీ మున్సబుకీ పడదు. అందువల్ల రాజయ్యకి దగ్గరయ్యేడు.

"కోర్టులో చిన్న దావా పడేద్దాం. వాళ్ళందర్నీ మూడు చెరువుల నీళ్ళు తాగించే బాధ్యత నాది."

"డబ్బున్నోడూ డబ్బున్నోడూ కొట్టుకొనేటందుకైతే కోర్టుకావాల బాబూ. డబ్బున్నోడు డబ్బు లేనోణ్ని కొట్టేటందుకు ఈడి కడుపు సాలు" అన్నాడు చేతులు కట్టుకొని రాజయ్య.

అతడు యిల్లు కాలిన ఆసామీ లా వున్నాడు. "అట్ల వదిలిపెడ్తామంటయ్యా?" అన్నాడు చుట్ట వెలిగించుకొంటూ రంగారావు. "యాభై మందిని పోగెయ్యి. పొలంకాడ నిలబడ్దాం. వంట యెట్ల తోల్కెడ్తడో చూద్దాం."

"పోలీసోళ్ళని తీసుకొస్తడు బాబూ."

"న్యాయం మనేపుంది కదయ్యా."

"పోలీసోళ్ళు ఆయనేషంటరు బాబూ"

7

ప్రొఫెసర్ అయోమయం దగ్గర రమణ చేరి అప్పటికి నెలయింది. అతడిదగ్గర చెయ్యవలసిన పనేమీ లేదు. అతడెప్పుడూ యేవో లెక్కలు కట్టుకొంటూ కూర్చొంటాడు. ఒక ఫ్లాస్కునిండా టీ వుంటే చాలు. ఇంకేమీ అక్కర్లేదు. ఆ నెలరోజుల్లోనూ ఒక్కసారి కూడా అతడు బైటకిరాలేదు. కేవలం రమణని కలవటంకోసమే అతడి మనసులో ఆ రోజు బైటికెళ్ళాలన్న కోర్కె పుట్టినట్టుంది.

గది నిండా కాగితాలే. అంకెలు వేసిన కాగితాలు. స్క్వేర్లూ, రూట్లూ. అన్నీ వేల వేల సున్నాలమీదా, 'టుది పవర్ ఆఫ్'ల మీదా ఆధారపడిన అంకెలు. అన్ని సబ్జెక్టులకన్నా అస్ట్రానమీ యెంత ఇంటరెస్టింగ్ సబ్జెక్టో అంత బోరింగు సబ్జెక్ట్.

రమణకి అక్కడ నచ్చేదిఒక్కటే. ఎలుకలు. అవి చాలా సురక్షితంగా పెరుగుతున్నాయి అక్కడ. అప్పుడే రమణతో స్నేహం కట్టేసేయి కూడా. ఒక ఎలుక దూరంగా నిలబడి పరామర్శిస్తుంది. ఇంకొకటి మీసాలు వూపుతూ వెక్కిరిస్తుంది. వాటికి, అక్కడ మనుష్యులున్నారన్న భయం ఏమాత్రమూ లేదు. ఒకడు ప్రపంచాన్ని పరిత్యజించిన యోగి. మరొకడు ప్రపంచంమీద విరక్తి పెంచుకొంటూన్న యువకుడు. అందుకే అవి ఆ పెద్ద భవంతిలో—రాజ భవనంలో పరిచారికల్లా తిరుగుతూ వుంటాయి.

ఈ ప్రొఫెసర్ ఒక్కోసారి ఎంత తెలివి లెక్కలుకడ్తూ వుంటాడో, ఒక్కోసారి అంత

తెలివితక్కువగా ప్రవర్తిస్తూవుంటాడు. అతడ్ని చూసిన వాళ్ళెవరూ అతడు ఆస్ట్రొనమీలో 'ఒకాయామా ఆస్ట్రో ఫిజికల్ అబ్జర్వేటరీ' నుంచి సర్టిఫికేట్ పొందాడనీ, హార్ట్‌లాండ్ మాగ్నెట్ ఫీల్డులో రాయల్ అస్ట్రొనమర్‌గా నాలుగువేల పౌండ్ల జీతాన్ని వదులుకొని వచ్చి, ఆస్థి సర్వస్వం తగలేసుకొని ఇలా మారుమూల వుండిపోయేడనీ అనుకోరు. అయితే యింత తెలివైనవాడూ ఎంత తెలివితక్కువగా ప్రవర్తిస్తూ వుంటాడో తెలియజెప్పటానికి, రమణకి పాత ఫైళ్ళలో దొరికిన ఈ ఉత్తరాలు చాలు.

"ప్రియమైన భారత దేశపు ప్రధాని జగదీష్ చంద్రకి—

మీరు ఆరోగ్యంగా వున్నారని తలుస్తాను. మీ పాలనలో దేశం సుభిక్షంగా వుందని కూడా భావిస్తున్నాను. ఈమధ్య యింటి నుంచి బైటకు కూడా కదలక పోవటంవల్ల దాని సంగతి అసలు తెలియటం లేదు.

పోతే ముఖ్యమైన సంగతేమిటంటే నేను ఎల్లుండి ఢిల్లి వస్తున్నాను. రెండ్రోజులు వుంటాను. వీలు చూసుకొని ఏదో ఒక సమయంలో మిమ్మల్ని కలుసుకొంటాను.

మిగతా విషయాలు సమక్షంలో.

విన్రమతతో
ప్రొ. ఆనందమార్గం.

పి. యస్:-నేను అరగంటకంటే ఎక్కువ కాలం మీతో గడపలేను. క్షమించగలరు."

—ఈ వుత్తరం చూసి రమణకి అరగంట వరకూ నవ్వు ఆగలేదు. దీనికి జవాబు రానట్టుంది. మళ్ళీ ఈయన దగ్గర్నుంచే ఇంకో వుత్తరం తాలూకు కాపీ.

"ప్రియమైన జగదీష్‌చంద్రా—

నేను యింతకుముందో వుత్తరం వ్రాసేను. అయితే కవర్ మీద అడ్రసు వ్రాసేనా అన్న అనుమానం వస్తూంది ఇప్పుడు. ఏది ఏమైనా, మీ ఆఫీసుముందున్న సెక్యూరిటీ గార్డులు నన్ను లోపలికి రానివ్వలేదు. ఇక ఆ విషయం అలా పోనివ్వండి. మీరు యీ వూరు వచ్చినప్పుడు నన్ను కలుసుకోండి. తప్పక కలుసుకోండి. అడ్రసు యీ వుత్తరం కుడివైపున పైనుంది.

అభినందనలతో
ఆ. ఆ. మార్గం.

పి. యస్:-మా యింటి ముందు సెక్యూరిటీ గార్డులు లేరు. అయినా మీ రొచ్చే ముందు వుత్తరం వ్రాయండి. ఎందుకన్నా మంచిది కదా అది."

ప్రధానమంత్రి కార్యాలయంలో ఇలాటి ఉత్తరాలకి జవాబు యివ్వటం సెకండ్ అసిస్టెంటు పని—ఏ భాషలో వచ్చిన ఉత్తరమైనా అక్కడ తర్జుమా చెయ్యబడుతుంది. దాదాపు ముప్పాతిక వంతులు అక్కణ్నుంచే క్లియర్ చెయ్యబడతాయి. మిగతావి ఫస్టు సెక్రటరీకి వెళ్తాయి. ప్రధానమంత్రి సంతకాన్ని డూప్లికేట్ చేసే స్పెషల్ సిగ్నేచర్ మెషీన్‌లో మిగతా వుత్తరాలకి జవాబు యివ్వబడుతుంది. ఈ సంతకం అచ్చు ప్రధానమంత్రి స్వయంగా చేసినట్టూ వుంటుంది. అయితే ప్రొఫెసర్‌గారి ఉత్తరం మొదట్లోనే ఆగిపోయింది.

ప్రధానమంత్రి సచివాలయం
న్యూ ఢిల్లీ.

"ప్రియమైన అయ్యా,

మీ ఉత్తరం అందింది. ప్రధానమంత్రి మిగతా ముఖ్య విషయాల్లో నిమగ్నులై వుండటంవల్ల మిమ్మల్ని కలుసుకోలేకపోయేరు.

అభినందనలతో—

ఇట్లు
గోపాలకృష్ణ ఎగ్బోటే.
ఇన్ఫర్మేషన్ ఎడ్వైజరు."

* * *



ఈ విధంగా వుంటుంది ప్రొఫెసర్ యోమయంగారి ఎక్స్ట్రా కరిక్యులర్ యాక్టివిటీ.

రమణ చేరిన మొదటి నాలగు రోజులూ యీ వుత్తరాలూ, మిగతా పేపర్లూ చదువుతూ కాలం గడిపేడు.

ఈ వుత్తరాలు కొంచెం అర్థమై నవ్వు తెప్పించేవికానీ, మిగతా రాతలు అర్థం లేనట్టు పిచ్చిగా వుండేవి.

అంటికి అన్నిటికన్నా నచ్చింది ఈ వృద్ధుడి అమాయకత్వం. అతడెంత తెలివైనవాడో అతడి మాటలు అంత అమాయకంగా వుండేవి. అంత అమాయకుడు కాబట్టే లక్షల ఆస్తిని ఇనుపసామానుగా మార్చుకొని తన భావనా లోకపు ప్రపంచంలో పెట్టుకొన్నాడు.

అతడి చేతల్లో చురుకూ, కళ్ళల్లో తేజస్సూ, మాటల్లో మంచితనం రమణని కట్టిపడేసేవి.

అయినా ఈ ప్రొఫెసర్ గొడవల్లో పడి రమణ తన ఉద్యోగం సంగతి మర్చిపోలేదు. కనపడిన చోటల్లా అప్లై చేస్తూనే వస్తున్నాడు. అతడు ప్రొఫెసరుదగ్గర చేరిన ఇరవై రోజులకి ఓ సాయంత్రం పత్రికా ఆఫీసు నుంచి వచ్చి ఉద్యోగంలో చేరమని పోస్టులో ఆహ్వానం వచ్చింది.

ఇల్లంతా ఆనందం వెల్లివిరిసింది. ముసలాయన దగ్గుతూనే, ఉద్యోగంలో చేరిన కొత్తలో యెలాటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పి, పైన ఏమైనా దొరుకుతుందో లేదో అని ఎంక్వయిరీ చేసేడు. అన్నిటికి ముక్తసరిగా సమాధానం ఇచ్చేడు రమణ. తండ్రితో ఎక్కువగా మాట్లాడడు రమణ. తండ్రి చరిత్ర అంతా అతడికి తెలుసు. అయితే యెన్నాళ్ళ క్రితం సిఫిలిస్ అతణ్ణి పట్టుకొందో తెలియదు. ఈ దగ్గుకి కారణం కూడా అదేనేమో అతడు గవర్నమెంటు హాస్పిటల్‌కి వెళ్ళి ఎంక్వయిరీ చెయ్యలేదు. అతడి దృష్టిలో అతడి తండ్రి నైతికంగా ఎప్పుడో చచ్చిపోయేడు.

ఆ మరుసటిరోజు అతడు తన ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళి పత్రికాఫీసులో ఉద్యోగం వచ్చిన సంగతి చెప్పేడు.

(ఇంకా వుంది)

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

ప్రేమలేఖ

కుమారి తమరి రాజరాజేశ్వరి, బి.ఎస్.సి. (ద్వితీయ)
ఉమెన్స్ కాలేజీ, గుంటూరు.

ఎదురింట్లోకి యెవరో వచ్చారు. అప్పుడే వాళ్ళొచ్చి వారంరోజులు అయింది. మూడు రోజులబట్టి చూస్తుందామె. ఆ అబ్బాయి అలా వాళ్ళింటివైపే చూస్తాడు. ఆమె కనిపించేసరికి అతని కళ్ళల్లో ఏదో వింత మెరుపు. నవ్వాలని ప్రయత్నించి నవ్వలేక పోతున్నట్లు చిన్నగా కదిలే పెదవులు. పచ్చని ఛాయ, కర్లింగ్ హెయిర్, ఒడ్డూ, పొడుగు ఆడపిల్ల కోరుకునే అందం ఉంది అతనిలో. కానీ చీటికి మాటికి ఆమెవైపే చూడ్డం ఆమెకో న్యూసెన్స్‌లా ఉంది. అఫ్‌కోర్స్ ఆమెకూడా చూస్తుందనుకోండి. అతను ఉన్నాడా లేదా అని చూసినప్పుడల్లా అతను అక్కడే వుంటున్నాడు. అతనికి వేరే పనిలేదా? ఆమెకు నవ్వొచ్చింది. ప్రస్తుతానికి ఆమెకేం పనిలేకే అతన్ని గురించి ఇంత తీవ్రంగా ఆలోచించింది.

* * *

ఆమె ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ వాళ్ళింటికి ఏడెనిమిదేళ్ళ అబ్బాయి వచ్చాడు.

"ఏం కావాలి?" ఆమె ప్రశ్న.

"మా అక్క ఏమైనా పుస్తకా లుంటే యిమ్మందండి...." కొత్త బిడియంగా అడిగాడు.

"మీ ఇల్లెక్కడ?" ఆమె అలా అడిగేసరికి ఆ అబ్బాయి ఆశ్చర్యంగా చూశాడు.

"ఈ ఎదురింట్లోనే ఉన్నాం" మీకు తెలీదా అన్నట్టు చూశాడు.

ఆ అబ్బాయి వివరాలు అడుగుదామనుకుంది. ఛ వాళ్ళేమనుకుంటారో, ఏమనుకుంటారేం కొత్తగా వచ్చారు కదా! తనకు తానే సమాధానపడి ఆ అబ్బాయిని అడిగేసింది.

"మీ ఇంట్లో ఎవరెవరుంటున్నారు?"

"మా అమ్మా, నాన్నా యింకా, ఒక అక్క పేరు రాధ, ఇంకో అక్క పేరు గీత? మా గీతా చచ్చిపోయింది—అప్పుడు మా చిన్నన్న పిచ్చెక్కిపోయాడు" బేలగా అన్నాడు. మళ్ళీ హుషారుగా "యింకో అన్నయ్య ఉన్నాడు. చిన్నన్నకు పిచ్చికూడా పోయింది. నా పేరు బుజ్జి" తీగ లాగితే డొంకంతా కదిలినట్లు విషయాలన్నీ చెప్పి పుస్తకాలు పట్టుకొని వెళ్ళిపోయాడు.

"పాపం రెండో అబ్బాయికి పిచ్చంట. పిచ్చి తగ్గినా కొన్ని లక్షణాలు పోవేమో! ఒకవేళ నా వైపు చూసే అబ్బాయేనా?" ఛ! ఛ! ఆమెకలా ఆలోచించ బుద్ధికాలేదు. ఏమో నాకెందుకు లెద్దు, విసుగ్గా లేచి తలుపులు గొళ్ళెం పెట్టి లోపలకు వచ్చి మంచంమీద వాలింది.

ఇంట్లో వాళ్ళంతా పెళ్ళికి వెళ్ళారు. ఉన్నది ఆమె ఒక్కర్తే. పరమ బోర్‌గా ఉందామెకు. పుస్తకం తెరిచింది. అతని రూపమే.

మెరుపులు వెదజల్లుతూ కాంతివంతంగా ఉన్న కళ్ళూ, నవ్వీ నవ్వనట్టుండే పెదవులు. ఏమయిందతనికి? ఎందుకలా నావైపు చూస్తాడు? అలా చూసీ, చూసీ ఐ లవ్ యూ అనడుకదా! ఆమె ఆలోచనలకు ఆమే ఉలిక్కిపడింది—బలవంతంగా పుస్తకం పేజీలు తిప్పుతూ మగతగా నిద్రలోకి జారిపోయింది.

* * *

టైము తొమ్మిది దాటిపోయింది. పనులన్నీ ముగించుకొని తొందర తొందరగా చెప్పుల్లో కాళ్ళు దూర్చి యింటికి తాళం వేసి బయట పడింది.

"ఏమండీ?"

వెనక్కి తిరిగి చూసింది. నిన్న పుస్తకాలు తీసుకెళ్ళిన అబ్బాయి.

"మా అన్నయ్య మీకు ఇది ఇమ్మన్నాడు" గబగబా చేతిలో కాగితంపెట్టి వెనక్కి పరిగెత్తి పోయాడు.

"అనుకున్నంత అయింది. 'ప్రేమలేఖ కాబోలు" స్వగతంగా అనుకుని పర్స్‌లో పడేసి కొంచెం దూరం నడిచాక బస్‌కోసం వెయిట్ చేస్తూ నిలబడింది.

అందులో యేం ఉంటుంది? మీరు చాలా అందంగా ఉంటారు—మిమ్మల్ని ప్రేమిం చాను. మీ కిష్టమైతే పెళ్ళి చేసుకుంటాను. హు! ఇంతకన్నా ఏం వ్రాస్తాడు? ఉత్తరం తీసి చదవబోయింది. ఆమె ఎక్కవలసిన బస్సు వచ్చి ఆగింది.

హమ్మయ్య! అనుకొని టికెట్ తీసుకొని పర్సులో వేసింది. అప్పుడు మళ్ళీ కాగితం తీసి "ఓ" అనుకొంది—మడత విప్పి సంబోధన చదివి కొయ్యబారిపోయింది

"డియర్ గీతా!" ఎవరికీ ఉత్తరం నాకేనా? నా పేరు గీత కాదే? ఆలోచనలో పడి మళ్ళీ చదవటం ప్రారంభించింది.

—మీ పేరు గీతేనా? ఏమో! నాకు తెలీదు. కానీ, మీలో నా గీతను చూసుకుంటున్నాను. అచ్చు గీత మీలాగే ఉండేది. గుండ్రని మొహం, పెద్ద పెద్ద కళ్ళు, కొనదేలిన ముక్కు, నవ్వితే పలువరస తళుక్కుమని నొక్కులుపడే బుగ్గలు. ఎంత అందంగా ఉండేది గీత. కానీ, కాని గీత బాగోలేక నన్ను పిచ్చివాణ్ని చేసి వెళ్ళిపోయింది. గీతను నేను మరువలేను కానీ, తప్పదు, మరవాలి అనుకొన్న సమయంలో నా గీత రూపం మీలో కనిపించింది. కొడిగట్టే దీపంలో చమురు పోస్తే కొండంత వెలుగు. నా పరిస్థితీ అలాగే అయింది. మా గీతతో అనుబంధం మరువలేనిది. మరుపురానిది. మీరు చాలా అరుదుగా నవ్వుతారు. మీరు నవ్వినట్టే మా గీత కూడా నవ్వేది. కానీ మా గీత లేస్తూనే నవ్వేది. నవ్వుతూనే కాలాన్ని గడిపింది. నవ్వుతూ నన్ను విడిచి వెళ్ళింది. అందుకే మా గీతను మీలో....చూచేందుకు అనుమతిస్తారు కదూ! ప్లీజ్ అనుమతి ఇవ్వండి.

ఇట్లు
గీతకు ప్రియమైన అన్నయ్యను.
మరి మీకూ్కడా!"

ఒకటికి రెండుసార్లు, కాదు పదిసార్లు చదివింది. తను యెంత తప్పుగా ఆలోచించింది. ఎదుటి మనిషిని గురించి యెంత హీనంగా ఊహించింది. పాపం ఆ అబ్బాయి. జాలి పడింది. ఆమె మనసు ఆలోచనలతో సతమతమవుతూ కాలేజీకి వెళ్ళలేక తిరిగి యింటికి వచ్చేసింది.

తలుపు తాళంతీసి కిటికీ దగ్గరకు వచ్చి చూసింది.

అతను యెప్పటిలా అక్కడే ఉన్నాడు. పాపం నేను ఇంట్లోనే ఉన్నాననుకొంటున్నాడు కాబోలు. పూర్‌ఫెలో జాలిగా అనుకుంది. చిన్న చిన్నగా ఆమె పెదవులు విచ్చుకున్నాయి. అతను ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

ఆమె నవ్వుతుంది. కాదు, గీత నవ్వుతుంది.

అతను నవ్వాడు—ఆమె నవ్వింది.

అచలం

వేగుంట మోహన్‌ప్రసాద్

అలా ఆవలిస్తోన్నవాడు ఆవలిస్తోనే ఉండిపోయి
రబ్బరులా ఈ విశ్వాన్ని లాగిపట్టి సాగదీసి బెట్టి
చినుకుల నిశ్చేనమిూంచి వర్షంలో కిందికి దిగబోతున్న
రవివర్మ స్నానకన్యనలానే ఉరిదీసి
శూన్య నిశ్శబ్దంలోకి ఎప్పుడో దిగడిపోయిన
వీణాతంత్రి తుంపు తుప్పుని రాల్చక
గడ్డకట్టిన నయాగరా నీటి పలుపుల్లోకి పేనుకుపోయిన
స్ఖలిత క్లేశం ఫలిలి కేశాన్ని పీకి పారేయక
ఈ పంక్తిలో పేర్చుకొంటూ పోతూన్న అక్షరాల నక్షత్రాల
నఖక్షతాలని రుద్దిపామక ఆవిడ పెట్టుకొనే
రాలీరాలని ముక్కుపోగురాయి స్మితా స్మిత
దంతాల వెలుగు లుకలుకలలో కలిసి నిలిచీ నిలవక
వాంగో ఇంప్రెషనిస్టిక్ సూర్యకాంత పుష్పం
అగ్నిశిఖలు వీచక నాల్కలు చాచక
ఋష్యాశ్రమంలో శకుంతల మొక్కలికి పోసే
రంగస్థలంమిూది ఉత్తుత్తి నీళ్లు ఎప్పటికీ అయిపోక, చచ్చినా కట్టెకళ్లు
ఎంత అదిమి దిమ్మిసా కొట్టినా మూతపడక
ఈ విశ్వాన్ని ఇంకొంచెం ఇంకొంచెం బెల్లించి ఉంచి
నేలా నింగీ ఉయ్యాలలూగే గాలికి
లేతనీలం పరికిణీ మామిడి కొమ్మకు కట్టి
పగలూరాత్రికి అంపకాల మంచంమిూద పాలు ఎంగిలిచేయించి
పసిపాప కేకా కపాలం పగులు ఎలుగూ ఐక్యనాదం చేసి
నేను, గోపురాల్ కూలి పావురాల్ రాలి ధ్వజస్థంభం విరిగి
గడ్డకట్టిన గర్భగుడి శూన్యంలో, ఊ అలా ఆవలిస్తోన్న
శేషుడి నిర్వ్యాపార నిర్మోహ నిర్లజ్జా శిధిల సమాధి ముందర
నిదరకు జోగుతున్న, ఒంటరి బిక్కు బిక్కు దిక్కు లేని
చింకి శతాబ్దాల ఆముదపు జ్ఞాపకాల నూనెకు నానిన
ప్రమిదను, మూకుడు దీపాన్ని, ఫ మని ఊది, కాలితో తన్ని పోస్తానూ.

సీ రి య ల్



పదినెలలు నిండబోతున్న విజయ్ ఏమీ పట్టుకోకుండానే నడుస్తున్నాడు. వాడిని పట్టుకోవటం కాంతమ్మకి సాధ్యం కావటంలేదు. కింద ఒక్కవస్తువు కనబడటానికి లేదు. విజయ్ స్పృశించిందంటే మరుక్షణం దాని రూపం మారిపోతుంది.

"అబ్బబ్బ! ఏం అల్లరిరా నాయనా'" అంటూ కాంతమ్మ విజయ్‌ని ఉయ్యాల్లో కూలేస్తుంది. వాడు నోరంతా తెరిచి నవ్వుతాడు. అలాంటప్పుడు కాంతమ్మ "ఇదెక్కడి చురుకు! ఇదే మందం-ఏ ఇంట్లో పుట్టవలసిన బిడ్డో!...." విజయ్ గురించి ఆలోచిస్తుంది. అదివరకులా అంటీ ముట్టు నట్టు వుండడానికి ఆవిడకి అస్సలు కుదరటంలేదు. మధ్యాహ్నం పడుకున్నా విజయ్ వచ్చి జుట్టు పీకా—చెవులు పట్టుకులాగనూను. అలాంటప్పుడు ఉయ్యాల్లో కూలేస్తే రాగం అందు కుంటాడు. ఇంక యిది పనికాదని తను పడుకోదలుచుకున్నప్పుడు తను పడుకున్న మంచంమీదే బొమ్మలు పడేసి విజయ్‌ని పక్కలో కూర్చోబెట్టుకుంటుంది. అప్పుడు వాడేం గొడవ చేయడు. ఆడుకుంటూ కూర్చుంటాడు.

మీరా రోజూ రాగానే "విజయ్ ఏడ్చేడా? అల్లరి చేశాడా?" అని ఆతృతగా అడుగుతుంది.

వాడి అల్లరికి ఒక్కొక్కసారి మురిసినా అదేం మీరాకు చెప్పదు. "లేదు" అని ఒక్క మాటలో తేల్చేస్తుంది. ఎవేనా గాజుగ్లాసులూ అవీ పగలగొడితే—మీరా "ఇక్కడ గ్లాసు ఏదమ్మా!" అని అడిగినప్పుడు "కింద పడేశాడు-పగిలిపోయింది" అని అప్పుడు చెప్తుంది.

మీరా ఇంటికి రాగానే విజయ్ "అః అః" అంటూ పడ్తూలేస్తూ రెండు చేతులూ చాచి గబగబా వస్తాడు. మీరా వాడిని గట్టిగా హత్తుకుని "వాడిని వదిలి యింత సేపు యెలా వున్నాన" అనుకుంటుంది. కాంతమ్మ పని వున్నట్టు అక్కడనించి వెళ్ళిపోతుంది. అలాంటప్పుడు ఆవిడకి మీరా జీవితం ఇలాగే గడిచిపోతుందనే సత్యం అప్పుడే తెలిసినట్టు భయపడుతుంది.

పొద్దునప్పుడు కూడా విజయ్ పనికాకుండా కాళ్ళకి అడ్డం పడుతూంటాడు. తను వెళ్ళేకా తల్లికి ఎలాగూ తప్పదు. తను యింట్లో వుండగాకూడా తల్లిని యిబ్బంది పెట్టడం ఎందుకని మీరా విజయ్‌ని ఎత్తుకొనేనా సరే వంటపని మినహా ఇంట్లో పనంతా చేసేస్తుంది. విజయ్‌ని కూడ తను యింట్లో వున్నంతసేపు తల్లీని విసిగించకుండా చూసుకుంటుంది.

రాత్రి అంతా కాంతమ్మ మూలుగుతూనే వుంది. మీరా లేచివచ్చి, "ఏమిటమ్మా మూలుగు తున్నావు" అని అడిగింది. "ఏం లేదు" రెండుమూడు సార్లు అడిగినా అదే సమాధానం చెప్పింది కాంతమ్మ. మీరా ఒళ్ళు తాకి చూసింది. రగ్గుకప్పుకున్న మూలానో ఏమో ఒళ్ళు కొద్దిగా వెచ్చగా అన్పించింది. మీరా తల్లి పక్కలోనే కూర్చుంది. ఇన్నాళ్ళయిపోయినా—విజయ్‌కి పదినెల లెడుతున్నా—అమ్మ యింకా తనతో సరిగా మాట్లాడదు. తన సంగతే చెప్పదు. ప్చ్! నిట్టూ ర్చింది. "ఇంక ఎప్పటికీ యింతేనా? తన గురించి బెంగతో జీవితం వెళ్ళబుచ్చుతుందా!" మీరా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

ఎనిమిది గంటలకల్లా మీరా వంటకూడా చేసేసింది. తల్లి దగ్గరికి వచ్చి అంది "అమ్మ గారితో చెప్పి నేను తొందరగా వచ్చేస్తానమ్మా! వచ్చేటప్పుడు నీకు మందు తీసుకొస్తాను" కాంతమ్మ మాట్లాడలేదు. మీరా మళ్ళీ చెప్పింది. "ఊఁ" అంది కాంతమ్మ. "మరి నేను వెళ్ళిరానా?" అంది. మళ్ళీ "ఊఁ" అంది.


"డాక్టరుగారికి ఏం చెప్పమంటావు" అని అడిగింది మీరా.

"నాకేం అక్కరలేదు. నాకేం లేదు" అంది కాంతమ్మ.

మీరా యివతలికి వచ్చేసింది. ఆవిడ అలా అందంటే యింకేం చెప్పదు.

తల్లిని తలుపు వేసుకోమని చెప్పి యివతలకి వచ్చేసింది.

ఇక్కడికి వచ్చేసరికి శాంతమ్మగారు పడుకునుంది. 'గుండెదడ వచ్చిందా' అనుకుంది మీరా. "ఏమ్మా పడుకున్నారు" అని అడిగింది మంచం దగ్గరగా వస్తూ.



"మామూలేనమ్మా! కూర్చో!" అందావిడ. మీరా స్టూలు మంచం దగ్గరగా లాక్కుని కూర్చుంది. "డాక్టరుగారికి కబురు చేయమంటారా?" అంది.

"రాత్రి డాక్టరు వచ్చింది."

"రాత్రినించీ యిలా వున్నారా?" అని అడిగింది. ఆవిడకి యెప్పుడూ మనిషి దగ్గరుండటం యిందుకే. మీరాకి కుదరదు. మీరా నొచ్చుకుంది. క్రితం రోజు సాయంత్రం మీరా తొందరగా కూడా వెళ్ళింది. అదే అంది ఆవిడతో "నిన్న నేను తొందరగా యింటికి వెళ్ళిపోయాను."

"నేనే వెళ్ళమన్నాను కదమ్మా! రాత్రి ఎనిమిది తర్వాత గుండెదడ వచ్చింది. గంగులు వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు. అప్పి అర్ధరాత్రి వరకూ మేలుకొనే వుంది."

అప్పి గంగులు కూతురు. అది యిక్కడే తిని యిక్కడే పడుకుంటుంది.

"అబ్బాయి వచ్చేసరికి నేనిలా వుంటే బాధపడ్తాడు. నేను మందు సరిగా తీసుకోలేదను కుంటాడు. ఎల్లుండి చినబాబు వస్తున్నాడు."

"ఈ రోజూ రేపూ విశ్రాంతి తీసుకోండి-తగ్గిపోతుంది" అంది మీరా.

"విశ్రాంతి కాక నేను చేసే పనేముంది? ఇంక నాకు చేతినిండా పనే! ఇంక పదిహేను రోజుల్లో అమ్మాయిని పురిటికి తీసుకురావాలి."

"నాకు పని వుంటేనే హాయిగా వుంటుందండీ! అసలు యిక్కడ పనేలేదు. మా ఇంట్లో వున్నంత పని కూడా లేదు" అంది వెంటనే.

"అమ్మగారికి నెమ్మదిగా నచ్చచెప్పి యిక్కడికి వచ్చేయమంటే రావుకదా, మీరా" అంది. మీరా మాట్లాడలేదు.

ఇంక ఆవిడకి అలా వుంటే తను తల్లికి ఒంట్లో బాగాలేదని వెళ్ళిపోతే ఏం బాగుంటుంది.

ఒంటిగంటకి కాని మీరాకి యింటికి రావటానికి కుదరలేదు. శాంతమ్మగారు భోజనం చేసెయమని యెన్నోసార్లు చెప్పింది. "లేదండీ! అమ్మ నా కోసం కూర్చుంటుంది" అంది ఒంట్లో బాగుండలేదని చెప్పలేక.

"గంగులుచేత కబురు చేస్తాను వుండిపో మీరా! సాయంత్రం పెందలాడే వెళ్ళిపోదువు గాని" అందావిడ.

"ఎందుకండీ! గంటలో వచ్చేస్తాను."

"గంటలో అటూ ఇటూ ఏం తిరుగుతావు మీరా! భోజనం చేసెయ్! గుడిదగ్గరన్నావు కదూ—గంగుల్ని పంపుతాను."

శాంతమ్మగారికి నింపాదిగా నచ్చచెప్పి యింటికొచ్చింది. అప్పటికి హాస్పిటల్ మూసేస్తారు. సాయంత్రం తీసుకురావచ్చని వచ్చేసింది.

*   *   *   *

మీరా హడావుడిగా పని చేసుకొంటోంది. ఆ రోజు శాంతమ్మగారి కొంచెం పెందలాడే రమ్మని చెప్పేరు. ఇన్నాళ్ళల్లో ఆవిడ ఒంట్లో బాగుండనప్పుడు కూడా తొందరగా రమ్మని చెప్ప లేదు. ఈ రోజు వాళ్ళబ్బాయి వస్తున్నాడని—అతను వచ్చేసరికి తను పూజ అదీ చేసుకోవాలని తొందరగా రమ్మన్నారు. ఆ ప్రయత్నంలో తను ఇంట్లో పని తొందరగా చేసుకుపోతోంది.

కాంతమ్మకి పూట తేలిగ్గానే వుంది. నీరసంతో తల్లి వంట చేయలేదని వంట చేస్తోంది. విజయ్ వచ్చి పాలు పారబోసాడు. అయినా ఈ రోజు లేస్తూనే ఏడుపు మొదలెట్టి మీరాని విసిగిస్తున్నాడు. పాలు పారబోయటంతో పని తొందరలోవున్న మీరాకి విసుగూ కోపం కలిగినాయి. సాధారణంగా వాడు ఎంత అల్లరి చేసినా చంకనేసుకునో లేకపోతే ఏదో ఒకటి అంటూ వాడిని నవ్విస్తూ పని చేసుకుపోయేది! అప్పుడే ఏడున్నర అయింది. ఈ పాటికి తను అక్కడ వుండాలి. పని కాలేదు. ఆ విసుగుతో, "అబ్బ! చంపుతున్నావురా" అని కోపాన్ని దిగమింగుతూ తీసుకెళ్ళి ఉయ్యాల్లో కూలేసి వచ్చి పని చూసుకోసాగింది.

విజయ్ ఉయ్యాల్లో గుక్కపట్టినట్టుగా ఏడవసాగాడు.

"అయ్యో! వాడిని తియ్యి" అంది కాంతమ్మ ఊరుకోలేక.

"ఏడవనీ! ఈ రోజు లేస్తూనే యేడుపు మొదలెట్టేడు. ఈ రోజు అమ్మగారు తొందరగా రమ్మన్నారు. ఏడున్నరకి రమ్మన్నారు—యిప్పుడే ఏడున్నర అయిపోయింది" అంది విసుగ్గా.

కాంతమ్మ ఆశ్చర్యంగా అడిగింది "ఏం? ఈ రోజు తొందరగా యెందుకు?"


మీరా చేస్తున్నపని ఆపేసి క్షణంసేపు ఆలోచించి అంది "ఆం ఏంలేదు! ఈ రోజు వాళ్ళ మనవరాలి పుట్టినరోజు....పిల్లలందరూ వస్తార్ట!....అందుకని కాస్త సహాయానికి రమ్మన్నారు."

కాంతమ్మకి ఆ మాట నచ్చినట్టులేదు.

అది గ్రహించిన మీరా అంది "అదేనమ్మా! స్కూలు పిల్లలందర్నీ పిల్చేరు; నాకేం తెలియదు టీచర్లందరూ వస్తారు కాస్త సహాయానికి రమ్మని చెప్పారు...." ఏదో "దబ్"మన్న చప్పుడూ విజయ్ కెవ్వుమన్న కేకా వినపడి మీరా కాంతమ్మా పరుగెత్తేరు.

విజయ్ ఉయ్యాల్లోంచి కిందపడ్డాడు—గుక్కపట్టేడు. మీరా విజయ్‌ని ఎత్తుకుంది కాని ఏంచేయాలో తెలియక ఖంగారు పడిపోయింది. కాంతమ్మ చప్పున విజయ్ రెండు చెవులూ మూసింది.

విజయ్ యేడుపుమాని పడుకునే సరికి యెనిమిది దాటిపోయింది. విజయ్ పడటంలో



పై పళ్ళు కింద పెదవికి గుచ్చుకుని రక్తం వచ్చింది—కింద పెదవి యింతలావయింది. నుదుట బొప్పికట్టింది.

"లేచినవేళ ఎంత మంచిది. పాపిష్టిదాన్ని. ఎన్నడూ విసుక్కోని దాన్ని విసుక్కున్నాను" మీరా బాధగా అనుకుంది.

మీరా తెమిలి వెళ్ళేసరికి ఎనిమిదిన్నర దాటింది. అప్పటికే శాంతమ్మగారు స్నానం చేసేసింది. పూజకి సిద్ధం చేసుకుంటోంది. మీరాకి చాలా సిగ్గేసింది. ఆవిడసలే నీరసంగా వుంది. ఎప్పుడూ చెప్పని మనిషి తొందరగా రమ్మన్న రోజే తను రోజూకన్న ఆలస్యంగా వచ్చింది. చెప్పుకోవటానికి వీలులేని యిబ్బంది.

"మీరు లేవండమ్మా నేను చేస్తాను" అంది తల వంచుకునే.

"అయిపోయింది. నువ్వెళ్ళి ప్రసాదం సంగతి చూడు" అంది శాంతమ్మగారు పని చేసుకుంటూనే.

"ఛ! ఈ రోజే ఆలస్యమవాలా?" చాలా నొచ్చుకుంది మీరా.

"మీరా" శాంతమ్మగారు పిల్చింది.

మీరా "ఏంటమ్మా" అంటూ వచ్చింది.

"ఆ పని అయాక కాఫీ డికాక్షను తీసివుంచు."

"అలాగే నమ్మా!"

"తీసివుంచంతే! కలపద్దు."

సరేనని మీరా యివతలకి వచ్చేసింది.

ఇంతవరకూ ఆ ఆలోచన రాలేదు కాని మీరాకి యిప్పుడు భయంగా అన్పించింది. ఆ వచ్చే చినబాబు యెలాంటి వాడో! ఆవిడ చెప్పిన మాటలనుపట్టి చూస్తే మంచివాడేనని తెలుస్తోంది. అయినా యెవరిబిడ్డ వాళ్ళకి మంచిగా కనపడరా! వాళ్ళమ్మాయి వస్తే తనకి కాలక్షేపం అవుతుంది.

మీరా ప్రసాదం దేవుడి గదిలోకి పట్టుకొచ్చి పెట్టింది. ఇంకా శాంతమ్మగారి పూజ అవలేదు.

మీరా బియ్యం కడిగివదేసింది. ఆవిడ వచ్చి చెప్పేవరకూ పనిలేదు. ఏం కూర చేయాలో! తను తొందరగావస్తే ముందరగా ఏంచేయాలో అడిగి తెలుసుకున్న....విజయ్ ఏడుస్తున్నాడేమో? వంట అయిపోగానే ఆవిడకి ఏదో ఒకటి చెప్పి వెళ్ళిపోవాలి. ఏమనుకుంటుందో! తొందరగా రమ్మంటే ఆలస్యంగా వచ్చి తొందరగా వెళ్లిపోతాననుకుంటుందా? అమ్మకి కులాసాగా లేదని అందుకే ఆలస్యంగా వచ్చేనని చెప్పి వెళ్ళాలి....

హాల్లో - ఫ్లవర్‌వాజ్‌లో తాజాపూలు అమరుస్తూ పరధ్యాన్నంగా వున్న మీరా బూట్ల చప్పుడికి ఉలిక్కిపడి తలతిప్పి గుమ్మంకేసి తిరిగింది - హాలూ, హాల్లో ప్రతీవస్తువూ కళ్ళముందు గిర్రున తిరగసాగాయి.

ఆ వచ్చిన వ్యక్తి నిర్విణ్ణుడయినట్టు నిలబడిపోయాడు.

మీరా - గిరుక్కున తిరిగి లోపలకి పరుగులాటి నడకతో వెళ్ళిపోయింది.

శేఖరం - ఇంకా ఆ షాకునుంచి తేరుకోనివాడిలా అలాగే నిలబడిపోయాడు.

'మీరా - ఇక్కడ!!' ఇంకా అతనికి 'కలా నిజమా' అనిపిస్తోంది.

మీరా పరిస్థితి వర్ణనాతీతం - వణికే కాళ్ళతో - ఆపుకోలేని దుఃఖంతో ఎలాగో వంట గదిలోకి వచ్చి పడింది. స్టౌమీద అన్నం కళకళ వుడుకుతోంది - మీరా హృదయంలా.

'ఛః తనిన్నాళ్ళూ ఇక్కడా పనిచేస్తోంది! ఛీ, ఛీ! ఇంత దౌర్భాగ్యం ఏ ఆడపిల్లకూ వద్దు, భగవాన్!' మీరాకి ఎంత నిగ్రహించుకోందామన్నా దుఃఖం ఆగడంలేదు. 'తనేం పాపం చేసింది! తను స్వాభిమానం చంపుకుని - అసలా వూహే తలపుకిరాకుండా వుండాలనుకుని మసులుతోంటే - ఈ ఇల్లే అవాలా!....ఇంతకన్న తక్కువకులం వాళ్ళయినా సరే వాళ్ళింట్లో గిన్నెలు తోముతున్నా తనకింత బాధ లేకపోను. ఛీ, ఛీ!" మీరా తన నూరేళ్ళ జీవితం మైలపడిపోయిన రోజుకూడా యింత వ్యధ చెందలేదేమో! అసలలా ఆ ఇంట్లో నిలబడాలంటేనే కంపరంగా వుంది.

ఒక్కక్షణం - అక్కడనించి పారిపోవాలనిపించింది.


కాని, శాంతమ్మగారి శాంత గాంభీర్యమైన మూర్తి కళ్ళముందు మెదిలింది. మీరా అడుగు ముందుకు పడలేదు.

"మీరా!" శాంతమ్మగారు పిలిచింది.

మీరా వుగ్గబట్టుకున్నట్టుగా గదివరకూ వెళ్ళింది. ఆసరా కోసమా అన్నట్టు ద్వార బంధంమీద బలంగా చేతులాన్చుకుని నిలబడింది.

"ఎందుకమ్మా" అని అనాలనుకుంది. కాని పెదవులు విడివడలేదు.

శాంతమ్మగారు మళ్ళీ పిలుద్దామని కొద్దిగా తలతిప్పింది. మీరా నిలబడివుంది. "మీరా! లోపలికి రా" అని హారతి వెలిగించింది. హారతి వెలిగించినప్పుడు మీరా అక్కడ లేకపోతే ఆవిడ పిలుస్తుంది.



మీరా తడబడే అడుగులతో లోపలకి అడుగు పెట్టింది. ఆ లక్ష్మి విగ్రహంకేసి చూసే ధైర్యం లేకో - ఇష్టంలేకో - మీరా ముఖం దించుకుని మునిగాళ్ళమీద ముళ్ళమీద కూర్చునట్టు కూర్చుంది.

శాంతమ్మగారిచ్చిన హారతి మీరా యాంత్రికంగానే కళ్ళకద్దుకుంది.

ఆ తర్వాత ఆవిడ తీర్థం ప్రసాదం యిచ్చింది.

"టైము ఎంతయింది మీరా?" అడిగిందావిడ.

"....పది అవుతోందమ్మా!" మీరా గొంతు బొంగురుబోయింది.

"అబ్బాయి ఇంకా రాలేదు" తనలో అనుకొంటున్నట్టుగా అందావిడ.

మీరా మొహం తిప్పేసుకుని వెంటనే ఇవతలకి వచ్చేసింది.

* * *

శాంతమ్మగారు హాల్లోకి వచ్చేవరకూ శేఖరం నిలబడే వున్నాడు.

"చినబాబూ! ఏమిటలా నించున్నావ్? ఎంతసేపయింది వచ్చి?" ఆప్యాయంగా పలకరిస్తూ దగ్గరగా వచ్చిందావిడ.

"ఇప్పుడేనమ్మా!" తేరుకుంటూ అన్నాడు శేఖరం.

మీరాని చూడగానే అతనికి చాలా ఆలోచనలు వచ్చినాయి. అరుణకి మీరా ఇక్కడున్నట్టు తెలుసా? మీరా ఇక్కడున్నట్టు అమ్మ ఒక్క ఉత్తరంలో కూడా రాయలేదు. అసలు మీరా ఈ ఊళ్ళో - ఇక్కడికి ఎలా వచ్చింది........

"అలా చిక్కిపోయావేమిరా బాబూ! ఏమిటోరా నాయనా అన్నీ నువ్వే నెత్తినవేసుకుని తిరుగుతావు."

"నేను చిక్కినట్లు నీకు ఎప్పుడు కనిపించేనమ్మా! నీ వాళ్లో ఎలా వుందమ్మా? కులాసాగా వుంటోందా? మందు తీసుకుంటున్నావా?"

"నాకు బాగానే వుంది నాయనా! కూర్చో! ముందు కాఫీ తీసుకుందువుగాని" అని శాంతమ్మగారు లోపలకి వచ్చింది.

గోడనానుకుని చలనం లేనట్టుగా నిలబడ్డ మీరా శాంతమ్మగారు రావటంతో చప్పున పని వున్నదానిలా స్టవ్ దగ్గరకి నడిచింది.

ఏళ్ళ తరబడి పై దేశాల్లో తిరిగి వచ్చినట్టుగా వుంది శాంతమ్మగారికి శేఖర్ని చూశాక. మీరా అదోలా వుండడం వుత్తప్పుడయితే కనిపెట్టేసేదే.

"మీరా! అబ్బాయి వచ్చేడు కాఫీ తీసుకురా!" అని వెనక్కితిరిగి రెండడుగులువేసి నావిడ ఆగి అంది: "మీరా! అబ్బాయి చక్కెర చాలా తక్కువ వేసుకుంటాడు. కొద్దిగానే వెయ్యి."

మీరా తలెత్తి ఏదో అనబోయేసరికి ఆవిడ వెళ్ళిపోయింది.

"ఇదిగో కలిపేస్తున్నాను తీసుకెళ్ళండి" అనాలనుకుంది. అప్పటికే ఆవిడ వెళ్ళిపోయింది. మీరా అప్పి కనిపిస్తుందేమోనని చూసింది. ఆవిడ ఏమైనా అనుకోనీ కాఫీ అప్పిచేత పంపిద్దామనుకుంది. అది లేదు.

కాఫీ కప్పుతో గుమ్మం వరకూ వచ్చిన మీరా క్షణం ఆగిపోయింది.

"మీరా!" శాంతమ్మగారి పిలుపుతో మీరాకి రాక తప్పలేదు.

మీరా తల వంచుకునే యివతలకి వచ్చింది.

అక్కడే వున్న టీపాయ్‌మీద పెట్టింది కాఫీ కప్పు.

శేఖరం గుండెలు చిత్రంగా కొట్టుకుంటున్నాయి - ధైర్యంచేసి కొద్దిగా కళ్ళెత్తి మీరాకేసి చూశాడు. ముఖం బాగా దించుకుని వుండడం - వంగుని వుండడంవల్లా మీరా ముఖంలో ఎలాంటి భావాలు కదలాడుతున్నాయో కనిపించలేదు గాని - వూహించుకోగలడు.

మీరా కది భరింపరాని నరకంలా వుంది.

కాఫీ కప్పు టీపాయ్‌మీద పెట్టేసి వెళ్ళిపోయింది.

శేఖరం పరధ్యానంగా వుండడం చూసి, "కాఫీ తీసుకో చినబాబూ!" అంటూ కాఫీ కప్పు అందించింది శాంతమ్మగారు.

శేఖరం తీసుకున్నాడు.

"పంచదార సరిపోయిందా?" అని అడిగింది. సరిపోయిందన్నట్లు తల వూపాడు శేఖరం.


శాంతమ్మగారు చెప్తోంది "మీరా మంచి పిల్లరా బాబూ! బుద్ధిమంతురాలు, పనిమంతురాలూను. ఈ మధ్యనే జేరింది. అసలా అమ్మాయి యిక్కడే వుండిపోతే నాకు చాలా సహాయంగా వుండేదనుకో! పాపం తల్లి నాలాగే అనారోగ్యం మనిషి - వుండడానికి కుదరదు పాపం."

శేఖరం కాళీ కప్పు టీపాయ్‌మీద పెట్టేశాడు.

హాల్లో గడియారం అర్ధగంట కొట్టింది.

పదిన్నర అయింది. శాంతమ్మగారు లోపలకి వస్తుందేమో ఏం చేయాలో చెప్తే చేసేసి బయటపడదామని ఉగ్గబెట్టుకున్నట్టుగా నిలబడింది మీరా.

ఇంకో పావుగంటకి ఆవిడ లోపలకి వచ్చింది. ఏమేం చేయాలో చెప్పివెళ్ళింది.



శాంతమ్మగారు మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యలో అడిగింది "టీ పెట్టమంటావా, చినబాబూ!" అని.

"ఉఁహూ! వద్దు" అన్నాడు శేఖరం అతనికంతా అయోమయంగా వుంది. మీరా అంత చదువుకుని యిలాంటి పరిస్థితికి యెలా వచ్చింది? మీరా వివరాలు తల్లికి యింకా యేమైనా తెలుసా? అరుణ వస్తే అన్ని విషయాలు తెలుస్తాయి.

ఏది యేమైనా మీరా యీ పరిస్థితికి అతని మనసు బాధపడింది. మీరాని యిన్నాళ్ళకి, యింత దగ్గరగా - చూసినందుకు ఓ పక్క శాంతిగా కూడా వుందతనికి.

* * *

వంట అయిపోయింది. శాంతమ్మగారు యెంతకీ రాకపోవటంతో "కొడుకుతో గాని తినదేమో!" అనుకుంది మీరా!

ఆవిడ తినేస్తుందేమో తను వెళ్ళిపోదామని చూసింది మీరా. అదీ కుదరలేదు. ఇంకా స్నేపు చూసిన మీరా టేబుల్‌మీద అన్నీ సర్దేసి వెళ్ళిపోవటానికి నిశ్చయించుకుంది.

మీరా వండిన పదార్థాలు వేరే గిన్నెల్లోకి తీస్తోంటే శాంతమ్మగారు వచ్చింది. మీరా ఏమీ అడగటానికి సావకాశం లేకుండానే "వడ్డించేయి మీరా" అంది శాంతమ్మగారు.

తోసుకొస్తున్న దుఃఖాన్ని ఒక్క గుటకవేసి మింగక తప్పలేదు మీరాకి.

శాంతమ్మగారు వచ్చి కూర్చుంది. వడ్డిస్తోంది. ఆలా వడ్డించటానికి మీరా శరీరంలో అణువణువూ యెదురుతిరుగుతోంది. ఏదో తెలియని బాధతో నరనరం మెలితిరుగుతోంది. త[illegible] సరి అయిన పరిస్థితిలో మీరా చేతులు యాంత్రికంగా వడ్డిస్తున్నాయి.

శేఖరాన్ని ఒకటి రెండుసార్లు పిలిచింది శాంతమ్మగారు.

"వస్తున్నా" అని అన్నాడేగాని రాలేదు.

మళ్ళీ పిలిచిందావిడ. "చినబాబూ! రా, నాయనా! అన్నం చల్లారిపోతుంది. ఎప్పుడనగా తిన్నావో ఏమో!"

వడ్డించిన మీరా నేతిగిన్నె అక్కడ పెట్టి లోపలకి వెళ్ళిపోయింది.

శేఖరం వచ్చి కూర్చున్నాడు.

"కూర తీసుకురా మీరా!" అంటూ శాంతమ్మగారు పిలిచింది.

శేఖరం వుండడంవల్ల మీరా సిగ్గుపడి లోపలకి తప్పుకుంది కాబోలు అనుకుందావిడ "చిన్నపిల్ల కదా" అనుకుంది.

మీరా కూర తీసుకొచ్చింది. మొదట శాంతమ్మగారికి వేయబోయింది. "నాకు వద్దు - అబ్బాయికి వెయ్యి" అంది.

మీరా శేఖరానికి వేయబోయింది. అతను "వద్దు" అన్నట్టు చేయి అడ్డం పెట్టేశాడు.

శేఖరం గుండెల్లో చిత్రమైన స్పందన—

మీరా గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి—

శేఖరం చేయి అడ్డుపెట్టేసరికి శాంతమ్మగారు "కొంచెం వేసుకో చినబాబూ! ఏమిటా తినటం. కొంచెం వెయ్యి మీరా" అంది.

మీరా మాట్లాడకుండా నిలబడిపోయింది.

"ఉహుఁ! వద్దమ్మా!" అన్నాడు గ్లాసెత్తి నీళ్ళు తాగబోతూ.

వడ్డనంతా అలాగే జరిగింది. శాంతమ్మగారు మీరాని కొంచెం వేయమనడం - శేఖరం 'వద్దు' అన్నట్లు చేయి అడ్డుపెట్టటం.

వాళ్ళకి మజ్జిగ వడ్డన కూడా అయింది. మీరా ఇద్దరికీ మంచినీళ్ళు పోస్తుంటే శాంతమ్మగారు అంది "నువు కూడా భోజనం చేసేయి మీరా! అప్పుడే ఒంటిగంట అయింది. నువ్వు ఇంటికెళ్ళేసరికి ఇంకా ఆలస్యమవుతుంది కదా!"

మీరా మాట్లాడలేదు. వంటగదిలో అన్నీ సర్దుతోంది.

శేఖరం చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు. శాంతమ్మగారు మళ్ళీ అంది భోజనం చేయమని. "లేదమ్మా! నేను వెళ్ళేవరకూ అమ్మ భోజనం చేయదు" అంది. శాంతమ్మగారు అక్కడనించి వెళ్ళి, మళ్ళీ రెండు నిముషాల్లో చేతి సంచీతో తిరిగి వచ్చింది.

"ఇదిగో మీరా! ఈ పళ్ళు తీసుకెళ్ళు. అబ్బాయి తీసుకొచ్చాడు."

శాంతమ్మగారు తోటలో కాసిన కూరగాయలూ అవీ ఇవ్వడం అలవాటే! మొదట్లో మీరా సిగ్గుపడేది తీసుకోవడానికి. "మా దొడ్లో కాస్తాయండీ! ఇద్దరి మనుషులకి ఇన్ని యెందుకు?" అనేది. దాని కావిడ "మీ దొడ్లో యేంకాస్తాయి మీరా! నీ చేతిపంట యెలా వుంటుందో రుచి చూస్తాను అవి నాకు పట్టుకురా" అనేది మీరా మొహమాటపడుతోందని గ్రహించి. ఇప్పుడివి తీసుకోవడం మీరాకి సుతరామూ యిష్టంలేదు. "ఎందుకమ్మా! అమ్మ యేమీ తీసుకోదు" అంది.

"నేను యిచ్చానని చెప్పు! ఎందుకు తీసుకోరూ? నీకు మొహమాటం కాని."

మీరా యింక యేమీ అనలేక తీసుకుంది. గంగులు పిలిస్తే శాంతమ్మగారు వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్తోంటే మీరా "నేను వెళ్తానండీ!" అంది. ఆవిడ సరేనని వెళ్ళిపోయింది.

మీరా పళ్ళసంచీ వంటగదిలో పెట్టేసి వెళ్ళిపోయింది.

* * *

విజయ్ లేచి అర్ధగంట అయింది. లేచిన దగ్గరనుండి యేడుస్తూనే వున్నాడు. కాంతమ్మ ఊరుకోబెట్టలేకపోతోంది.

"నన్నెందుకు పరీక్షిస్తావురా నాయనా! నిన్ను సముదాయించే ఓపికా, శక్తీ లేవురా బాబూ!" అంది. అంతక్రితం ఓసారి లేచాడు. అన్నం పెట్టబోతే తినలేదు. పాలు పట్టి పడుకోబెట్టింది. ఆ మధ్య రెండు రోజులు జ్వరం వచ్చినప్పుడు తప్పిస్తే వాడు ఏడవడం ఆవిడ యెరుగదు. మీరా యిన్నాళ్ళమట్టి వెడుతోంది: యిలా యేడిస్తే తనేం చేయగల్దు? ఇది పాడు చేయా - అది పాడుచేయా తప్పితే యేడుపు లేదు.

ఓపిక తెచ్చుకుని విజయ్‌ని భుజంమీద వేసుకుని తిప్పింది. వాడు ఊరుకోలేదు. ఉయ్యాల్లో పడుకోబెట్టి - ఉయ్యాల దగ్గరగా కుర్చీవేసుకు కూర్చుని ఊపసాగింది. వాడు ఏడుస్తూనే వున్నాడు.

దగరగా వేసివున్న తలుపులు తోసుకుని లోపలకొచ్చింది మీరా.

"ఏవరు, మీరా!" అంటూ లేచివచ్చింది కాంతమ్మ.

"ఊఁ" అని దొడ్లోకి వెళ్ళబోయింది మీరా.

"ముందు వాడినోసారి తియ్యి. ఒకటే యేడుస్తున్నాడు. నా దగ్గర వుండడం లేదు" అంది.

"ఇప్పుడే వస్తా" అంటూ గబగబా దొడ్లోకి వెళ్ళిపోయింది మీరా.

మీరా ముఖం చూసేసరికి కాంతమ్మకి భయం వేసింది. ఎర్రగా కందినట్టుగావున్న ఆ ముఖం ఎంతో బాధని నిగ్రహించుకున్నట్టుగా వుంది.

అలా దూకుడురా రావటం—బాధని అణుచుకున్నట్టుగా వుండడం—వస్తూనే విజయ్ ఏడుపు విని కూడా గబగబా దొడ్లోకి వెళ్ళిపోవడం అప్పుడెప్పుతో మీరా ముఖం గుర్తుకొచ్చి గజగజలాడిపోయింది కాంతమ్మ. గబగబా దొడ్లోకి వెళ్లింది.

మీరా బాత్రూంలోకి దూరి తలుపేసుకుంది. దోసిట్లో ముఖం దాచుకుంది. ఎంతసేపటి నుంచో—ఎన్నాళ్ళనుంచో పేరుకుపోయిన దుఃఖం కన్నీటి రూపంలో వరదలై పొంగింది. బాధ తీరేవరకూ గట్టిగా స్వేచ్ఛగా ఏడవటానికి కూడా లేదు తనకి—

పది నిముషాలకి ఎలాగో అతిప్రయత్నం మీద తేరుకుంది మీరా.

ఈలోగా కాంతమ్మ నాలుగయిదుసార్లు పిలిచింది.

"వస్తున్నా ముఖం కడుక్కుని" అని చన్నీళ్ళతో మొహం, కాళ్లూ చేతులూ కడుక్కుని- మొహం తుడుచుకునే నెపంతో తల్లికి ముఖం కనపడకుండా తువ్వాలు అడ్డం పెట్టుకుని గదిలోకి వచ్చింది.

విజయ్‌ని ఎత్తుకుని బుజంమీద పడుకోబెట్టుకుంది. అటూ ఇటూ తిప్పినా విజయ్ ఏడుపు మానలేదు. 'ఎందుకురా! అసలే నేను ఏడుస్తొంటే ఇంకా ఏడిపిస్తావు' బిస్కట్ ఇచ్చింది. వాడు తీసుకోలేదు.

"అబ్బా! ఏమిట్రా ఏడుపు" అలా అన్నప్పుడు మీరా కంఠం వణికింది. కాంతమ్మ అక్కడికి వచ్చింది, "ఏమిటి మీరా! వాడు అన్నం తినలేదు. పాలుపట్టి చాలా సేపయింది. పోసీ పాలు పట్టించు" అంది.

మీరా పాలు కలిపి తీసుకొచ్చింది. విజయ్ సీసా తోసేశాడు. మీరాకి ఏడుపొచ్చేసింది. "నువుకూడా పరీక్షిస్తున్నావా, విజయ్! ఏమయింది నీకివాళ్ళ" బాధగా అనుకుంది.

"పాలు పట్టేవా" కాంతమ్మ మళ్లా లేచి వచ్చింది.

"తాగట్లేదు" మీరా ఏడుపుగొంతు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

కాంతమ్మ ఇంత ఉప్పు దిగతుడిచి పారేసి—దేవుఁడి గూట్లోంచి విబూది పట్టుకొచ్చి పెట్టింది.

మీరా తల్లి చేసేవి చూస్తూ కూర్చుంది.

ఇంకో అయిదు నిముషాలు ఏడిచి విజయ్ పాలసీసా పట్టుకున్నాడు,

మీరా కళ్ళనుండి ధారాపాతంగా నీళ్లు కారుతూనే వున్నాయి—విజయ్ పాలు తాగుతోంటే చూస్తూ కూర్చుంది.

కాంతమ్మ మళ్ళీ వచ్చి, "పాలు తాగుతున్నాడా" అని అడిగింది.

"ఊఁ" అంది.

కాంతమ్మ మంచం దగ్గరగా వచ్చి "అలా వున్నావేం?" అడిగింది.

"ఎలా వున్నాను" అనో "ఏం లేదు" అనో అనాలనుకుంది. కాని ఒక్కటీ అనలేక పోయింది. గొంతు పెగల్లేదు.

ఆవిడ మంచంమీద కూర్చుని మీరా తలమీద చెయివేస్తూ "ఏమిటమ్మా!" అంది ఆప్యాయంగా.

మీరాకి దుఃఖం ఆగల్లేదు. అపుకోవాలని ఎంతో ప్రయత్న చేస్తోంది. తల్లి అలా దగ్గరగా వచ్చి "ఏమిటమ్మా" అని ఎప్పుడైనా అడిగిందా? ఇప్పుడలా అడిగేసరికి మీరా దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

కాంతమ్మ కంగారుపడిపోయింది. "ఏమిటి మీరా! ఏమయింది?" ఆదుర్దాగా అడిగింది.

మీరా మాట్లాడలేదు. దోసిట్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

కాంతమ్మ కూతురి భుజాల చుట్టూ చేతులువేసి దగ్గరగా తీసుకుంటూ అడిగింది "ఏమిటి, ఎందుకు మీరా! నాతోటి ఏమీ చెప్పవుకదా! నాకెలా తెలుస్తుంది?" అంది.

"విజయ్ అలా ఏడుస్తోంటే...." ఏడుపు గొంతుతో ఎలాగో అంది.

"దానికింత ఖంగారు పడతారా! పిల్లలు ఏడవరూ?"

"ఎప్పుడూ వాడిలా ఏడవలేదు—నువు చూస్తే ఇలా వున్నావు. మనం ఇక్కడనుంచి ఏ వూరయినా వెళ్ళిపోదామమ్మా! నాకీ వూళ్లో వుంటే పిచ్చి ఎక్కేటట్లుంది" వెక్కిళ్ళమధ్య అంది.

కాంతమ్మకీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఇంక ఏ వూరు వెళ్ళినా ఇలా పరువుగా బ్రతకలేం. పల్లె—బస్తీ కాని ఈ వూళ్లో మన సంగతి ఎవరూ పట్టించుకోవటం లేదు. నిజంగా ఈ వూరి వాళ్లు చాలా మంచివాళ్లు. వాళ్ళకి చేతులెత్తి మొక్కచ్చు....కానీ, నా తర్వాత నిన్నెవరు చూస్తారనే నా దిగులు."

మీరాకి ఇంకా దుఃఖమొచ్చింది. "మాట్లాడనే మాట్లాడవ్—మాట్లాడితే—ఇలా మాట్లాడతావు."

"కడుపు తీపి. ఏంచేయను తల్లీ! విజయ్ ఏడిస్తే—వాడు వూరుకున్నా నువ్వెంత బాధపడుతున్నావ్? లేచి కళ్లు తుడుచుకో! పొద్దున్న పడిపోయాడు కింద. పెదిమకి పైపళ్లు గుచ్చుకున్నాయి కదా. పెదిమ వాచింది. అది సలుపు పెడుతోందో ఏమో!" కాంతమ్మ తన బాధని దిగమింగి కూతుర్ని ఓదార్చింది.

తలపోటుగా వుంది. అన్నం వద్దన్నా కాంతమ్మ బలవంతంగా మీరాచేత మజ్జిగా అన్నం తినిపించింది.

మీరా విజయ్ పక్కన పడుకుంది.

(సశేషం)

సీతారాముల చిత్రపటం గోడన వ్రేలాడుతూంది. ఇవతలగా రాధాకృష్ణుల ప్రణయ చిత్రపటం గాలికి కదులుతూంది.

సన్నజాజుల పరిమళాల్ని మోసుకొస్తున్న గాలి పందిరి మంచంమీద పడుకున్న రాధారాణి చుట్టూ తిరుగుతూంది.

వీధరుగుమీద కూర్చుని పక్కింటి పార్వతమ్మ కూతురు అత్తారింటికి వెళ్ళడానికి పంచాంగం చూసి మంచిరోజు చెప్తున్నాడు తండ్రి.

రోగిష్టితల్లి మడిగట్టుకుని వంట వండుతూ శ్రీనివాస కళ్యాణ గీతాన్ని కూనిరాగం తీస్తూంది.

ఎంత అవుకుందామని ప్రయత్నించినా ఆగకుండా వస్తున్న కన్నీటిని ఓణీ చెరగుతో తుడుచుకుంటూ లేచి కిటికీ దగ్గరగా వచ్చి వీధి వైపు చూస్తూ నిలబడింది రాధారాణి.

పొలాల్లో పను ముగించుకుని గుంపులు గుంపులుగా పోతున్న కూలిజనం లొల్లాయి పదాలు పాడుకుంటున్నారు.

కిటికీకెదురుగా, రోడ్డు కావలగా వున్న ఖాళీ స్థలంలో మేకపిల్లలు తల్లిదగ్గర పాలు త్రాగుతూ చెంగుచెంగున గెంతుతున్నాయి.

ఆ స్థలం చివరగా చిన్నపాక వేసుకున్న రంగడు గోచీపెట్టుకుని స్నానం చేస్తుంటే వాడిపెళ్ళాం వీపు రుద్దుతూంది. వాడు సబ్బు నురుగు దాని మొహానికేసి రాసి నవ్వుతూంటే అది వాడి నెత్తిమీద చెంబుతో సుతారంగా మొట్టి సరిసరసం ఆడుతూంది.

సీమ చింతచెట్టు కొమ్మమీద రెండు జంట పావురాళ్ళు ఒకదాని ముక్కు నొకదాన్ని పొడుచుకుంటూ హుషారుగా రెక్కలెగరేస్తున్నాయి.

అరుణకాంతుల్ని సంతరించుకున్న ఆకాశం రాబోయే ప్రియుడికోసం ఎదురు చూసే ప్రేయసిలా వుంది.

అంత దుఃఖంలోనూ ప్రకృతి రాధారాణి మనసును ఊరడింపజేస్తూంది. వయసుతోబాటు పెరిగే అవసరాల్ని కోర్కెల్నీ మటుకు రెచ్చగొడుతూంది.

చల్లనిగాలి ఒక్కసారి వచ్చి కిటికీలో నుంచున్న రాధారాణికి తగలంగానే ఒళ్ళు గగుర్పొడిచింది.

రాధారాణికి పెళ్ళిడొచ్చింది.

పెళ్ళీడు దాటి మూడేళ్ళయింది.

కాని తన పదహారవ ఏటినించీ సంబంధాలు వస్తూనేవున్నాయి. కట్నం దగ్గర బేరం కుదరక పోతూనేవున్నాయి.

సుబ్బయ్యనాయుడుగారి అమ్మాయి పురిటికని రావడం ఇది మూడోసారి? దాన్ని పలకరిద్దామని వాళ్ళింటికి వెళ్తుంటే దోవలో బోడెమ్మత్త ఎదురయి "ఇంకెన్నాళ్లే-ఒంట్లోని ఒంపులన్నీ సడలిపోయాక ఏ మగాడూ నిన్ను చేసుకోవడానికి ముందుకురాడు. ఇలాగే వున్నావంటే ఏ కాకో గద్దో ఎగరేసుకు చక్కాపోతుంది" అంది చనువుగా.

ఆ బోడెమ్మత్త నడిరోడ్డుమీద పక్కా మగరాయుడిలా ఏ కన్నెపిల్ల కనబడ్డా మొరటు సరసం ఆడేస్తుంది. నయం, రెండు మాటల్తో వదిలేసిందనుకుంది రాధారాణి.

కాస్త అటు ఇటుగా తన ఈడు వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయి కాపురాలు చేస్తున్నారు.

తను అటు చదువుకున్నదీ కాలేకపోయింది యిటు ఇల్లాలూ కాలేకపోయింది. తనకు తెలుసు తన తండ్రి అటు చదువుకనీ యిటు పెళ్ళికనీ డబ్బు ఖర్చు పెట్టలేదు.

చెరబడ్డ గీతం

పి. సత్యనారాయణ శాస్త్రి

కాదు-చెయ్యలేడు. ఎలాగూ పెళ్ళి చెయ్యక తప్పదు కాబట్టి పదవ తరగతితోటే చదువు ఆపించేసి ఎంత త్వరగా పెళ్ళి జరిపించిచేస్తే అంత తక్కువ అప్పులో తెరిపనపడదామన్న సంకల్పంతో పెళ్ళి సంబంధాలు వెతకటం ప్రారంభించాడు.

పెళ్ళి చూపులు జరుగుతూనే వున్నాయి. ప్రతి పెళ్ళిచూపుల్లోనూ ఇతడే గామోసు తన కాబోయే మొగుడు అనుకోవడమూ—బేరం కుదరక మరో పెళ్ళిచూపుకి సింగారించుకుని కూర్చోవడమూ జరుగుతూనే వుంది.

అది అలవాటుగా మారింది.

తనకు వయసు—వయసుతోబాటు మనసు మనసుతోబాటు కోర్కెలు పెరగడమే కాకుండా నిరాశా నిస్పృహలు పెరగడమటుంచి రోజు రోజుకూ పెళ్ళికొడుకుల రేటు మరింతగా పెరిగిపోవడంతో పెళ్ళితలపు తనకు బాధాకరంగానూ తన తండ్రికి ఓ పెద్దసమస్యగానూ తయారయింది.

ఛీ—ఏమిటీ ఆడజన్మ అనిపిస్తూంది తనకు.

అసలెందుకీ జన్మని కూడా అనిపిస్తూంది.

చచ్చిపోతే....

చచ్చి ఏం సాధించాలి?

బ్రతికి బ్రతుకును నందనవనం జేసుకోవాలి.

ఆశ దీపమై వెలుగునిస్తూంది!

నిరాశ మసిపులుముకున్న రాక్షసై మీద కురుకుతూంది.

బ్రతుకు భారమై తోస్తూంది.

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి.

ఖాళీస్థలంలోని మేక తల్లి ఏమయిందో.... పిల్లలు గెంతుతూ ఆడుకుంటున్నాయి.

గోచీ పెట్టుకుని స్నానంచేస్తున్న రంగడి స్నానం ఎప్పుడో ముగిసినట్లుంది. పాకలో దూరి పెళ్ళాంతో సరసాలాడుతున్నాడు గామోసు.

చింతచెట్టుమీది పావురాల జంట సరసాలు ఆ గూటిలోకి వెచ్చగా చేరినట్టున్నాయి.

అరుణకాంతుల్ని సంతరించుకున్న ఆకాశం ఎప్పుడు చీర మార్చిందో! — శరీరం నీలి వర్ణంగా వుంది. బహుశా ప్రియుడ్ని చేరిందేమో.

"అమ్మాయ్ రాధా! చిమ్నీలు తుడిచి దీపాలు వెలిగించు" అన్న తల్లి పిలుపుతో గది దాటి వసారాలోకొచ్చింది. ఒత్తులు సరిజేసి దీపాలు వెలిగిస్తూందేగాని మనసు మనసులో లేదు.

వారంరోజుల క్రితం తనకు జరిగిన పెళ్ళి చూపులతతంగం తాలూకు ఫలితం మధ్యాహ్నం వచ్చిన పోస్టు కవరు ద్వారా తెలిసింది. ఆ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదివింది. కన్నీటితోబాటు పట్టరాని కోపం, ఉక్రోషం కూడా వచ్చాయి తనకు.

ఛీ....ఛీ....ఏంమనుషులు??

తను ఓ మాదిరిగా నచ్చిందట ....షాపులో అద్దాల మధ్య బిగించబడ్డ కీ బొమ్మలాగా. అయినా ఫరవాలేదట!—నయానో భయానో అతగాడ్ని పెళ్ళికి ఒప్పిస్తారట. ఎటొచ్చీ కట్నం దగ్గరే కాస్త ఆలోచించాల్సొస్తూందట. కనీసం కట్నం పదివేలన్నా ఇస్తే తనని ఆ ఇంటి కోడలిగా స్వీకరించడానికి ఏమాత్రం అభ్యంతరంలేదట.

కట్నం పదివేలూ యిస్తే తను పూర్తిగా నచ్చుతుందా? తనకు తానుగా తనను మెచ్చి పెళ్లాడవలసినవాడు పెద్దవాళ్ళ నయభయాల్కి తలొంచి మూడు ముళ్ళూ వేస్తాడు గామోసు. ఇటువంటి మగతనంలేనివాణ్ణి చేసుకుని తను జీవితపుటంచుల వరకూ ఎలా పయనిస్తుంది?

డబ్బుతో ప్రేమను కొనబోవడం ఎంత నీచం???

* * *

పందిరి మంచం గదికి కళొచ్చింది. కళకళలాడుతూంది. ముతకవాసన వచ్చే ఆ గది ఇప్పుడు అగరొత్తుల ఘుమఘుమలతో సువాసనల్ని వెదజల్లుతూంది.

రసికరాజులకు మత్తెక్కిస్తూంది.

మంచంమీద పూలు నలుగుతున్నాయి

పగిలిన చేతిగాజుముక్కలను, సగం కాల్చి పారేసిన సిగరెట్టు పీకలను రోజూ పనిమనిషి తుడిచి అవతల వేస్తూనే వుంది.



దేవదారు చెక్కపెట్టె అటకెక్కి దానిస్థానే గాడ్రెజ్ బీరువా హుందాగా నిలిచింది. ఇప్పుడా బీరువాలో అన్నీ ఖరీదైన వస్తువులే. అన్నీ ఖరీదైన చీరలే....

రోగిష్ఠితల్లికి పెద్ద డాక్టర్ల వైద్యం. రోగి తేరుకుని మొఖం తేటతెల్లంగా వుంది.

సుబ్బయ్యనాయుడిగారి ధనలక్ష్మి ఇప్పుడు రాధారాణి ఇనపబీరువాలో నిండుతూంది.

ఏమో తెలియని తెగింపు.

గుండె నల్లరాయయింది.

అది పగలదు, కరగదు.

ఎదురు లేదు. చింతన లేనేలేదు.

ఇప్పుడు వెన్నెల వెలుగులు ఏటిపాలవటం లేదు.

బ్రతుకు నందనవనమౌతూంది.

ఆశ కోటిదివ్వెల వెలుగై మదిన నర్తిస్తూంది.

జీవితం సెలయేటి పాటై గలగల పారుతూంది.

రామయ్యగారి ముఖంలో ఇదివరకటి బీదరికపు ఛాయలు లేవు.

పెంకుటిల్లు పడగొట్టి డాబా చేసారు.

అడిగినవారికీ అడగనివారికీ లాటరీలో యాభైవేలు వచ్చాయని గర్వంగా చెప్పుకుని తలెత్తుకు తిరగ్గలుగుతున్నారు.

మునసబుగారు ఆయన్ని పిలిచి ఇపుడు సలహా లడుగుతున్నారు.

కరణంగారు రోజూ ఓసారన్నా వచ్చి క్షేమ సమాచారాలడగందే వెళ్ళటంలేదు.

ఊరి తగవుల తీర్పుకు ప్రెసిడెంటుగారు ఈయన్నే నియమిస్తారు.

ం ం ం

రెండు సంవత్సరాల పైనే గడిచింది.

ఇంటి ముందు ఆగిన గుర్రబ్బండిలోంచి దిగుతున్న వ్యక్తిని పరికించి చూసి వెంటనే గుర్తుపట్టారు రామయ్యగారు.

'రండి రండి' అంటూ ఇంట్లోకి పిల్చివేసారు.

'పెద్దలు .... మీరూ కూర్చోండి' అంటూ రామయ్యగారు కూర్చున్న తరవాతే ఆ వచ్చిన వ్యక్తి కూర్చున్నాడు.

కుశలప్రశ్నలు అడిగి తెలుసుకుని, తుఫాను భీభత్సం మీద, రాజకీయప్రహసనాల మీద, పంటల నష్టంమీద, కరువు కాటకాలమీద తదితర విషయాలన్నింటిమీదా చర్చించాక అసలు విషయానికొచ్చా డా వ్యక్తి.

ఆయన రాకతోనే అర్థమయిన రామయ్యగారు "పిల్లలకి సంబంధాలు చూస్తున్నాం— ఇంకా ఏవీ కుదరలేదు" అన్నారు పొగాకుచుట్ట చుట్టుకుంటూ.

"సంబంధాలు చూడటమేవిటండీ!" అని ఆశ్చర్యం వ్యక్తంజేసి 'రెండు సంవత్సరాల క్రితం పెళ్ళిచూపులకనొచ్చాం....ఏదో పదివేలు కట్నమడిగామనుకోండి — మీరన్నా మరో మాట మాట్లాడలేదు .... పెద్దలు, అనుభవజ్ఞులూను-మీవంటివారి సంబంధం కాలదన్నడం భావ్యంటండీ....మీ అమ్మాయిని మా ఇంటి కోడలిగా జేసుకుందామనే సదుద్దేశంతోనే వచ్చాను'' అన్నాడు అతివినయం వలకబోస్తూ.

రాధారాణి గుమ్మాని కానుకుని నిర్లిప్తంగా వింటూ నిలబడింది.

తల్లి కాఫీ కలిపి వచ్చిన ఆ పెద్దమనిషికీ, రామయ్యగారికీ యిచ్చి తను ఇవతలగా కూర్చుంది.

చుట్ట వెలిగిస్తూ 'మీకు మా సంబంధం నచ్చలేదనీ, మీ అబ్బాయికి వేరే సంబంధాలు చూస్తున్నారనీ విన్నానే' అన్నారు రామయ్యగారు.

"అబ్బెబ్బే — అదేంలేదే! .... మీకే మా సంబంధం నచ్చలేదేమోనని అనుకున్నాం. మాకూ వాడొక్కడే బిడ్డ .... మీకూ ఒక్కగానొక్క-కూతురాయె....మీ సంబంధం కలుపుకోవడం మా కెంతో ఆనందం....ఇంతెందుకు నేను వేరే సంబంధం చూడబోతే మావాడు ససేమిరా ఒప్పుకోలేదు. మీ అమ్మాయిని తప్ప వేరే అమ్మాయిని చేసుకోనని భీష్మించుక్కూర్చున్నాడు. కట్న కానుకల ప్రసక్తి లేదనుకోండి—మీ రెంతిస్తే అంత.... మీరు 'ఊ' అంటే ముహూర్తం పెట్టించేద్దాం. ఏవంటారు?" అన్నాడు కుతూహలంగా ముందుకు వంగి.

"మాదేముంది — మా అమ్మాయి ఇష్టం' అన్నారు రామయ్యగారు పెళ్ళాం ముఖంలోకి చూస్తూ.

"అవునన్నగారూ!" అంది తమకేం అభ్యంతరం లేదన్నట్లుగా.

ముగ్గురూ గుమ్మంలో నిలబడ్డ రాధారాణి కేసి ప్రశ్నార్థకంగా ఒకేసారి చూస్తారు.

అప్పుడు తను ఓమాదిరిగా నచ్చిందన్నారు. ఇప్పుడు తనను తప్ప మరెవ్వరినీ పెళ్ళిచేసుకోనంటున్నాడని అన్నారు. అప్పుడు పదివేలు కట్నంగా అడిగారు. ఇప్పుడు 'ఎంతిస్తే అంత' అంటున్నారు.

ఇప్పుడు తనకి డాబా వుంది. కావలసినంత డబ్బుంది. ఊరి చివర సుబ్బయ్యనాయుడిగారి ఉరుకుంబాల కొబ్బరితోట తనపేర్నే వుంది.

వీళ్లు డబ్బు మనుషులు. తన గురించి పదిమందీ చెడుగా చెప్పుకుంటున్నా తెలిసే వచ్చారు. అంటే తండ్రి నయభయాలకి తన మెడలో తాళి కట్టనున్నాడన్నమాట.

తనకొక్కవల్సింది యిలాంటి మగసిడే.

అందరి ముఖాలకేసి ఒకసారి చూసి "నా కిష్టమే" అని లోపలికి వెళ్ళిపోయింది.

ం ం ం

పెళ్ళికి ముందే కర్ణుణ్ణి కన్న కుంతీదేవి పతివ్రతే.

పెళ్ళికి పిదప దేవతల ద్వారా ఐదుగురు బిడ్డల్ని కన్న ఆ కుంతీదేవే పతివ్రత పతివ్రత.

అవును పతివ్రతే.

ఆ మహా పతివ్రతను పరిణయమాడిన పాండురాజులాంటివాడే తన మొగుడు.

ఆ మొగుడిచేతనే పెళ్ళికి ముందు తను కన్న ఇద్దరు బిడ్డల్నీ అనాథ శరణాలయంనించి యింటికి తెప్పించుకుంది.

రాధారాణి ఖరీదైన పెద్ద మనుషులకు 'ఫామిలీ ఫిగర్'—

ఐనా

రాధారాణి పతివ్రత.

పతివ్రతే—

మహా పతివ్రత. □

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

లేటొచ్చిన బస్సు

వినయ్



మొన్నటి ఎన్నికల సమయంలో చిక్కమగళూరు పోలింగ్ బూత్‌లా వుంది బస్సుస్టాపు. ఆఫీసులకు వెళ్ళవలసినవాళ్ళు, కాలేజీకి వెళ్ళవలసినవాళ్ళు—చిన్నా పెద్దా, ఆడా మగా కలిసి చూడ్డానికి పెళ్ళిగుంపులా కనిపిస్తున్నారు. వచ్చి యెదుర్కోవలసిన ఆడపెళ్ళివారు ముహూర్త సమయం దాటిపోతున్నా జాడలేనట్టు విసుగుపడుతున్నారు, రావలసిన బస్సుకోసం చూస్తూ. ఆ బస్సు మరో అరగంటదాకా రాకూడదని తమ తమ దేవుళ్ళకు, ఆరాధ్య బాబాలకు మొక్కుకుంటున్నారు రిక్షావాళ్ళు, ఒక్క సవారీయైనా దొరుకుతుందనీ, ఒక్కపూటైనా పొయ్యిలో పిల్లి లేస్తుందనీ. బలమైన అధికార పార్టీని యెదిరించలేక, ఊరుకోలేక చెలరేగే ప్రతిపక్ష నాయకుడి అసహనంలాగా ఎండ మండిపోతూంది.

బేరాలాడుతున్న రిక్షావాళ్ళని చూసి, వాళ్ళ అఘాయిత్యాలను దుమ్మెత్తిపోస్తున్నాడు ఓ సూటువాలా. బస్సుల రాకలో లేని పంక్చ్యుయాలిటీని విమర్శిస్తున్నాడో ఇన్‌షర్ట్‌వాలా. అప్పటిదాకా మౌనంగా నిల్చున్న ఓ పెద్దమనిషి మలయాళంవాళ్ళు లిఫ్టు యిచ్చాక తెలుగు నటీమణిని తనూ బుక్ చేసుకునే పదహారణాల తెలుగు నిర్మాతలా—అప్పుడు మొదలుపెట్టాడు, ఆ బస్సు సమయానికి రాకపోవడం వలన తనకు కలిగే నష్టాల లిస్టుని. బస్ కండక్టర్లు, ఆ మాటకొస్తే బస్సు డిపో వాళ్ళూ విద్యార్థుల్ని ఎక్కడెక్కడ ఎలా అవమానించిందీ ఏకరువు పెడుతోన్నాడో స్టూడెంటు. నీటి వనరుల గురించి ప్రభుత్వం ఎండాకాలంలో చేసే వాగ్దానాలు ఎండలు పోయేసరికి మరిచిపోయినట్టే, బస్సెక్కి దిగేసరికి వాళ్ళు అవన్నీ మరచిపోతారు. మళ్ళీ బస్సుకోసం పడిగాపులు గాసేటప్పుడు గుర్తొస్తుంది, మరునాడు మరొకరితో చర్చ, మళ్ళీ....ఎప్పుడూ భూమి గుండ్రముగా ఉండును.

ఆ జనంలోనే వున్న కేశవ్, బస్సు రాక ప్రాబబిలిటీని అంచనావేస్తూ తీవ్రంగా చర్చించుకుంటున్నాడు. వాళ్ళ కాలేజీ పేరేమిటోగానీ, అది సరిగ్గా దుర్గా కళామందిర్ (సెవెంటీ ఎమ్మెమ్) ఎదురుగా వుంది. అతను కాలేజీ స్టూడెంట్. అంటే ఆరోజు రిలీజయిన సినిమా ఏదీలేని రోజున కాలేజీ బాగోగులు విచారించటం మొదటి పీరియడ్ కాలేజీ పక్కనున్న కపాలీ బేకరీ రెస్టారెంట్‌లో లేటెస్టు రికార్డులు వింటూ, తలాడిస్తూ, ఇరానీ టీ తాగటం, వినే క్లాసుల్లో మాస్టరీ కేసిన లెక్చరర్లకుకూడా ఆ యా సబ్జక్టుల్లో అంతుపట్టని తెలివైన ప్రశ్నలడగటం, వగైరాకారుడు. ఎంటీయార్ డ్రెస్సులు కుట్టించి టైలర్లకు, కమలహాసన్ హెయిర్ స్టైల్, మీసాల అలంకరణలతో హెయిర్ డ్రెస్సర్లకు ఇతోధిక సేవచేస్తూ, రజనీకాంత్ స్టైల్స్ అనుకరిస్తూ, అమ్మాయి వెంట సినిమాలో డ్యూయెట్‌లా ఉండకపోతే ఆ లైఫ్ నిస్సారంగా, జయమాలిని లేని తెలుగు సినిమాలా వుంటుందని అతని అభిప్రాయం. ఇలా 'కాలేజ్ స్టూడెంటు'గా అతనిగురించి యెంతైనా రాయొచ్చు. అందునా, రాస్తున్నంతలో బస్సు వస్తుందనీ, అతను వెళ్ళిపోతాడనే భయమేమీ లేదు. మన దేశంలో అరగంట లేటొచ్చే రైళ్ళుంటే, గంట లేటొచ్చే సిటీ బస్సులు ఉండనే ఉంటాయి, రైళ్ళ పురోగతి రికార్డులు బద్దలు చేస్తూ. కానీ మరింత రాయటంవల్ల, ఇలా వుండని బుద్ధి తక్కువ కాలేజీ స్టూడెంటు యెవరైనా మన మీద పరువునష్టం దావా వేయొచ్చు. ఆనక మనం కోర్టు పక్షులం కావొచ్చు.

ఇక అసలు సంగతి. ఆ రోజే రెండు సినిమాలు రిలీజైనాయి. వినోదమహల్లో 'దొంగల వేట', నర్తకిలో 'యుగపురుషుడు'—ఆ రెండూ ఆ రోజునే విడుదలవుతున్నాయి. దేనికి వెళ్ళటం? ఇంకో పావుగంటకు బస్సు వచ్చినా, మరో పావుగంటలో థియేటర్లో ఉండొచ్చు. జేబులో ఒకే ఒక్క రూపాయి వుంది. బస్సుకు ఇరవై అయిదు పైసలు పోను, ముప్పావలా సినిమా టిక్కెట్ కుంటుంది. ఆ రోజు పద్నాలుగో తేదీ గనుక ఇంటినుండి వచ్చే రెండో మనియార్డర్ మరో మూడురోజులదాకా రాదు. ఎవణ్నయినా చేబదులు అడిగినా ప్రయోజనం వుండదు. ఐతే, ఇప్పుడు ఏ సినిమా చూడటం? బస్సు వస్తే బాగుణ్నునుకున్నాడు.

"టైమెంతయిందండీ?" అడిగాడు, పక్కతన్ని.

"పావు తక్కువ పది."

"పావుగంటలో బస్సు వస్తే బాగుణ్ను" అనుకున్నాడు, ఈ సంబంధమైనా కుదిరితే బావుణ్నని పద్నాలుగోసారి కూచున్న ఆడ

రచయిత గురించి

రచయితగా నన్ను పరిచయం చేసుకోమన్నది 'జ్యోతి'. ప్రస్తుతం రచయితలంతా పరిచయం చేసుకుంటే తప్ప 'ప్రస్తుతం లేని' వాళ్ళు, ఓటర్ల లిస్టులో తప్ప పేరులేని వాళ్ళు. చదువుకున్నాను. రాయటం వచ్చు గనుక రాస్తున్నాను. రాయటంలోనే బతకాలనుకున్నాను గానీ రాయటంతో బతుకుతాననుకోలేదు (గుమస్తా ఉద్యోగం). అర్థంకానిది గొప్ప సాహిత్య మనుకుంటారు చాలామంది. చాలామంది ఎడిటర్ల దృష్టిలో నేను గొప్ప రచయితగా నిలిచిపోతున్నాను.

ఓ పత్రికను విమర్శిస్తే చాలు, మళ్ళీ ఆ పత్రికలో తన పేరు చూడ నోచుకోడు ఏ రచయితా, వాళ్ల తనను తిట్టే సందర్భాలలో తప్ప. ఇలాంటి వ్యవస్థలో ఒక రచయితకు ప్రత్యేక పరిచయం ఏముంటుంది? 'జ్యోతి'కి కృతజ్ఞతలు.

—వినయ్

పిల్లలా.

తోటి గుమస్తా గిరితో మాట్లాడుతున్నాడు గౌరీశం. అతనిలో ఏదో బాధ కనిపిస్తూంది. స్వేచ్ఛగా బ్రతుకలేని మనస్తత్వపు జాడ, ఆత్మీయుల్ని బాధలో వదలి వస్తూన్న ఆందోళన పిలిపీడ గోచరిస్తున్నాయి. వాళ్ళిద్దరూ పోస్టాఫీసులో క్లర్కులు. అంటే యముని కార్యాలయంలో దూతలు.అథవా,ఆ యముడు, జరగాల్సిన పని సక్రమంగా జరిగే ఏర్పాటు లేకుండానే ఎవరికైనా లీవు సాంక్షన్ చేస్తాడేయో కానీ, న్యూమోనియా పేషెంట్ వర్షంలో తడిసొచ్చి, సెలవు చీటీ అందించబోయినా, మరో మనిషి ఆ పని చేసే ఏర్పాటు లేకుండా అతణ్ని వెళ్ళనీయరు.

అందుకే, తొలిచూలు భార్యను వదలి ఉండలేకున్నా వారం రోజులు ఆఫీసులో గడిపాడు. ఆ రోజు ప్రసవం వస్తుందని డాక్టర్ చెప్పింది. తాను హాస్పిటల్‌లో జాయిన్ చేయించలేడు. కనీసం యింటిదగ్గర భార్యకు తోడుగా ఉండటానికి ఆ రోజుకూడా వీలులేదు.

"లీవు ముందుగా అడిగితే బావుండేదోయ్...." ఉచిత సలహా వొకటి పారేశాడు గిరి.

"అది వారం రోజుల క్రితమే అయింది. నిన్న కూడా ఎంతగా చెప్పినా ఆ యముడి గుండె కరగలేదురా. వాడూ కన్నాడు పిల్లల్ని" కసిగా అన్నాడు గౌరీశం, తన నిస్సహాయతను దాచుకోలేక.

"వాడి పెళ్ళాం పిల్లల్ని కనేటప్పుడు ముందో నెల, తరువాతో నెలా నర్సింగ్ హోమ్‌లో ఉంటుందోయ్. వాడు మంచి చెడ్డలు కనుక్కోవలసిన అవసరం కూడా వుండదు" —విలువ పడిపోయింది గనుకే నిజాన్ని అంత ఈజీగా వదిలేశాడు గిరి.

గిరికి కూడా తీరికుండదు. లేకుంటే ఎలాగో తన పని అప్పగించి, హాఫ్‌డేకోసమైనా వచ్చేవాడు. ఇప్పుడు తొందరగా వెళ్ళి, ఎవర్నయినా ఒప్పించి యెలాగయినా రావాలి. ముందు ఈ బస్సు రావాలి. అప్పటికి పదోసారి పది కావటానికి ఎంత టైముందో చూసుకోవటం.

"వెధవ బస్సు. ఒక్కనాడూ టైముకు వచ్చి చావదు. ముప్పయ్యేళ్ళనించీ చూస్తున్నా" సణుక్కుంటున్నాడు యాభయ్యేళ్ళకు దగ్గర పడిన పరంధామయ్య.

అతను పని చేసేది ప్రైవేట్ కంపెనీలో. ఇరవైయేళ్ళుగా పని చేస్తున్నా, బస్సు ప్రయాణం కాదనుకుని రిక్షాలో ఆఫీసుకు వెళ్ళలేకపోయాడు. బస్సు లేటైనప్పుడల్లా, పరంధామయ్య ఆఫీసులో చేరినప్పటికింకా పుట్టని ప్రస్తుత యజమాని చీవాట్లు పెట్టినా, ఎద్దులాగా కంప్యూటర్‌లాగా పని చేస్తాడని, చీవాట్లు మించి ఏమీ చెయ్యడు.

బస్సు కోసం కూర్చున్నప్పటి నుండీ, బస్సెక్కేదాకా బస్సువాళ్ళని తిట్టుకుంటూనే వుంటాడు. మొదట్లో ఓసారి కంప్లెయింట్ రాశాడు. ఆ మర్నాటినుండీ తను స్టాపులో కనిపిస్తే అమడ దూరంలో ఆపేవాడు కండక్టర్. అంతకు మించి మార్పేమీ రాలేదు. ఆ తరువాత లెటర్స్ కాలమ్‌లో ఉత్తరం రాశాడు. మరునాడు, పరంధామయ్య పెద్ద బాస్, ఆయన్ని పిలిచి "నువ్వు కమ్యూనిస్టువా?" అ టూ అరగంటసేపు నీతి బోధలు చేశాడు. బస్సు మాత్రం ఎప్పుడూ టైంకొచ్చిన పాపాన పోలేదు. ఇంట్లోనూ, బైటా—ఎప్పుడూ బస్సువాళ్ళమీద తన ప్రతీకారం తీర్చుకోవడమెలాగా అని ఆలోచిస్తూంటాడు. ఒక సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

బస్సు మాట యెలా వున్నా ఇందిరాగాంధీ గురించీ, ఇంటర్‌నేషనల్ సమస్యల గురించీ, యూనివర్సిటీల పేర్ల గురించీ తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. కాలం మరో పది నిమిషాలను మింగేసింది. ఎం.పీ.ల లాగా, ఎమ్మెల్లేల లాగా గడియారాల ముళ్ళు క్షణక్షణం స్థానం మారుతున్నాయే కానీ సమస్యలు మారటం లేదు. కాలం మారుతూందే గానీ మనుషులు మారటంలేదు. ఎక్కవలసిన బస్సు వస్తుందన్న ఆశ లేకున్నా, రిక్షావాడికి ఐదుపైసలు ఎక్కువివ్వటానికి చస్తూ, వాదులాడుతున్నా రిద్దరు మహానుభావులు.

బస్సు వస్తే బాగుణ్ను. ఎంతైనా 'యుగపురుషుడు' సినిమాస్కోప్. పైగా రామారావ్ కరాటే ఫైటింగ్ చేస్తాట్ట. ఎలా వుంటుందో? బస్సుకు పావలా పోను, ముప్పావలా వుంటుంది. 'దొంగలవేట'కైనా సరిపోతుంది. రెండు థియేటర్లూ పక్క పక్కనే. 'దొంగల వేట' వదిలేయవలసిన సినిమా యేమీ కాదు. కృష్ణ క్రైం అంటే మాటలా? అందునా కెయస్సార్ దాస్ దర్శకత్వం. కేశవ్ మనసు రెపరెపలాడుతూంది. కదిలి వెళ్ళ బుద్ధికావటం లేదు. దేనికి వెళ్ళాలో అర్థం కావటం లేదు. నడిచివెళ్ళినా యిప్పటికి వెళ్ళేవాడే. కానీ, తీరా యిప్పుడు నడిస్తే చేరుకోగలడా? నాలుగు అడుగులు వేయగానే బస్సు వస్తే....?

బస్సు వస్తే బాగుండేది? పోస్టాఫీస్‌కు వెళ్ళేది అదొక్కటే బస్సు. గిరి రిక్షావాణ్ని పిలుస్తున్నాడు. తనదగ్గర రిక్షాకుకూడా డబ్బులు లేవు. పోనీ వెళ్ళకపోతే....? అమ్మో, ఇంకేమైనా వుందా? అసలే పోస్టాఫీస్. అందునా ఇది తపాలా వారోత్సవం జరుగుతున్న రోజు. వెళ్ళకపోతే పెద్ద రిమార్కు. ఓ రోజు జీతం రాదు. సస్పెండ్ చేసినా చేస్తారు. ఇందిరాగాంధీ మీద షా కమీషన్ ఎంక్వైరీలాగా, అసలే భార్య గర్భవతి. ఖర్చు యెక్కువయ్యే రోజులు. ఒకవేళ బస్సు యింకో పావుగంట వరకూ రాకపోతే....?

"వెధవ ముండాబస్సు.ఇదేదో టైంకొస్తుందని రోజూ తొమ్మిదింబావుకొచ్చి కూచోవటం తనబుద్ధి తక్కువ" సిగరుట్టు పీక కసిగా నలిపేస్తూ అనుకున్నాడు పరంధామయ్య. అసలీ బస్సు డిపో వెధవల కిదేం రోగం? తొమ్మిదింబావుకొస్తాదన్న బస్సు యెందుకు రాదు? పోనీ, దాని టైం ఎనిమిదిన్నరకి మార్చి, తొమ్మిదింబావుకి పంపినా బావుండేది కదా! ఓసారి డిపో మేనేజర్‌గాణ్ని తీసుకొచ్చి, తొమ్మిదింబావుకి యిక్కడ నిలబెట్టాలి. వెధవకి, అప్పుడు కానీ బుద్ధిరాదు. కాలేజీకి వెళ్ళే పిల్లలు, ఆడవాళ్ళు, తనలాంటి ముసిలాళ్ళూ ఎందరెందరు, కుక్కల్లా పడిగాపులు గాస్తూ, ఎంత విసుగు

పడతారో తెలిసొస్తుంది. కాని వాడికేం ఖర్మ. వాడు బస్సుకోసం యెందుకు నిలబడతాడు? కాకపోతే, ఎమ్మెల్లే సీటుకోసం నిలబడతాడు. టూరిజం డిపార్ట్‌మెంట్ మంత్రి వెధవని ఓ సారి బస్సులో ప్రయాణం చేయమనాలి. బుర్ర పగిలిపోతె, గుడ్డలు నలిగిపోతే, పెట్టుకున్న టోపీ యెగిరిపోతే, బస్సు కుదుపులకి ఒళ్ళు హూనమైతే—అప్పుడు తెలుస్తుంది వాడికి, బస్సుల్ని యెలా నడపాలో—కసిగా అనుకుంటున్నాడు పరంధామయ్య.

ఎవరి సమస్య వాళ్ళది. ఎవరి ఆలోచనలు వాళ్ళవి. కానీ అవన్నీ సూర్యుడి చుట్టూ గ్రహాల్లాగా బస్సు రావటాన్ని కేంద్రం చేసుకుని పరిభ్రమిస్తున్నాయి. "బస్సు వస్తే బాగుణ్ను"—ప్రతివారి మనసులోనూ అదే మాట. ఇంతలోకే బస్సు చప్పుడు వినిపించింది. బస్సుస్టాపు సరిగ్గా మలుపులో వుంది. అందుకే కనిపించకుండా వినిపించిన శబ్దం లారీదేమోనని ఒకాయన సందేహం వెలిబుచ్చాడు.

"కాదు, అది బస్సే—" అన్నాడు కేశవ్, తన కాలేజీ ప్రయాణంలో బస్సు శబ్దాన్ని గుర్తించగలిగిన సామర్ధ్యాన్ని తెలియచెప్పుకుంటూ.

ఒక్కక్షణం అందరి మొహాల్లోనూ వెలుగు కనిపించింది.

ఇందిరాగాంధీ మళ్ళీ గెలిచిందని విన్న కాంగ్రెస్—ఐ వాళ్ళలాగా, ఇందిరాగాంధీని పార్లమెంట్‌నించి బహిష్కరించారని విన్న జనతావాళ్ళలాగా, చరణ్‌సింగ్ ఉప ప్రధాని కాబోతున్నాడని తెలిసిన రాజనారాయణ్‌లాగా అందరూ మొహాల్లో సంతోషాన్ని ప్రకటించారు.

"అమ్మయ్య. సినిమాకు వెడుతున్నాను. ఏ సినిమాకు వెళ్ళాలో అక్కడ నిర్ణయించుకోవచ్చులే" అనుకున్నాడు కేశవ్.

"గిరి అనవసరంగా రిక్షాకు డబ్బులు ఖర్చు పెట్టాడు. అతనెట్లా పోయినా నేను ఆఫీస్‌కు పోతున్నాను. కానీ అక్కడ జానకి యెలా వుందో, ఏమవుతుందో"—అని మనసు క్షోభిస్తున్నా, అప్పటిదాకా వున్న డోలాయమాన పరిస్థితిని ఆ వస్తున్న బస్సు దూరం చేసింది. ఇక ఆఫీసుకు వెళ్ళక తప్పదనే నిర్ణయాన్ని చేసి, పార్లమెంట్ శాసనాల్ని ప్రజల నెత్తిన రుద్దినట్టు రుద్దింది.


"పాడు బస్సు. ఇప్పటికైనా వస్తూంది. రాక యెక్కడికి పోతుందిలే. ఆ వచ్చేదేదో టైంకు వస్తే దాని కండక్టర్ సొమ్మేం పోయిందో? పదయ్యింది. కంపెనీకి వెళ్ళగానే, ఆ కుర్రకుంక యింత ముసిలాణ్నానే గౌరవం ఏమాత్రమూ లేకుండా దులిపేస్తాడు. బస్సు లున్నంత కాలం తనకు చీవాట్లు తప్పవు. చూపున్నా లేకున్నా కళ్ళున్నంతకాలం కన్నీళ్ళు తప్పనట్టు" అనుకున్నాడు పరంధామయ్య.

రోహిణీ కార్తెలోని నీళ్ళులేని మబ్బులాగా జనతా వాళ్ళ మొదటి బడ్జెట్‌లాగా, ఉద్యోగం రాని ఇంటర్వ్యూకాల్‌లాగా ఆశ రేపి, చల్లార్చి వెళ్ళింది 'డిస్ట్రిక్టు బస్సు'. దెబ్బయ్యేడు మార్చి ఎలక్షన్ల తరువాత కాంగ్రెస్‌వాళ్ళ ముఖాల్లాగా అయినాయి అందరి ముఖాలూనూ. కొందరి మొహాలు మాత్రం 'రాజ్యసభుందిగా' అనే ధీమా ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి.

కేశవ్ విసుక్కుంటున్నాడు. గౌరీశం ఆతురత పడుతున్నాడు. ఆస్తిపాస్తులన్నీ తాకట్టు పెట్టి తీసిన సినిమాను సెన్సారు చేయరటని తెలిసిన నిర్మాతలా వున్నాడు పరంధామయ్య, మండిపోతూ.

"ఇకనైనా బస్సువస్తే సినిమా చూడొచ్చు" అనుకున్నాడు కేశవ్. తన జన్మలో ఇంత వరకూ మొదటిరోజు సినిమా చూడకుండా వుండలేదు. అలాంటిది, యివాళ తప్పేటట్టే వుంది సినిమా. ఛ. ఛీ, వెధవ బస్సులు. పోనీ, ఈ పడిగాపులు పడేకంటే కాలేజీకే వెళ్ళితే పోలా. మనియార్డర్ రొచ్చాక హాయిగా చూడొచ్చు! అమ్మో! ఎలా చేయగలను, చూస్తూ చూస్తూ—అనుకున్నాడు, విసుగుపడుతూనే.

బస్సింకో ఐదు నిమిషాల కొచ్చినా ఎలా



గోలా సర్దుకోవచ్చు—అనుకున్నాడు గౌరీశం. అతని మనసు మళ్ళీ భార్యవైపు తిరిగింది. అసలే తొలిచూలు. అందునా జానకి వట్టి నీరసం మనిషి. ఎటొచ్చి ఏమవుతుందో చెప్పలేం. పక్కింటావిణ్ని కనిపెట్టుకుని ఉండమని చెప్పేవచ్చాడు. ఐనా మనసు ఆరాటపడిపోతూనేవుంది. పెళ్ళయినప్పట్నించీ ఏ సరదాలూ లేకపోయినా, కడుపుతోవున్నప్పుడైనా ఏ కోరికలూ తీర్చలేకపోయినా, కనేటప్పుడు భర్త పక్కనుండాలని కోరుకుంటుంది ఆడది. అంత చిన్న కోరిక కూడా తీర్చలేని బ్రతుకయింది తనది. ఉత్తరాలు రాసినంత మాత్రాన దూరాభారం అని పెద్దవాళ్ళు, కావలసినవాళ్ళలో యేవళ్ళూ రాలేదు. తను హాస్పిటల్లో చేర్పించి ఆ ఖర్చు భరించలేడు. సరే, అటు జానకి యిలా వున్నా, ఇటు ఆఫీసుకూ టైంకు చేరుకునేట్టు లేదు—బాధగా అనుకున్నాడు.

"మరీ ముసలాణ్ని, గుమస్తానూ అయిపోయానుగానీ నేనే మంచి వయసులో వుంటే కండక్టర్ వెధవల్ని దావ చితక తన్నేసేవాణ్ణి. యే పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగినో ఐనా, ఆ మధ్య బస్సులవాళ్ళకీ, పోలీసువాళ్ళకీ జరిగిన గొడవలాంటి దొకటి సృష్టించేవాణ్ని. వెధవది, యెటూ కాకుండా పోయింది. బతికిపోతున్నారు బస్సుడిపో నా"కొడుకులు" మండిపడుతున్నాడు పరంధామయ్య లోలోపల. అతనికి బస్సులమీద చాలా కసిగా వుంది. కానీ అది తీర్చుకోవటానికి ఒక్క మార్గమూ కనిపించటం లేదు.

లోలకం అటూ ఇటూ వూగినట్టు వుంది వాళ్ళ పరిస్థితీ, మనస్థితీ. అసలు ఈ జీవితాలే కష్టసుఖాల మధ్య ఊగిసలాడుతున్నాయి. "కలిమిలేములు, కష్ట సుఖాలూ — కావడిలో కుండలనీ భయమేలోయీ" అన్నాడు సముద్రాల. కానీ చాలామంది కష్టాల కడలిలో కెరటాలలాంటివాళ్ళు. సుఖాల జాబిలిని అందుకోను ఊహాల శూన్యంలోకి ఎగిసి, ఎగిసి పడుతూ ఆ కడలిలోనే కలసిపోతారు. అంతా జీవితమనే బస్సుస్టాపులో అవకాశపు బస్సు కోసం యెదురుచూస్తున్నవారే. అది ఆశలను పండించకపోయినా కనీసం అవసరాలు తీరిస్తే చాలు. అంతేకానీ, పోట్లాటంతా ఐపోయాక వచ్చే సినిమా పోలీసులను అనుసరిస్తే నిష్ప్రయోజనం.

సినిమా టైం దగ్గరపడుతున్నా కేశవ్ ఇంకా బస్సుకోసమే ఎదురుచూస్తున్నాడు కానీ కాలేజీకైనా వెడదామని అనుకోలేకపోతున్నాడు. ఆ

బస్సు వచ్చినా వెళ్ళేసరికి సరిగ్గా సినిమా స్టార్టవుతుంది. బుకింగ్ అప్పటికే అయిపోతుంది. కాకున్నా టిక్కెట్ దొరకడానికి మరో జన్మ యెత్తాలి. కానీ అదంతా ఆలోచనా పరిధిలోకి రానీయడు. ఒక రకం ఆలోచనకు అలవాటుపడిపోయాడు. అంతే.

గౌరీశంకి ఆఫీస్ టైమవుతుంది. బస్సు వెంటనే వచ్చినా, ఆఫీసుకు లేటవక తప్పదు. రిమార్కు తప్పదు. తనకు లీవులున్నాయి. చచ్చేంత అవసరమున్నప్పుడైనా, ఎందు కివ్వరని అడిగే ధైర్యం లేదు. లీవు ఇవ్వకపోతే పోనీ, భార్యను చావుబతుకుల సమయంలో దగ్గరుండి చూసుకునే 'అదృష్టం' లేదని ఏడుస్తాడే తప్ప, జరిగిందేదో జరిగిందని, జరుగుతున్నదాన్నైనా సమగ్రంగా ఆలోచించే శక్తి లేదు "బస్సు యింకో గంటదాకా రాకపోయినా వేచి చూస్తూ నిలబడదాం ఓపిగ్గా" అనుకున్నాడు చిరాగ్గా.

"ఈ వెధవ బస్సుల్ని, బస్సు వెధవలనీ యేమీ చేయలేకపోతున్నాను. ఇక చేయలేను. అసలు యీ దేశంలో బస్సులో తప్ప వెళ్ళలేని దౌర్భాగ్యపు వర్గంలో పుట్టటం నా తప్పు" అనుకున్నాడు, నీరసంగా.

బస్సు రాకుండా పోదు. వస్తుంది, ఎప్పటికో ఒకప్పటికి. అది ఆలస్యంగా రావటానికి సవాలక్ష కారణాలుంటాయి. బస్సులు నడిపించి చూస్తే తెలిసొస్తుంది యెవళ్ళకైనా! ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒకలాగా బస్సొచ్చిన తరువాత బుద్ధభగవానుడి నేలలో పుట్టిన మనం, యెలా వాణ్ని తప్పని తన్నగలం. వెళ్ళాల్సిన చోటుకి చేరుస్తూ, రిక్షావాళ్ళకంటే తక్కువే డబ్బు తీసుకుంటుందన్న సత్యాన్ని ఎలా కాదనగలం? "సత్యమేవ జయతి" మన సూత్రం కాదా. మన జండాపై ధర్మచక్రం వేసుకుని, గుండాల్లాగా అన్యాయంగా బస్సుల్ని యెలా నమ్మెత్తి పోస్తాం?—అందరూ అదే అనుకుంటారు.

కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తున్న వాళ్ళకు, బస్సు శబ్దం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలాగా తీయగా వినిపించటం లేదు. శాస్త్రీయ రాగంలాగా యేం రాగమోనని భయపడి చస్తున్నారు. అదీ ఇంతకుముందు బస్సులాగే, ప్రేమిస్తున్న అమ్మాయికి పెళ్ళయిందనే వార్తలా చేస్తుందేమో నని సందేహిస్తున్నారు.

ఇంతలోకే అందరికీ కావలసిన బస్సు, అదే నెంబరు బస్సు, మలుపు తిరుగుతూ, అందరి ఆలోచనల్ని మలుపు తిప్పింది. అందరి మనసుల్లోనూ ఉత్సాహం పొంగి పొరలింది. బస్సు వస్తోంది. మనసులన్నీ ఒక నిర్ణయానికి వస్తున్నాయి.

"అమ్మయ్య. సినిమా చూడబోతున్నాను" పొంగిపోయాడు కేశవ్.

"ఎలాగోలా ఆఫీస్ కెడుతున్నాను" నిట్టూర్చాడు గౌరీశం.

స్టాపుకు పదిగజాల దూరంలో చెట్టుకింద కూచున్న పరంధామయ్య, "వెధవ ముండా బస్సు. రాక యెక్కడికి పోతుందిలే—" అని సణుక్కుంటూ లేవటానికి ఉపక్రమించాడు.

వస్తూన్న బస్సు వచ్చేసింది. స్టాపు దగ్గరకొచ్చింది. కానీ, చిన్నస్టేషన్‌లో ఆగని సూపర్ ఫాస్ట్ ట్రెయిన్‌లాగా సర్రున వెళ్ళిపోయింది.

నిరాశగా కాలేజీవైపు అడుగులేస్తున్నాడు కేశవ్.

నిస్పృహతో యింటిముఖం పట్టిన గౌరీశం ఒకింత సంతోషిస్తున్నాడు.

స్టాపు దాటి దూసుకొస్తున్న బస్సుని చూసి పరంధామయ్యకి ఒళ్ళు మండిపోయింది. పక్కనే కనిపించిన కంకరరాయి తీసుకుని తనను దాటిపోతున్న బస్సుమీదికి కసికొద్దీ విసిరాడు. బస్సు అద్దం ఫెళఫెళ విరిగింది. క్షణంపాటు ఆగింది బస్సు. ముసలాయన రాయి విసురుతాడని ఎవరనుకుంటారు? పరంధామయ్య వీరుడిలాగా బస్సెక్కాడు. మరుక్షణం రయ్యిన సాగిపోయింది బస్సు.

ఎంత నిజం. ఆలోచన చేయించలేనిది, ఒక్కోసారి అవసరం చేయిస్తుంది. ఇప్పుడు లేటొచ్చిన బస్సు ఆ ముగ్గురితో చేయించింది. అది పచ్చి నిజమని కాలేజీకి వెడుతున్న కేశవ్ చెప్పటంలేదు. "పోతే పోనీ ఆఫీసని" యింటికెళుతున్న గౌరీశం చెప్పలేదు. చెప్పనక్కర్లేదు. ఐనా, ఆ పగిలిన అద్దపుముక్కలు చెపుతున్నట్టనిపిస్తోంది. □

కొంటె బొమ్మల బాపు

వ్యంగ్యచిత్ర రచన 30,000 సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఆనాటి మానవుడు రాళ్ళమీద, తను నివసించిన గుహల గోడలమీద "పిచ్చి గీతలు" గీసి కడుపార నవ్వుకున్నాడు. క్రీ.పూ. 1000 సంవత్సరాల క్రితం ఈజిప్షియన్లు "స్క్రోల్స్" మీద వ్యంగ్య చిత్రాలు గీశారు. క్రీ.పూ. 500సంవత్సరాల క్రితం రోమనులు మట్టిపాత్రలమీద వ్యంగ్యచిత్ర కథలు చిత్రించారు. ఈ విధంగా ప్రారంభమైన ఈ కళ యిప్పుడు, ఇరవైయవ శతాబ్దంలో తారాస్థాయి నందుకుంది. ఈలోగా HONORE DAUMIER, GEORGE CRUICKSHANK, SIR JOHN TENNIEL లాంటి గొప్ప వ్యంగ్య చిత్రకారులు పుట్టి యీ కళకు జీవం పోశారు. ఈనాడు, తెలుగు పత్రికాలోకానికి వ్యంగ్యచిత్ర రచన ప్రాముఖ్యతని చాటి తద్వారా నూతన హాస్య యుగానికి శంఖాన్ని పూరించిన వైతాళికుడు శ్రీ బాపు. ప్రపంచ కార్టూనిస్టులలో, బాపుకు సమ వుజ్జీలుగ JOHNNY HART, JACK MARKOW, LICHTY, BOB DUNN, IRVING PHILLIPS, JERRY ROBINSON, TED KEY ల పేర్లను చెప్పుకోవచ్చు. వీళ్ళ కార్టూనులలో కొన్ని విశిష్టతలు కనిపించినా, బాపు బొమ్మల్లోని ప్రత్యేకమైన వైవిధ్యం, విశ్లేషణ కనబడవు. బాపు గొప్ప ANALYST! అందుచేత వీళ్ళందరిలోనూ బాపూదే ప్రథమస్థానం. బాపూ బొమ్మ అందానికి ప్రతిరూపం. భావాలకి దర్పణం. బాపు ఒకవైపు ILLUSTRATIONIST గానూ, మరోవైపు CARTOONIST గానూ వ్యవహరిస్తున్న గీతాసార మెరిగిన "సవ్యసాచి".


మనిషి ముఖంలోని కండరాలు సుమారు నలభై రకాల భావాలని వ్యక్తపరచగలవని DESMOND MORRIS పేర్కొన్నాడు. బాపు ఆ నలభైరకాల భావాలని తన బొమ్మల్లో ప్రతిబింబించగల ప్రతిభాశాలి. కార్టూన్ల కోసం బాపూ స్పృశించని అంశమే లేదు. ఆయన మస్తిష్కంలో ఒక పెద్ద పరిశోధనాలయం వుంది. దానికి అండగా ఆయనవద్ద ఒక చక్కటి లైబ్రరీ వుంది. అన్నిటికి మించి మంచి చదువుంది. పరిశీలనుంది.

నవోదయవారు బాపూ వేసిన కార్టూన్లలో చాల తక్కువవాటినే ప్రచురించారు. బాపూ కార్టూన్లలో మంచివాటిని ఏరడం సులభసాధ్యం కాదు. ఆయనవన్నీ మంచి కార్టూనులే. అందుచేత ఈ పుస్తకంలో SELECTED కార్టూనులు మాత్రం వేశారంటే నే నొప్పుకోను. ఐతే ఈ పుస్తకంలో బాపూ ఆలోచించిన అన్ని అంశాలనూ (దాదాపు) సంకలనం చేశారు-అని మాత్రం చెప్పవచ్చు.

పుస్తకంలో ప్రచురింపబడిన దాదాపు అన్ని కార్టూనులూ 3, 4 నంబర్ల కుంచెలతో వేసినవి. కుంచెతో సన్నటి గీతలు గీయడానికి QUICK REFLEXES అవసరం. బాపూ యిందులో కడు నేర్పరి. బాపూ బొమ్మల్లో చక్కటి PROPORTIONALITY కనిపిస్తుంది.



అంతకు మించి కొట్టొచ్చినట్లు చలనం కనిపిస్తుంది. 67వ పేజీలోని "జరగవయ్యా" కార్టూన్‌లోని శాల్తీ "స్పీడు"ను గమనించండి. బొమ్మల్లో మంచి తెలుగుతనం కనిపిస్తుంది. లీదా సాదా, పెద్దా చిన్నా, ముసలీ ముతకా, ఇల్లా ఎందరో అతి సహజంగా కనిపిస్తారు. ఈ సహజత్వాన్ని తీసుకురావడానికి మంచి OBSERVATION అవసరం. ఇలా, అన్ని ప్రత్యేకతలూ వున్న కార్టూనులు యీ పుస్తకంలో మనకి అందజేశారు. ఐతే వాటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చివుంటే బాగుండేది. ఈ పుస్తకం మూలాన్ని ఒక ఉత్తమ కార్టూనిస్టు యొక్క PERSONALITY ఎటువంటిదో అవగాహన చేసుకోడానికి చక్కటి అవకాశం కల్పించారు నవోదయవారు.



పుస్తకంలోని కార్టూన్లను ఓమారు పరిశీలిద్దాం. 23వ పేజీలోని రేడియో కార్టూను చూడండి. దాంట్లో SATIRIST బాపు కనిపిస్తారు. ప్రతి మానవుడు మంచి సంస్కారవంతుడుగా వుండాలి. ఇతరులను గేలి చెయ్యకూడదు అన్న సుహృద్భావం కలిగినవారై వుండాలి బాపు. లేకపోతే 14వ పేజీలోని "చాలు ఊర్కోండి" కార్టూన్ ఐడియా ఆయనకెలా తడుతుంది? నేటి ఆస్పత్రులలో కనబడే నిర్లక్ష్యవైఖరిని విమర్శనాత్మకంగా 39వ పేజీలోని రోగి కార్టూనులో వ్యక్తపరిచారు. ఇది "జాలి" కార్టూను. అన్ని కార్టూనులూ నవ్వే పుట్టించాలన్న అవసరంలేదు. ఆయన చిత్రించిన పెళ్ళాల చాటు మొగుళ్ళను చూసినా యీలాంటి జాలే మనసులో కలుగుతుంది. తమ అవసరాలను పట్టించుకోని మొగుళ్ళతో అగచాట్లు పడే భార్యలను కూడ బాపు చిత్రించారు. 87వ పేజీలోని "SEXPERT"ను చూడండి. బాపు సంగీతప్రియులు. రసమయ సంగీతమంటే చెవి కోసుకుంటారు. 42వ పేజీలోని "ఆదిశక్తి" సంగీతం ఆయనకి నచ్చకపోవడానికి అదే కారణం. అందమైన అమ్మాయి అని బాపూ ఆరాధిస్తారు; వాళ్ళని వికారంగా గీయలేరు. ఇది ఆయన బలహీనత; బాపుకి పొగడ్తలు గిట్టవు. స్వయంశక్తితో, కృషితో పైకి రావాలన్న దృఢనమ్మకం కలిగినవాడు కనకనే, 38వ పేజీలోని హెడ్ గుమాస్తా కార్టూన్ను సృష్టించగలిగారు. పుస్తకాల విలువ నెరిగినవారు బాపు. 52వ పేజీలోని కార్టూను చూడండి. పేకాట వ్యసనం వున్నవాడికి ఒక చిన్న లైబ్రరీ వుండాలంటారాయన; ఆ కార్టూనులో షెల్ఫులమీది పుస్తకాలను గమనించండి. బాపు ,చాల SENSITIVE; 9, 53వ పేజీల్లోని కుర్ర డాక్టర్ల కార్టూనుల్లో ఆ SENSITIVITY ఏమిటో అర్థమవుతుంది: బాపు మితభాషి, మాటలు తూచి క్లుప్తంగా మాట్లాడుతారు. ఆయన బొమ్మలూ అంతే. వ్యాఖ్యను ఎందాకా పొడిగించాలి? ఎక్కడ ఆపేయ్యాలి అన్నది ఆయనకి బాగా తెలుసు. 108వ పేజీలోని కార్టూన్ వ్యాఖ్య ఎంత చిన్నదో చూశారా? 80వ పేజీలోని కార్టూన్‌లో "అమ్మాయికి వేవిళ్ళు!" అంటేనే చాలనిపించినా, "పండక్కి కొత్తచీర కట్టుకుంది మరి!" అని మరో వాక్యం జోడించడంతో ఆ వ్యాఖ్యకి నిండుదనం వచ్చింది.

ఇక ఆయన బొమ్మల్లోని సాంకేతికమైన ప్రత్యేకత లేమిటో తెలుసుకుందాం. కార్టూన్లలో వ్యాఖ్యకి కావలసిన మనుషుల్ని మాత్రమే చిత్రించి తృప్తిపడరు బాపు. దానికి సరిపడే నేపథ్య దృశ్యాన్ని ఎంతో ఓపికతో గీస్తారు. 51వ పేజీలోని మంత్రి కార్టూను బొమ్మలోని DEPTH ను గమనించండి. అలాగ 83వ పేజీలోని కార్టూన్‌లో "యిరుగు పొరుగు"ను చిన్న చిన్న గీతల్లో చిత్రించారు.

విదేశీ కార్టూను పుస్తకాలు తిరగేస్తే మనకి యెక్కువగా కనిపించేవి "WARD ROBE" కార్టూనులు. భార్యలమీద వందలాది కార్టూనులు



విశ్వజనీన హాస్యానికి మచ్చుతునకలాంటి ఒక బాపూ కార్టూన్

వేశారు—విదేశీ కార్టూనిస్టులు. ఇవి మన సంస్కృతికి విరుద్ధమైన కార్టూనులు. మనం స్త్రీని గౌరవిస్తాము. ఐనప్పటికీ స్త్రీని ఏమాత్రం అగౌరవపరచకుండా, ఆ పరపురుష లోలత్వంలోని సున్నిత హాస్యాన్ని బాపూ, 85, 102వ పేజీల్లోని కృష్ణుడి కార్టూన్లలో చూపించారు.

"అతిశయోక్తులు" బాపుకి యిష్టం. ఐతే తనకంటూ కొన్ని సరిహద్దు లుంచుకున్నారు గనకనే, అవి మనకి ఎబ్బెట్టుగా కనిపించవు. 25, 27, 47, 60, 61, 83, 92వ పేజీల్లోని కార్టూనులు దీనికి నిదర్శనాలు.

"NONSENSE" కార్టూన్ తెగ ఒకటుంది. 7వ పేజీలోని గంజి కార్టూను యీ కోవకి చెందింది. కార్టూన్ నాన్‌సెన్స్‌దయినా, అందులోనూ కొంత సెన్సును చూపించారు బాపు. 54వ పేజీలోని "మిమ్మన్నే" కార్టూను కూడా యిలాంటిదే!

PERSPECTIVE DRAWING బాపుకి క్షుణ్ణంగా తెలుసు. అందువల్ల బొమ్మల్లో చక్కటి PROPORTIONALITY కనిపిస్తుంది।

బాపూ తిరగెయ్యని విదేశీ కార్టూన్ పుస్తకంలేదు. MAD పత్రికల ప్రభావం ఆయన మీద కొంత కనిపిస్తుంది. MAD కార్టూనిస్టుల సున్నితమైన భావాలను తన స్వంత బాణీలో తెలుగులో అందించారు బాపు. 105వ పేజీలోని "మీదుతి నస్మరంతిగాడు" కార్టూనులు అలాంటివి. తనకి నచ్చిన కార్టూన్ను అతి రమణీయంగా "తెనిగించ" గలరాయన. ఉదాహరణకి 51వ పేజీలోని బిచ్చగాడి కార్టూన్, J. B. HANDELSMAN, PLAY BOY లో వేశాడు. అతని ఇంగ్లీషు వ్యాఖ్య యిది. "You think, I don't understand what real hunger is? I am only allowed cottage cheese and fruit salad!!" దీన్ని బాపూ ఎంత చక్కగా తెనిగించారో చూడండి. అలాగే 31వ పేజీలోని కార్టూన్, PUNCH లో MAHOOD వేసింది. 103వ పేజీలోని మొరిగే కుక్క కార్టూను, 19వ పేజీలోని పిల్లుల కార్టూనూ, MAD పత్రికలో JAFFE వేసినవి.

బాపూని అభిమానించే కార్టూనిస్టులకి నవోదయవారి "కొంటెబొమ్మల బాపు" ఒక చక్కటి పాఠ్యపుస్తకం. ప్రతి తెలుగు పాఠకుడికీ నవ్వుల నందించే వ్యంగ్య చిత్రాల గని.

—డా॥ ఎస్, 'జయదేవ్' బాబు



కూడలి

దేవరాజు మహారాజు

కళ్ళు చదువుతున్నాయి.

గిఫీలుగిఫీలు మని తలుపు బాదిన చప్పుడు. తను వెళ్ళి తలుపు తీసాడు. మనుషుల గుంపు కనబడింది. అకస్మాత్తుగా తన దవడ పగిలింది. గిఫ్ గిఫ్‌న డొక్కలో పోట్లు. నేలమీద కూల బడేట్లు ఒక్క తన్ను. అచేతనంగా వరండాలో తను, కొట్టినవాళ్ళు పారిపోతున్న అడుగులు.


మెడ తిరిగింది. కళ్ళు పుస్తకాన్ని వదిలి తలుపును చూసాయి. బోల్టును చూసాయి. తలుపు వేసే వుంది. బోల్టు పెట్టే వుంది. తను లేవనే లేదు. చూపు దిగి నున్నటి బండలమీదికి జారింది. మళ్ళీ తెల్లని గోడల మీదుగా కప్పు పైకి పాకింది.

ఇటీవల విద్యార్థులు ప్రొఫెసర్లను అలాగే తన్నారు. వాళ్ళ నలా తయారుచేసిం దెవరూ ప్రొఫెసర్లే. మరి తన్ని విడిచిపెట్టడం పరిష్కార మార్గమా?—ఆలోచించాలి.

అసహనంగా లావుపాటి పుస్తకాన్ని టెయ్యి టేబుల్ పైకి విసిరింది. చూపు కిటికీగుండా సాగిపోయి రోడ్డుమీది సిటీ బస్సును, రెండు స్కూటర్లను, కొన్ని సైకిళ్ళను, రిక్షాలను, తాకి, నడుస్తున్న అమ్మాయి అందమైన నడక దగ్గర ఆగి....మళ్ళీ గదిలో కొచ్చేసింది.

పుస్తకాన్ని చేతులు మళ్ళీ లాక్కున్నాయి. విదేశాల్లో అచ్చయిన పుస్తకం తాలూకు నున్నటి పేజీలు. వింత వాసన.

'మీరి గెడ్డం నా గండానికి పెంచుకున్నట్టుంది. ముక్కులోకి నోట్లోకి పోతున్నాయి



వెంట్రుకలు' — శిల్ప అలా అంటే తనకు చెక్కిలిగింత పెట్టినంత ఖుషీ.

'మరి నీ పక్కపిన్నులు-ముక్కుపోగులూ నాకు గుచ్చుకుపోతున్నాయ్ దాని కేమంటావ్?'

సముద్రపు కెరటం ఒడ్డును తడిపేసినట్లు పెదాలమీద వెల్డింగ్. చిరుమంటలు.

నల్లటి పొడి అక్షరాలు కలిసిపోయి ముద్దయి, వాక్యాలన్నీ కలిసి నల్లటి చీకటి మరక—పుస్తకంలో చీకటి. కటిక చీకటి. కీచురాళ్ళ రొద. చిన్ని చిన్ని దీపాలు. గోడలమీద నినాదాలు రాస్తున్న యువకుల అసహనం. దీపాలు కదిలిపోతున్నాయి.

కళ్ళ ముందు పేజీలు. పేజీలు వెలుగుతున్నాయి. కూలుతున్న కోటకోడ రాళ్ళలాగా అక్షరాలు. విజ్ఞాన రాజభవనంలోకి తను దారి తీయాలి. వస్తున్న తరాలకు తను మార్గదర్శకుడు. విజ్ఞానం మంచిదే. రాజభవనం చూడతగిందే. కాని డిగ్రీలు, అనుభవాలు, అనుభూతులు కూడు పెట్టవే — అశాంతి. అశాంతి అందుకే.

మొన్నటివరకు అన్నీ తను అనుభవించినవే. ఎంత విలవిల్లాడితే ఈ ఆసరా దొరికింది? తను బావిలో మునిగిపోతున్నాడు. నీళ్ళు మింగాడు. కాళ్ళు గిలగిలా తన్నుకున్నాడు. ముక్కులోకి నీరు పోయి శ్వాసాడడం లేదు. అప్పుడు దొరికింది ఈ అసరా. ఈ తెప్ప. ఈ చెక్కముక్క. ఈ ఉద్యోగం! ఇది పట్టుకుని ఎంతసేపని ఈదాలో? ఎందరికి సహాయపడాలో?

ఎడమచేయి వేళ్ళు గడ్డంలో వేటగాళ్ళలాగా తిరుగుతున్నాయి. "ఒరేయ్! నీ లొట్టచెంపలు పూడ్చుకుపొయ్యేట్టు నిండుగా ఆ గెడ్డం అలాగే పెంచు" ఫిరోజ్ వీపు చరుస్తున్నాడు. వాడి సిగరెట్ పొగ.

కుడిచేతిలో పుస్తకం. పుస్తకంలో పోత విగ్రహాల్లాగా అక్షరాలు. పాశ్చ్య పుస్తకాల్లోని పాఠాలు చాదస్తం, మూఢత్వం, గోపురాలుగా వున్న గుళ్ళు! గుళ్ళు....గుళ్ళు....గుండ్లు—గుండ్ల వర్షం కురవాలి.

గుళ్ళు కూలాలి. ఒక పెద్ద గుడి గోపురం

ఫెళఫెళమని విరిగి కూలి పెచ్చులు పెచ్చ లయింది. చలికి రోడ్డుమీద ముడుచుకునే జీవులకు గూళ్ళు కావాలి. పోనీ గుండ్లవర్షం అక్కర్లేదు. గుళ్ళు గూళ్ళు చేస్తే సరిపాయె.

తన మనసునించి, తుపాకి గుండులా దూసుకుపోయింది వాళ్ళ నవ్వు. ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలో కూచున్నాడు తను. కమిటీ మెంబర్లు తనను చూసి హేళనగా నవ్వు తున్నారు. ఎన్నిసార్లు ఎక్కడెక్కడో, ఎంద రెందరివో యిలాంటి నవ్వు వింటేగాని ఈ ఉద్యోగం వచ్చింది కాదు. వాళ్ళంతా డబ్బు సుష్టిగా భోంచేసి వచ్చినట్లు పుష్టిగా వున్నారు. గొడ్లు నవ్వుతున్నాయి.

ఈ పనికిరాని చెత్తంతా రేపు పిల్లలకు చెప్పాలి. చూపు అక్షరాల్ని దాటేస్తూ పోవడం లేదు. అక్షరాలు చుట్టే తిరుగుతోంది. పనికి రానిదని తనకు తెలుసు. వాళ్ళకు తెలుసు. కాని వుత్తుత్తగానే చదువుకోవాలి. వుత్తుత్తగానే చెప్పుకోవాలి. వుత్తుత్తగానే నవ్వుకోవాలి. పనీ పాట లేక వుత్తుత్తగానే రోడ్లనీద బతుకుతుం డాలి. అఖ్‌ థూ నీ యవ్వ బత్కు——


పుట్టింట్లో బోరుకొడుతోంది. సెలవు చూసు కుని వూరికెనె ఓసారి రండీ——శిల్ప వుత్తరం. శిల్ప గారాబం. పిల్లల్ని కనబోయేవాళ్ళ కోరి కల్లా శిల్ప కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. పూర్. పూర్. పూర్ శిల్ప. శిల్ప ప్రపంచం చిన్నది. తను కావాలని ఆ పూరి గుడిసెలోంచి తెచ్చుకున్నాడు. శిల్ప మొదటి పేరు రంగమ్మ. ఈ నాగరిక సమాజానికి తగినట్టుగా తను ఆమె పేరు మార్చుకోకుండా వుంటే తన భార్య పేరు రంగమ్మ. ఎంత ఘోరంగా వుండేది.

సినిమా హాల్లో——వెండి తెరమీద, తెర నిండా, స్తనాలు. స్తనాలు కదులుతున్నాయి. అరనిమిషం తర్వాత కింద కటిభాగం, నున్నటి తొడలు, తొడలమధ్యలోంచి దూసుకుపోయింది కెమెరా కన్ను——దూరంగా లేచి పడుతున్న సముద్రపు అలలు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఫలాని డ్రింకే తాగండి: వెస్టరన్ మ్యూజిక్‌లో చిరుగు తున్న గొంతుల పాట సముద్రపు ఒడ్డున నగ్నసుందరి: డ్రింకు తాగుతూ——

రోడ్డుమీద లారి హారన్ అసహ్యంగా పారి పోయింది. కళ్ళముందు పుస్తకం, పుస్తకంలో కొట్టొచ్చినట్టు అక్షరాలు. చదవాలి రేపటి క్లాసు కోసం. తల్లి వేరునుండి విడిపోతున్న పిల్ల వేళ్ళు——ఆలోచనలు: చేతిలో పుస్తకం. సెక్రటేరియట్ ముందు నిరాహార దీక్ష చేస్తూ సొమ్మసిల్లిపోయిన విద్యార్థుల్లాగా వాక్యాలు. పోలీసు ఫైరింగ్‌లో అక్కడికక్కడే కుప్ప కూలి చచ్చిన కాలేజీ కుర్రాళ్ళ లాగా ఫుల్ స్టాప్‌లు.

చూపు పుస్తకం మీదినుండి టేబుల్‌మీదికి గెంతి, నేలమీద గచ్చుబండలమీద వగిలింది. ఖడేల్‌మని స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని బుల్లెట్ల లాగా లోనికొచ్చిన ఆరుగురు విద్యార్థులు. ప్రొఫెసర్ మెడలు అణగబెట్టి, అతని కళ్ళ ముందే అతని పరిశీలనలో యూనివర్సిటీకి సబ్మిట్ చేయబడ్డ థీసిస్‌లు, రీసెర్చ్ పేపర్లు, పుస్తకాలు తగలబెట్టారు. ప్రొఫెసర్ పక్షపాత వైఖరి, కులతత్వం, ప్రాంతీయ తత్వం, కుతం త్రాలు అన్నీ ఆ మంటల్లో దగ్ధమౌతున్నాయి. ప్రాణభయంతో ప్రొఫెసరు: అతని కంట్లో మండుతున్న మంటల ఛాయలు....గచ్చుబండ మీద మంటలు. అలాంటివే మంటలు, అలాంటి వారే ప్రజలు. అసెంబ్లీలో మంటలు, పార్ల మెంటులో మంటలు.

చూపు తలుపుమీదికి పోయింది. చేతిలో నున్నటి పేజీలమీది నల్లటి' అక్షరాలమీదికి పోయింది. From the dorsal side arises the Posterior pancreatico duodenal artery which passes to the duodenal loop and pancreas చూపు మళ్ళి, చేతి గడియారాన్ని టికటిక మని తొలిచింది. 'ఫారూ... ఫీ వండ్ల పొడి' వెధవ భారతిలో అడ్వర్‌టయిజ్‌మెంట్. హోటల్ సరోవర్‌లో చుట్టూ జంటల మధ్య తను ఒంటరిగా కాఫీ తాగుతున్నాడు. ఎదురు సీట్లో వాళ్ళిద్దరు.



ఆమె భుజాలమీదుగా జారిపోతున్న చీజ్ కాటన్ శర్టుమీద అతను చెయ్యేసి, కళ్ళద్దా ల్లోంచి నీలి నీలిగా చూస్తూ——'హైద్రాబాద్‌లో ఎక్కడికైనా వెళ్ళ మంచి టీ దొరుకుతుంది' ——ఇంగ్లీషులో పోజు. గంతకట్టిన జంతువు లాగా తెల్లని ముఖానికి నల్ల కళ్ళద్దాలు. జంతు వులు. హోటల్ టేబుళ్ళముందు అన్నీ జంతువులు. దేశం నిండా ప్రపంచం నిండా జంతువులు. దున్నపోతులకు పూలదండ లేసి పండగ మామూళ్ళు అడుక్కుంటున్నారు. దున్నల మెళ్ళో గంటలు: సరాల్ని కుదిపి ఎత్తి పడేస్తున్న డప్పు చప్పుడు. ఢం ఢం కి కియాం కి యాం. ఢం ఢం కి కియ్యాం కియ్యాం.

కళ్ళు ఎంతసేపటికీ పుస్తకం గట్లమీదే తిరుగుతున్నాయి. లోనికి దిగడం లేదు. దిగితే బురదే——లేదు లేదు. తను అలా కాకూడదు. ఆ ప్రొఫెసర్ల స్థితికి తను దిగజారకూడదు. అలాంటి బతుకు తన కక్కర్లేదు.

యువజనాన్ని చైతన్యవంతులుగా చేసే వాడి నవ్వాలి. వారికో దారి చూపించేవాడిలాగా కావాలి. కూడలిలో ఎలక్ట్రిక్ సిగ్నల్ స్థంభం లాగా, పక్షపాతం లేకుండా వుండాలి. అందు కోసం ఈ యూనివర్సిటీ సిలబస్‌లు చదవడం అనవసరం.

చప్పున మూసి పుస్తకం టేబుల్‌పై గిరా టేసాడు తను. పాఠ్య పుస్తకం శవంలా కూలింది. జీవిత సమరం కోసం సిద్ధంగా మరి కొన్ని పుస్తకాలు, వీరుల్లా షెల్ఫ్ నిండా నిల బడి వున్నాయి.



ఫెళఫెళమని విరిగి కూలి పెచ్చులు పెచ్చలయింది. చలికి రోడ్డుమీద ముడుచుకునే జీవులకు గూళ్ళు కావాలి. పోనీ గుండ్లవర్షం అక్కర్లేదు. గుళ్ళు గూళ్ళు చేస్తే సరిపోయె.

తన మనసునించి, తుపాకి గుండులా దూసుకుపోయింది వాళ్ళ నవ్వు. ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలో కూచున్నాడు తను. కమిటీ మెంబర్లు తనసుచూసి హేళనగా నవ్వుతున్నారు. ఎన్నిసార్లు ఎక్కడెక్కడో, ఎందరెందరివో యిలాంటి నవ్వు వింటేగాని ఈ ఉద్యోగం వచ్చింది కాదు. వాళ్ళంతా డబ్బు సుష్టిగా భోంచేసి వచ్చినట్లు పుష్టిగా వున్నారు. గొడ్లు నవ్వుతున్నాయి.

ఈ పనికిరాని చెత్తంతా రేపు పిల్లలకు చెప్పాలి. చూపు అక్షరాల్ని దాటేస్తూ పోవడం లేదు. అక్షరాలు చుట్టే తిరుగుతోంది. పనికి రానిదని తనకు తెలుసు. వాళ్ళకు తెలుసు. కాని వృత్తితగానే చదువుకోవాలి. వృత్తితగానే చెప్పుకోవాలి. వృత్తితగానే నవ్వుకోవాలి. పనీపాట లేక వృత్తితగానే రోడ్లమీద బతుకుతుండాలి. ఆఖ్‌ ఛూ నీ యవ్వ బత్కు——


పుట్టింట్లో బోరుకొడుతోంది. సెలవు చూసుకుని వూరికెనె ఓసారి రండీ——శిల్ప వుత్తరం. శిల్ప గారాబం. పిల్లల్ని కనబోయేవాళ్ళ కోరికల్లా శిల్ప కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. పూర్‌. పూర్‌. పూర్‌ శిల్ప. శిల్ప ప్రపంచం చిన్నది. తను కావాలని ఆ పూరి గుడిసెలోంచి తెచ్చుకున్నాడు. శిల్ప మొదటి పేరు రంగమ్మ. ఈ నాగరిక సమాజానికి తగినట్టుగా తను ఆమె పేరు మార్చుకోకుండా వుంటే తన భార్య పేరు రంగమ్మ. ఎంత ఘోరంగా వుండేది.

సినిమా హాల్లో——వెండి తెరమీద, తెర నిండా, స్తనాలు. స్తనాలు కదులుతున్నాయి. అరనిమిషం తర్వాత కింద కటిభాగం, నున్నటి తొడలు, తొడలమధ్యలోంచి దూసుకుపోయింది కెమెరా కన్ను——దూరంగా లేచి పడుతున్న సముద్రపు అలలు. బ్యాక్‌గ్రౌండ్‌లో ఫలాని డ్రింకే తాగండి: వెస్టరన్ మ్యూజిక్‌లో చిరుగుతున్న గొంతుల పాట సముద్రపు ఒడ్డున నగ్నసుందరి: డ్రింకు తాగుతూ——

రోడ్డుమీద లారి హారన్ అసహ్యంగా పారిపోయింది. కళ్ళముందు పుస్తకం, పుస్తకంలో కొట్టొచ్చినట్టు అక్షరాలు. చదవాలి రేపటి క్లాసు కోసం. తల్లి వేరునుండి విడిపోతున్న పిల్ల వేళ్ళు——ఆలోచనలు: చేతిలో పుస్తకం. సెక్రటేరియట్ ముందు నిరాహార దీక్ష చేస్తూ సొమ్మసిల్లిపోయిన విద్యార్థుల్లాగా వాక్యాలు. పోలీసు ఫైరింగ్‌లో అక్కడికక్కడే కుప్ప కూలి చచ్చిన కాలేజీ కుర్రాళ్ళ లాగా ఫుల్‌స్టాప్‌లు.

చూపు పుస్తకం మీదినుండి టేబుల్‌మీదికి గెంతి, నేలమీద గచ్చుబండలమీద వగిలింది. ఢేల్‌మని స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని బుల్లెట్ల లాగా లోనికొచ్చిన ఆరుగురు విద్యార్థులు. ప్రొఫెసర్ మెడలు అణగబెట్టి, అతని కళ్ళ ముందే అతని పరిశీలనలో యూనివర్సిటీకి సబ్మిట్ చేయబడ్డ థీసిస్‌లు, రీసెర్చ్ పేపర్లు, పుస్తకాలు తగలబెట్టారు. ప్రొఫెసర్ పక్షపాత వైఖరి, కులతత్వం, ప్రాంతీయ తత్వం, కుతంత్రాలు అన్నీ ఆ మంటల్లో దగ్ధమౌతున్నాయి. ప్రాణభయంతో ప్రొఫెసరు: అతని కంట్లో మండుతున్న మంటల ఛాయలు....గచ్చుబండ మీద మంటలు. అలాంటివే మంటలు, అలాంటి వారే ప్రజలు. అసెంబ్లీలో మంటలు, పార్లమెంటులో మంటలు.

చూపు తలుపుమీదికి పోయింది. చేతిలో నున్నటి పేజీలమీది నల్లటి అక్షరాలమీదికి పోయింది. From the dorsal side arises the Posterior pancreatico duodenal artery which passes to the duodenal loop and pancreas చూపు మళ్ళి, చేతి గడియారాన్ని టికటిక మని తొలిచింది. 'ఫారూ... ఫీ వండ్ల పొడి' వెధవ భారతిలో అడ్వర్‌టయిజ్‌మెంట్. హోటల్ సరోవర్‌లో చుట్టూ జంటల మధ్య తను ఒంటరిగా కాఫీ తాగుతున్నాడు. ఎదురు సీట్లో వాళ్ళిద్దరు.



ఆమె భుజాలమీదుగా జారిపోతున్న చీప్ కాటన్ శర్టుమీద అతను చెయ్యేసి, కళ్ళద్దాల్లోంచి నీలి నీలిగా చూస్తూ——'హైద్రాబాద్‌లో ఎక్కడికైనా వెళ్ళు మంచి టీ దొరుకుతుంది' ——ఇంగ్లీషులో పోజు. గంతకట్టిన జంతువు లాగా తెల్లని ముఖానికి నల్ల కళ్ళద్దాలు. జంతువులు. హోటల్ టేబుళ్ళముందు అన్నీ జంతువులు. దేశం నిండా ప్రపంచం నిండా జంతువులు. దున్నపోతులకు పూలదండ లేసి పండగ మామూళ్ళు అడుక్కుంటున్నారు. దున్నల మెళ్ళో గంటలు: నరాల్ని కుదిపి ఎత్తి పడేస్తున్న డప్పు చప్పుడు. ఢం ఢం కి కియాం కి యాం. ఢం ఢం కి కియ్యాం కియ్యాం.

కళ్ళు ఎంతసేపటికీ పుస్తకం గట్లమీదే తిరుగుతున్నాయి. లోనికి దిగడం లేదు. దిగితే బురదే——లేదు లేదు. తను అలా కాకూడదు. ఆ ప్రొఫెసర్ల స్థితికి తను దిగజారకూడదు. అలాంటి బతుకు తన కక్కర్లేదు.

యువజనాన్ని చైతన్యవంతులుగా చేసే వాడి నవ్వాలి. వారికో దారి చూపించేవాడిలాగా కావాలి. కూడలిలో ఎలక్ట్రిక్ సిగ్నల్ స్తంభం లాగా, పక్షపాతం లేకుండా వుండాలి. అందు కోసం ఈ యూనివర్సిటీ సిలబస్‌లు చదవడం అనవసరం.

చప్పున మూసి పుస్తకం టేబుల్‌పై గిరాటేసాడు తను. పాఠ్య పుస్తకం శవంలా కూలింది. జీవిత సమరం కోసం సిద్ధంగా మరి కొన్ని పుస్తకాలు, వీరుల్లా షెల్ఫ్ నిండా నిలబడి వున్నాయి.



విధేయత

మహారాణి ఎలిజబెత్ గూర్చి చక్కని కథ ఉంది. ఆ రాజకుమారి తొమ్మిది సంవత్సరాల బాలికగా ఉన్నప్పుడు తన నాయనమ్మతో కలిసి ఏవో వస్తువులు కొనుటకు లండన్ నగరంలో ఒక అంగడికి వెళ్ళిందట. రాకుమారి అంగడిలోనికి వెళ్ళటం చూచిన ప్రజలు తిరిగి ఆమెను చూడటానికి అంగడి ముందు గుంపులుగా వేచియున్నారట. ఇది గ్రహించిన రాజకుమారి వాళ్ళ నాయనమ్మతో "తొందరగా కానియ్యి నాయనమ్మా! వెలుపల ఇంగ్లండుదేశపు రాజకుమారిని చూచుటకు ఎంతోమంది ప్రజలు వేచియున్నారు," అని విసుగ్గా అందట. ఎలిజబెత్ మాటలు విన్న నాన్నమ్మ విస్తుపోయింది. 'ఈ పిల్లకు ఈ వయస్సులోనే కాబోయే మహారాణినని దర్పం ఏర్పడేలాగుంద' అని మనసులో అనుకొని మామూలు మార్గములో కాకుండా మరొక మర్గములో రాజకుమారిని బయటకు తీసుకొని వెళ్ళింది. తరువాత ఆమె ఎలిజబెత్‌తో ఇలా అంది "ఈనాడు ప్రజలు నీ తల్లి దండ్రులను అనురాగముతో చూస్తున్నారంటే దానికి కారణం వారు అధికారం చెలాయిస్తూ రాజ్యమేలుతున్నారని కాదు. వారు ఈ ప్రజలకు అణుకువతో సేవ చేస్తున్నారు. ముత్యాలు, రత్నాలతో చెక్కబడిన కిరీటము ఒకనాటికి నీ శిరస్సును అలంకరిస్తుంది. అయితే అణకువ, నమ్రత, వినయము నీ శిరస్సుకు సాటిలేని సౌందర్యాన్ని చేకూర్చిపెడతాయి తల్లీ!" అని.

క్రీస్తుప్రభు రాజులకు రాజు. ప్రభువులకు ప్రభువు. అయినను ఆయన ఆకారమందు మనుష్యునిగా కనపడి శిలువమరణము పొందు నంతగా వినయము చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను. అందుచేత ప్రతివాని నాలుక తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లు దేవుడు ఆయనను అధికముగా హెచ్చించెను. ఆ ప్రభువుగూర్చి తెలుసుకున్నారా!

చదలవాడ చంద్రమతీదేవి



2

రాజకీయ మాయాజాలం

అల్లావుద్దీన్ ఆత్రంగా బల్బును రుద్దాడు. మరుగుజ్జు ప్రత్యక్షమయ్యాడు.

"రాకాసి మిత్రమా!....'అదేవో సమ్మె జరుగుతుంది, స్కూళ్ళు మూసేశారు' అని నన్ని చింతచెట్టుకింద వదిలేసి వెళ్ళావ.... తర్వాత యేం జరిగిందో తెలుసా రాకాసి మిత్రమా!...."

"ఆపు. నీ పిలుపు బాగోలేదు, రాకాసి.... అని పిలవొద్దు. ముద్దుగా మజ్జు అని పిలు. మరుగుజ్జు అనే నా నామధేయాని కివి పొడి అక్షరాలు!"—కాలర్ యెగరవేస్తూ అన్నాడు మజ్జు.

"పోనీ—అట్లాగే పిలుస్తా. రాత్రి ఓ లారీడు మనుష్యులు నా దగ్గర కొచ్చారు...."

"పోలీసులేమో. నీ వేషం చూసి పట్టుకెళ్దామని వచ్చుంటారు. అంతా ఒకే రకమైన గుడ్డ లేసుకున్నారా?" మజ్జు ప్రశ్నించాడు.

"ఆc, అంతా ఒకే రకం. తలమీద తెల్ల టోపి....లాల్చి, పైజామా, పంచెలూ—అన్నీ తెలుపే."

"ఓషోష్. వాళ్ళా....ఖద్దరు శాల్తీలు! అహాc నీదాకా వచ్చారా....వీళ్ళ దుంపతెగ. వచ్చేది అయిదేండ్ల కొక్కమారే అయినా—పుట్టలో వున్న పామునైనా సరే బయటకు లాగి ఓటు వేయించుకుంటారు...."

"అదేవిcటి....పుట్టలో పాము కాటేస్తుంది. ....ఓటేమిటి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అదే, రాజకీయం అంటే! కాటేసేవాడికి పోటిసే వాడు ఓటిస్తాడు!! ఓటు వేయించుకోవడం ముఖ్యం. కాళ్ళా గడ్డాలూ యేవీ అడ్డురావు—"

"మళ్ళీ యీ కాళ్ళా....గడ్డాలూ ఏవిcటి?"

"అదే ఓటరు గడ్డం ఒకడు పట్టుకుని "బాబ్బాబంటే"....ఇంకొకడు కాళ్ళు బట్టుకుని "అయ్యయ్యా" అంటాడు! ఎక్కడలేని భక్తి. ఆత్మీయత వొలకబోస్తారు...."

"మజ్జూ రాత్రి అంతపని జరిగించిస్మీ! ఆకలవుతుందంటే మిరపకాయ బజ్జీలేవో పెట్టి నువ్వెళ్ళిపోయావా? కారమనిపించినా ఆకలి బాధకు తట్టుకోలేక వాటిని తినేసి నీళ్ళు.... తాగుదామని పంపుకెదురుగా కూర్చున్నా. అప్పటికింకా పంపుల్లో గుcయ్‌మన్న మోత తగ్గలేదు. ఇంతలో లారీ వచ్చింది. అందులోనుంచి బిలబిల మంటూ తెల్లటోపీవాళ్ళు దిగొచ్చారు. మజ్జూ—వాళ్ళంతా టోపీ లెందుకు పెట్టు

కున్నారు?" అమాయకంగా అడిగాడు.

"తరవాత మనలాంటివాళ్ళ నెత్తిన పెట్టడానికి!" ఠపీమని జవాబు చెప్పాడు మజ్జు.

"మరి నాకు పెట్టలేదేం?"

"పెట్టేవుంటారు? అమ్మా.......ఊరకనే పోతారా వాళ్ళు? నీతో యేం చెప్పారో చెప్పు. నే చెప్తా."

"చాలా చెప్పారు. అన్నీ గుర్తుంటాయా? ముందు—మీ యిల్లెక్కడ—అని అడిగారు. నాకు యిల్లు లేదు; ప్రస్తుతానికి చింతచెట్టుకింద వుంటున్నా అన్నా. అప్పు డేమన్నారో తెలుసా?...."

"ఏవన్నారేం?"

"నీ కొక యింటిస్థలం మంజూరు చేస్తున్నాం. రేపో ఎల్లుండో వచ్చి యింటి స్థలానికి పట్టా పట్టుకెళ్ళు అన్నారు."

"అన్నారా? మరేం, టోపీ పెట్టలేదంటావేం? అహ్హహ్హహ్హా...." నడుంమీద చేతులు పెట్టుకుని, మోర పైకెత్తి కాసేపు కడుపు నిండా నవ్వి—

"ఆహా....నీ ఓటుకు పట్టా .... మనిషికో పట్టా... ననా....టటటా చిచిచీ....ననా...." అంటూ మజ్జు చిందేస్తుంటే అల్లావుద్దీన్‌కు మతిపోయినంతపనయింది. తమ తేరుకుని....

"ఇదేంటి మజ్జు....యీ చిందేవిఁటి?...." అన్నాడు.

"నీకో యిల్లూ, దానికో పట్టా వస్తున్నందుకు....నా చిందు....ననా....టటటా—"

"ఆపు నీ చిందు....కొంపముచ్చులాగా. అసలు పట్టా రాందే...." దాంతో మజ్జు మనిషిలాగా నిలబడి—

"అట్లా అన్నావా బావుంది. రాజకీయం చెప్తా విను. నీకు పట్టా రాదు. వాళ్ళకొక్కా వల నిండల్లా నీ ఓటే! దానికోసం ఓటి మాటలు కోటి చెప్తారు. మనిషికో పట్టా అంటారు.... కావాలంటే మనిషికో ఎకరం అంటారు."

"మరి వాళ్ళిచ్చిన మాట సంగతేమిటి?"

"నువ్వు ఓటిచ్చేవరకే ఆ మాట....నమ్మ్మ నా మాట—" మజ్జు అన్నాడు.

"మరి దీని మాటేమిటి?" ఓ పది రూపాయల నోటు చూపిస్తూ—

"మాజీ మంత్రిగారిని కలుసుకోమని, ఈ కాగితంమీద వారి చిరునామా, ఈ నోటు ఇచ్చి వెళ్ళారు టోపీల వాళ్ళు—" మజ్జు యెగిరి అల్లావుద్దీన్ చేతిలో రెపరెప మంటున్న పది రూపాయల నోటును లాక్కొని—

"మాజీ మంత్రిగారింటికి తర్వాత.... ముందు హోటల్లో మజా—పద—" అంటూ గునగున పరుగెడుతూ హోటల్లో దూరాడు.

అల్లావుద్దీన్ మజ్జు వెనకాలే పరుగెత్తాడు.

పదిరూపాయల మందందాకా టిఫిన్లు తిని, రిక్షా యెక్కి మాజీ మంత్రిగారింటికొచ్చారు.

అక్కడ—మాజీమంత్రిగారు తను కొత్తగా ఎం. పీ.గా నిలబడిన సందర్భంలో ఓ బ్రహ్మాండమైన టీపార్టీని ఏర్పాటు చేశాడు.

అటూ ఇటూగా ఉన్న పార్టీ నాయకుల్నీ, రెండో ఆటకి కూడా టికెట్టు దొరకని నాయకుల్నీ, అలిగిన వాళ్ళనీ, నలిగినవాళ్ళనీ టీ పార్టీ పేరుమీద తనింటికి పిలిపించుకున్నాడు—

మునుపు యెప్పుడూ లేని రాజకీయ జూదం జరుగుతుంది కాబట్టి, యెవరెటు పిలిస్తే అటు వెళ్ళేవాళ్ళంతా అక్కడ పోగయ్యారు. అంతా అల్లావుద్దీన్ కోసం యెదురుచూస్తున్నారని మజ్జు పసిగట్టి—

"అల్లావుద్దీన్....నువ్వేం కంగారుపడకుండా వాళ్ళదగ్గరకు వెళ్లు. వాళ్లు యేం చెప్పినా సరేనను. నీకు అనుమాన మేస్తే బల్బును మూడుసార్లు నొక్కు. వెంటనే నీ పక్కకొచ్చేస్తా. అయితే ఒకటి. నేను నీకు మాత్రమే కనిపిస్తా; నా మాటలు నీకే వినిపిస్తాయి—కాస్త జాగ్రత్తగా మెసులుకో....రాజకీయ నాయకులంటే నీ దీపాన్ని కాజేసిన మాంత్రికుని బంధువర్గమే—వస్తున్నారుచూడు—హాంఫట్—" అల్లావుద్దీన్ ఏమీ చెప్పకముందే మజ్జు మాయమయ్యాడు!

"అల్లావుద్దీన్‌కీ—జై! మాయా దీపానికే మన ఓట్లు!!"

పదిమంది జైకొట్టుకుంటూ రానే వచ్చారు.



అమాంతంగా అల్లావుద్దీన్ని చేతులమీద ఎత్తుకొని సోఫాలో మాజీమంత్రిగారి పక్కలో కూర్చోబెట్టారు.

చుట్టూ కుచేలుడి సంతానం చాలా వుంది. బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాడు అల్లావుద్దీన్.

మంత్రిగారు టోపీ సరిచేసుకుని ఉపన్యాసం మొదలుపెట్టారు.

"ఎలక్షన్లో మనం గెలుస్తామా, ఓడిపోతామా అన్నది ముఖ్యం కాదు! మన డిపాజిట్టు దక్కుతుందా లేదా అన్నది ముఖ్యం కాదు! మన పార్టీని ఎలాంటి మహామహులు బలపరుస్తున్నారు అన్నది ముఖ్యమని ఈ వేదికమీంచి మనవి చేస్తున్నా—"

టప టపామని అంతా చప్పట్లు కొట్టారు. యెందుకా చప్పట్లో అల్లావుద్దీన్‌కు అర్థం కాలేదు!

"మహా పరాక్రమవంతుడు........మాయా దీపం సంపాదకుడు—శ్రీ అల్లావుద్దీన్‌గారు మనల్ని బలపరుస్తున్నారని తెలియజేయడానికి గర్విస్తున్నా—" అనేసరికి మళ్ళీ ఫెళఫెళమన్నాయి చప్పట్లు.

అంతా యికిలిస్తూ తనవేపే చూస్తుంటే తట్టుకోలేక, నెమ్మదిగా జేబులోకి చెయ్యి

పోనిచ్చి బల్బును మూడుసార్లు నొక్కాడు. వెంటనే మజ్జు ప్రత్యక్షమై, అల్లావుద్దీన్ కాళ్ళ దగ్గర కూర్చుని,

"అప్పుడే యేం ముంచుకొచ్చిందని బల్బు నొక్కావ్, వీళ్ళ డ్రామా చూడకుండా....?" అని అల్లావుద్దీన్‌కి తొడపాసం పెట్టాడు.

దాంతో—"బాబోయ్ డ్రామా—" అని అల్లావుద్దీన్ గట్టిగా అరిచాడు.

మాజీ మంత్రిగారి కది వినిపించింది. అల్లావుద్దీన్ వైపు చూస్తూ—

"ఏమిటి మీరు డ్రామా అన్నారా? ఆహా. ....ఇది అంతయు మాయాదీపముయొక్క మహిమ కదా! కాలేజీలో నే నున్నప్పుడు—అంటే అప్పుడు గుమస్తాగా కుదిరా లెండి—ఒక వార్షికోత్సవానికి అల్లావుద్దీన్ వేషం కట్టా లెండి—డ్రామాలో! ఆ రహస్యం మీ కిట్టే తెలిసిపోయింది....హిహి....అంతా మాయా దీపముయొక్క మహిమ....హిహి...." అల్లావుద్దీన్‌కు తేళ్ళూ, జెర్రులూ పాకినట్టనిపించింది—ఆ మాటలు వింటూంటే.

పొరపళ్ళూ, దొప్ప చెవులు, నత్తిముక్కు, బల్లి కళ్ళు, బానకడుపు—ఇతడా నా పాత్ర ధరించింది? అని అల్లావుద్దీన్ మాజీమంత్రిగారిని ఎగాదిగా చూస్తూ వుంటే—

"అల్లావుద్దీన్‌గారు నా వైపు అంత యిదిగా చూస్తున్నారంటే నేను వారి అభిమానాన్ని చూరగొన్నట్టే!" మంత్రిగా రన్నారు.

మజ్జు—అల్లావుద్దీన్ని మరోసారి గిచ్చి—

"జాగ్రత్తగా విను. నీకు టోపీ పడబోతోంది" అన్నాడు.

అల్లావుద్దీన్ చెవులు నిక్కించాడు. మంత్రిగారు టోపి సరిచేసుకుని—

"ఈ శుభసమయాన, మన పార్టీ కార్యకర్తల సమక్షంలో—చాలా జాగ్రత్తగా ఆలోచించి—ఒక ముఖ్యమైన ప్రకటన చేస్తున్నా. పేపరువాళ్ళు—అంటే పాత్రికేయులు—నేను చెప్పింది చెప్పినట్టుగా పేపర్లో వెయ్యాలని మనవి. మా పార్టీ అధికారంలోకి వస్తే శ్రీశ్రీ అల్లావుద్దీన్‌గారిని ప్రధాన మాంత్రికుడిగా చేస్తాం!—" అన్నాడు.

"బాబోయ్ మాంత్రికుడు—" అని అదిరిపడి, కాళ్ళదగ్గరున్న మజ్జును ఒక్క తన్నాడు అల్లావుద్దీన్. ఆ మాట మంత్రిగారికి వినిపించింది.

"ఛ. ఛ. అచ్చు తప్పు. మాంత్రికుడు కాదు—మంత్రి—హెహ్హె మంత్రి—సారీ....మంత్రి! మంత్రిగా చేస్తాం—" సవరించుకుంటూ మాజీమంత్రిగా రన్నారు.

"మంత్రీ—మాంత్రికుడు రెండూ ఒకే లాగా వినిపిస్తున్నాయేంటి మజ్జూ?" నెమ్మదిగా అన్నాడు అల్లావుద్దీన్.

"అంతే, అంతే. రెండూ ఒకటే! ఇద్దరు చేసే పనులూ ఒకటే—మంత్రాలు! ఈ రెండు మాటలు ఒకటే-నువ్వు సరిగ్గానే విన్నావ్‌లే-" మజ్జు చెప్పాడు.

"అనుమానంలేదు. శ్రీ అల్లావుద్దీన్‌గారిని ప్రధానమంత్రిని చేసి తీరుతాం" మంత్రిగారు ఆవేశంగా, సోఫాని గుద్ది చెప్పేసరికి—అక్కడ పోగైన వాళ్ళంతా—

"ప్రధానమంత్రి అల్లావుద్దీన్‌కీ—జై—" అంటూ నోరు నొచ్చేవరకు నినాదాలు చేశారు. వాళ్ళు అలా జైకొడుతూ వుంటే—అల్లావుద్దీన్ మజ్జుతో మాట్లాడాడు.

"మజ్జూ....చూశావా వీళ్ళ అభిమానం! పాపం....ఇంతగా వీళ్ళు బతిమలాడుతుంటే యెలా వద్దనాలి? పోనీ, ఈ ఒక్కసారికి ప్రధానమంత్రిగా నిలబడేనా?"కాస్త వినయంగా, సిగ్గుపడుతూ అల్లావుద్దీన్ అంటూ వుంటే—

"అబ్బ—పడింది నాయనా టోపి! నీకు పడింది మామూలు టోపి కాదు—శిల్కు ఖద్దరు. ఆ శిల్కు ఖద్దరు యెవరు కొంటారో గాని మీటరు యాభై రూపాయలకి తక్కువ వుండదు. అదుగో ఆ టోపి పడింది నీకు!మంత్రి వవుతావా? మాంత్రికుడి వవుతావా?" అంటూ మరోసారి తొడపాసెం....పెట్టాడు మజ్జు.

"వద్దు బాబోయ్" అని చిన్నపాటిగా గావు కేక పెట్టాడు!

ఆ మాటలు అందరికీ వినిపించాయి. మంత్రిగారు నోరు చేసుకున్నారు.

"ఏవిటండీ....ప్రధాన మంత్రిపదవి అక్కర్లేదా? భయమా? అనుభవం లేదని శంకా? నేమున్నాగా? మీ పక్కనే వుంటా. నేను చెప్పిన మాట వినండి—నెగ్గుకొస్తారు. ప్రధానమంత్రి అనిపించితే చాలుగా—పార్లమెంటుకి వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు. ఆ రాత నొసటమీద వుండాలేగాని....ఎక్కడన్నా చదువుకోవచ్చు....పార్లమెంటులోనే చదవాలనేం లేదు. పోతే మిత్రులారా....పార్టీ కార్యకర్తల్లారా, మరో ముఖ్యమైన విషయం. మన పార్టీ ప్రధాన సమస్య ప్రధానమంత్రి—అది కాస్తా తేలిపోయింది! ఇక పోతే—నిధుల సేకరణ. నిజం చెప్పాలంటే అది కూడా తేలిపోయిందని చెప్పడానికి సంతోషిస్తు...."

"అల్లావుద్దీన్—" మజ్జు నెమ్మదిగా పిలిచి, "ఇంకో బాణంవేస్తున్నాడు కాస్కో"అన్నాడు.

"ఊరికే పెద్దవాళ్ళని అనుమానించమాక" అని మజ్జుని మందలించాడు అల్లావుద్దీన్. మంత్రిగారు అందుకున్నారు—ఆ మాటలు విన్నాక.

"ఛి. ఛీ, నేను, తమరిని అనుమానించడమా?" ముక్కుమీద వేలు వేసుకుని—

"కలలో కూడా ఊహించమాకండి. అదృష్టంలాగా మీరు మాకు దొరికారు. మిమ్మల్ని అనుమానిస్తే....ఇక మాకు మిగిలిందేమిటి చెప్పండి?" గొంతును వొణికించి, దాన్ని మళ్ళీ సరిచేసుకుని—

"పార్టీ నిధులకోసం ఎవర్నీ యాచించే పనే లేదు అని మనవి చేస్తున్నాను. మన ప్రధాన మంత్రి అల్లావుద్దీన్‌గారి దగ్గరున్న మాయాదీపమే మన నిధి! అదే మన పెన్నిధి!! మాయా దీపానికి—" మాజీ మంత్రిగారు ఉక్కిరి బిక్కిరి అవుతూ అంటూ వుంటే....యేమని అరవాలో తెలియక కొంతమంది "జై"—అనీ, కొంతమంది "మీ ఓటు"—అని కేకలు వేశారు. ఆ కేకల మధ్యలో అల్లావుద్దీన్ మజ్జూను పిలిచి—

"మజ్జూ! వీళ్ళకు నిధులు కావాలంట....యేదీ కాసులు కురిపించు—" అన్నాడు.

"కాసులు రాసుల్లా కురిపించాలి కదూ! మా నాయనే! రాత్రి నీకు మిరపకాయ బజ్జీలు కొని పెట్టడానికి నాకు గతిలేదు....కనీసం మంచి నీళ్లు తాగడానికి నీకు గతిలేదు! కాసులు రాసులుగా కురిపిస్తే దేశానికి ఈ తిప్పలెందుకు బాబూ?" మజ్జు దీర్ఘం తీశాడు.

"ఊఁ. నేను ప్రధాన మంత్రిని కాగానే నీకు బజ్జీలు,వడలు కాఫీలు....యెన్నికావాలంటే."

"ఆగండి అల్లావుద్దీన్ జీ! బజ్జీలోకి మిరపకాయలూ వడల్లోకి ఉల్లిగడ్డలూ, కాఫీలోకి పంచదార యిప్పించండి....పుణ్యం వుంటుంది, కాసులూ వొద్దు....రాసులూ వొద్దు." మజ్జు ప్రాధేయపడ్డాడు.

"మరీ యింత చిన్న కోరికలా ప్రధాన మంత్రిని అడిగేది! ఏ అర్ధ రాజ్యమో, మణులో, మాణిక్యాలో...."

"అదే అదే. ప్రజాస్వామ్యంలో ఈ దేశం మొత్తం మనదే! ఎటొచ్చీ ఆరడుగులు సొంత భూమి అంటూ లేదు—చస్తే అందులో ఇరకడానికి! మీ మణులూ మాణిక్యాలు వొద్దుగాని—మార్కెట్టులోవున్న సరుకులు మాయం గాకుండా చెయ్యండి బాబూ—" మజ్జూ దీనంగా ముఖం పెట్టాడు.

"ఇదో మజ్జూ....నువ్వు మరీ మనిషిలాగా మాట్లాడేస్తున్నావ్. పైగా....నువ్వు....నా భవిష్యత్తుకు అడ్డొస్తున్నావు. అది గమనించు—"

"ఆహా. ఇదండి రాజకీయమంటే! చూశావా....ఈ దేశంలో రాజకీయాలు యెంత తేలిగ్గా వంటబడతాయో! చూడు అల్లావుద్దీన్-ప్రతి నాయకుడూ మాయాదీపంకోసం తన్నుకలాడేవాడే. అన్నీ మాయ మాటలే. నీ దగ్గరున్న అ అద్భుత దీపాన్ని కాజెయ్యాలని నీకు పట్టం కట్టారు. అది కాస్తా చేజిక్కిందనుకో....నిన్ను చింతచెట్టుకింద కూడా వుండనివ్వరు! పైగా—నీ దగ్గరగా వుంది అరవై వోల్టుల బల్బు అనగానే నాలుగు అంటించి దాన్ని ఫ్యూజు చేసి గిరాటేస్తారు. నా మాట విను....వీళ్ళంతా నీకు జైకొట్టే మైకంలో వుండగానే ఇక్కణ్నుంచి పారిపోదాం పద. తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దాం. "మజ్జూకి జై"....అని బల్బుని నొక్కు.అమాంతంగా మాయమై చింత చెట్టుకిందకొస్తావ్. అక్కడ కలుసుకుంటా, టాటా....బైబై...." అని మజ్జూ మాయమయ్యాడు!

అంత పనీ చేసి అమాంతంగా అల్లావుద్దీన్ కూడా మాయమైపోయాడు. (ఇంకావుంది)

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

ఫోటో

జి. ఆర్. శాస్త్రి, (ఎం.ఎస్సీ. ప్రథమ)
ఏ. యు. కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వాల్తేరు.

"ఆకులో ఆకునై, పూవులో పూవునై...."

అంటూ పాడుతూ గులాబీ మొక్కలకు నీరు పోస్తున్న మాధవి, గేటు చప్పుడు కావడంతో అటు చూసి "హలో బావా! ఇదేనా రావడం" అంటూ మూర్తిని నవ్వుతూ పలకరించింది. "అవునూ యూనివర్సిటీకి సెలవులిచ్చి నాలుగు రోజులయింది కదా ఇంతవరకూ దొరగారు యెక్కడున్నట్టో" కనుబొమలు పైకెత్తి వాలుగా చూస్తూ అడిగింది.

"మా ఫ్రెండొకడికి విజయనగరంలో పెద్ద ఆక్సిడెంట్ అయితేనూ పరామర్శించి, ధైర్యం చెప్పి వస్తున్నా" యెంతో విచారంగా ముఖం పెట్టి చెప్పాడు.

"ఆక్సిడెంటా యేమయింది పాపం?"

"పాపం! పెళ్ళి!!"

"సంతోషించాలే తెలివికి" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మూర్తి వైజాగ్‌లో ఎం.కాం. చదువుతున్నాడు. మూర్తివాళ్ళ ఊళ్ళోనే రెండిళ్ళ అవతల ఉంటున్న అతని మేనమామ కూతురు మాధవి, ఆ ఊళ్లోనే బి. ఎస్సీ ఫస్టియర్ చదువుతోంది. ఎం.కాం.కాగానేఅతనికి మాధవిని ఇచ్చి చేయాలని రెండు కుటుంబాలవారి సంకల్పం. కాని అతనికి ఇంకా పై చదువులు చదవాలని ఉంది.

మాధవి అంటే అతనికి చిన్ననాటినుంచీ ప్రేమ. అయితే ప్రేమ అనేది జ్వరంలాంటిదయితే పెళ్ళి దానికి మందు, పెళ్ళిమందు వేసిన వెంటనే ప్రేమజ్వరం తగ్గిపోతుంది అనియెవరో రచయిత రాసిన మాటలు అతనికి నూటికి నూరుపాళ్ళు నిజమనిపిస్తాయి. కనుక మాధవిని వీలైనంత యెక్కువకాలం ప్రేమిస్తూ ఉండాలని అతని కోరిక.

వచ్చిన కొంచెం సేపటికి స్నానంచేసి తల తుడుచుకొంటూ "మాధవీ! నా సూట్‌కేస్‌లో షర్ట్, లుంగీ ఉన్నాయి—కొంచెం తెచ్చిస్తావా ప్లీజ్!" అడిగాడు మూర్తి.

తెస్తానని వెళ్ళి రాకపోవడంతో గదిలోకి తొంగిన చూసిన మూర్తికి, తెరిచి ఉన్న పెట్టె ముందు నిలబడి పోస్టుకార్డు సైజులో వున్న అందమైన అమ్మాయి ఫోటోని తదేకంగా చూస్తున్న మాధవి కన్పడింది.

అలికిడి విని అతనికేసి తిరిగి "ఈ అమ్మాయి యెవరు? మీ క్లాస్‌మేటా?" అడిగింది. కళ్ళలో కాస్తంత అసహనం,గొంతులో సన్నని వణుకు.


మూర్తి మౌనంగా ఉన్నాడు చెప్పాలా వద్దా అని శంసయిస్తున్న వాడల్లే.

"మాకు చెప్పకూడదు కాబోలు. అంత రహస్యమయితే వద్దులే" పురుషుని ఆవేశపరచయినా నిజం చెప్పించాలనే తర తరాల స్త్రీ తపన.

"అబ్బే అంత రహస్యం యేం లేదు. కానీ...."

"మాకు చెప్పకూడదు అవునా?"

"ఆ విషయం యిప్పుడప్పుడే అందరికీ చెప్పడం యిష్టంలేదు" మూర్తి గొంతులో యే భావం లేకుండా అన్నాడు, పెద్దవి అవుతున్న ఆమె కళ్ళనీ, కొద్దిగా అదురుతున్న ముక్కుపుటాల్నీ చూస్తూ.



అన్నాడేగానీ చెప్పకపోతే తన నెలా అర్థం చేసుకొంటుందోనని అనుమానం పట్టుకొంది. అనుకున్నంతా అయింది.

"ఓహో తెలిసిందిలే" అంటున్న ఆమె గొంతులోని వ్యంగ్యం, కళ్ళలోని అసూయ చూసి, ఫోటో చూసింది గనుక యెప్పటికైనా చెప్పక తప్పదు. ఇప్పుడే చెపుతేనో అనుకొంటున్నాడు.

ఇంతలోనే జడ వెనక్కి విసురుకుంటూ వెళ్ళిపోయింది 'ది ఫ్రౌనింగ్ ఏంజిల్'లా.

ఈ మధ్యనే చూసిన శోభానాయుడు నృత్య ప్రదర్శనంలోని "ఖండిత నాయిక" అభినయం కళ్ళముందు మెదిలింది వెళిపోతున్న మాధవి చూసిన చూపులో, వేగంగా వెళుతున్న భంగిమలో.

అలా వెళ్ళిన తర్వాత సుమారు వారం రోజులదాకా మూర్తి ఎదుట పడలేదు మాధవి. సాయంత్రం షికారుకు వెడుతూ వాళ్ళింటికేసి చూసేవాడు. ఒకటి, రెండుసార్లు తనని చూసి, గేటు దగ్గర నిలబడినదల్లా వెంటనే లోపలికి వెళ్ళిపోయేది. తాను బయటకు వెళ్ళినపుడు మాత్రం వచ్చి కొంతసేపు ఉండి వెడుతోందని యింట్లోవాళ్ళ మాటల్నిబట్టి గ్రహించాడు. కానీ ఫోటో విషయం యేమీ చెప్పినట్లు కనపడలేదు. అందుకు కొంత సంతోషించాడు.

ኇ ኇ ኇ

రెండురోజులు సరదాగా ఉందామని వచ్చిన రాజుతో డ్రాయింగ్‌రూములో మాట్లాడుతుండగా అడుగులో అడుగు వేసుకొంటూ హాలులోంచి లోపలికి వెళుతున్న మాధవిని పిల్చాడు మూర్తి, తల తిప్పుకొని వెళ్ళిపోతుందేమోనని భయపడుతూనే.

కొత్త వ్యక్తి ఉండడం చూసి, పిల్చాక వెళ్ళకపోతే బావుండదనేమో కాబోలు వచ్చింది. ఒకరి కొకరిని పరిచయం చేశాడు మూర్తి.

కాసేపు ఏవో మాటలు సాగాయి.

హఠాత్తుగా రాజు, "ఒరేయ్! మా వాళ్ళు ఒకళ్ళు స్త్రీ పాత్ర ఉన్న నాటకం ఒకటి వేయాలనుకొంటున్నారు. నీ తరపున నేను ప్రామిస్ చేశా. ఖరగ్‌పూర్ నాటక పోటీల్లో ప్రైజ్‌వచ్చిన సంగతి........" అంటూ ఏదో చెప్పుకు పోతున్నాడు.

ఇంతలో "బావా నువు నాటకాల్లో...." అంటూ యేదో జ్ఞాపకం వచ్చిన దానిలా కుర్చీలోంచి లేచి మరో గదిలోకి పరిగెత్తడం ప్రారంభించేసరికి తనూ వెంటపడ్డాడు.

గబగబా పెట్టె తీసి అందులో ఫోటోని, మూర్తిని మార్చి మార్చి చూస్తూ చివరికి "ఛీ యేం బాలేవు" అంటూ ఫోటో పట్టుకు పారిపోయింది, అమ్మాయి వేషంలో పోల్చుకోలేనంతగా కన్పిస్తున్న బావ ఫోటోని అత్తయ్యకు చూపించాలనుకొంటూ. □


సినిమా

ఆదర్శ(క)ప్రాయం

శరీరంలో సత్తువా, ఆలోచనలలో వేడీ వున్నప్పుడు, వయసు ముదిరితే మాత్రం అది అడ్డమొస్తుందా అని మన రాజకీయ వేత్తల మాదిరిగా బుకాయించక—కెరీర్ ఉచ్ఛదశలో వుండగా, శక్తి యుక్తులకు కొదవలేకుండా వున్న స్థితిలోనే నేను దర్శకుడిగా విరమించుకో బోతున్నానని ఒక తెలుగు దర్శకుడు ప్రకటించడం నిజంగా అభినందించవలసిన విషయం. 1981 తరవాత తాను దర్శకత్వ శాఖనుంచి వైదొలగి చిత్రపరిశ్రమకి సంబంధించిన యితరేతర రంగాలలో స్థిరపడడానికి నిశ్చయించుకొన్నట్లు యిటీవల శ్రీ దాసరి నారాయణరావు చేసిన ప్రకటన (చూ. సినీ హెరాల్డ్ డిసెంబర్ 1979 సంచిక) యిప్పటికే లబ్ధప్రతిష్ఠులై, ఆర్థికంగా కూడా బాగా స్థిరపడిపోయిన యితర సీనియర్ దర్శకులలోకూడా ఆలోచనలు రేకెత్తించగలదని ఆశించవచ్చు. శ్రీ దాసరి 1981 చివరికి 60 చిత్రాలు పూర్తిచేయగలనని ఆశిస్తున్నారు. రాజాచంద్ర, దుర్గా నాగేశ్వరరావు, వంటి నారాయణరావుగారి సహాయకులు యిప్పటికే దర్శకులుగా వెలుగులోకి వచ్చిన విషయం మా పాఠకులకు తెలుసు. 'జాతర' వంటి విశిష్ట చిత్రాన్ని నిర్మించిన ధవళా సత్యంకూడా శ్రీ శ్రీ దాసరి నారాయణరావు వద్ద సహకార దర్శకుడిగా పనిచేసి వుండడం విశేషం.

'సుబ్బారాయుడు-సుబ్బలక్ష్మి'లో నూతన్ ప్రసాద్






'గురు'లో శ్రీదేవి

హాసన్ సోదరులు

దర్శక నిర్మాత సి. రుద్రయ్య, కమల హాసన్, ఆయన సోదరుడు చంద్రహాసన్ కలిసి



'ప్రియబాంధవి' చిత్రాన్ని యిటీవల ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించినప్పుడు రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డితో నిర్మాత శ్రీపతిరావు

నటిస్తోన్న తమ చిత్రం 'నిన్ను క్షమించు రాజా' తాలూకు విశేషాలు చెప్పడానికి డిసెంబరు 6న పామ్‌గ్రోవ్ హోటల్లో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. కమలహాసన్ నటుడిగా పరిచయమైన తొలి రోజులనుంచి నిన్న మొన్నటిదాకా కూడా చంద్రహాసన్ ఆయనకి నటనలో కోచింగ్ యిచ్చేవారట. 'నా సోదరుడు, అందులోనూ నాకు అలాగ కాదు యిలాగ అని పాఠాలు చెప్పినవాడు ప్రత్యర్థిగా వస్తున్నాడు, నేను చాలా జాగ్రత్తగా వుండాలి' అన్నారు కమల్ నవ్వుతూ. తమిళ, తెలుగు భాషలలో ఒకేసారి నిర్మించబడుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఇళయరాజా. తెలుగు సంభాషణలు జంధ్యాల. పాటలు వేటూరి సుందరరామ్మూర్తి. సురళిరాజన్, సుజాత, యితర ముఖ్య పాత్రధారులు.

'రాజాధిరాజు' పురోగమనం

రామచిత్ర పతాకంపై శ్రీమతి జయలక్ష్మి, శ్రీమతి ఆర్.డి. రెడ్డి నిర్మిస్తూన్న వర్ణచిత్రం రాజాధిరాజు దాదాపు పూర్తయింది. బాపు దర్శకత్వంలో తయారవుతున్న యీ చిత్రంలో కథతోనే తొలి ఆకర్షణ ప్రారంభమవుతూంది. అద్భుతమైన ఊహాశక్తిని రంగరించి నిజమైన ఫాంటసీ ఎలా వుంటుందో తెలియజెప్పే కథ యిది. అలా అని కథలో బలం లేదనుకొనే ప్రమాదం వుంది. ఈ కథలో నవరసాలు వున్నాయి. భగవంతుడు వున్నాడని నమ్మేవారికి, భగవంతుని ఉనికిని సవాలుచేసే దుష్టశక్తికీ జరిగే ఘర్షణకు రసవత్తరమైన కథారూపం యిది. ఈ ఘర్షణలో పావుగా వుపయోగించబడి ఎంతో సంఘర్షణకులోనైన పాత్రలో 'కరుణామయుడు' విజయ

చందర్ హీరోగా నటిస్తున్నాడు. దైవ ప్రతినిధిగా దుష్టశక్తిని ఎదిరించి నిలబడిన భక్తురాలిగా శారద నటిస్తోంది—దుష్టశక్తిగా నిత్య నూతన్‌ప్రసాద్ నటిస్తున్నాడు. నూతన్‌ప్రసాద్ ఈ చిత్రంలో ఇదివరకెన్నడూ కనిపించని విలక్షణమైన పాత్రలో కనిపిస్తాడు.

యూనిట్‌లో ఒక సభ్యుడన్నట్లు బెంగుళూర్ పాలెస్‌ని దర్శకుడు బాపు మరెవ్వరికీ మిగిల్చని రీతిలో ప్రతి గదీ, గోడా, వరండా, రూఫ్‌టాప్, మెట్లూ, అన్నిటినీ అద్భుతంగా ఉపయోగించుకున్నారు.

నూతన్ ప్రసాద్ పాత్ర సన్నివేశాలను ఖర్చుకు వెనుదీయక ప్రత్యేకంగా నాలుగు రోజులపాటు కేరళలో టెకెడీ లేక్ దగ్గర చిత్రీకరించేందుకు నిర్ణయించారు దర్శక నిర్మాతలు.

ముక్కామల, హరిబాబు, విక్రం, యం.బి. కె.వి.ప్రసాదరావు, రమణమూర్తి, జయానంద్ షాకత్, నారాయణరావు, సుమలత, రాజ్యలక్ష్మి, బేబి వరలక్ష్మి, మొదలైన వారుకూడా నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు, బాపు. రచయిత, ముళ్ళపూడి. సంగీతం, కె.వి. మహదేవన్. సమర్పిస్తున్నది విజయచందర్.

పల్లె నవ్వింది

పేరు బావుంది. మన నిర్మాతలు, దర్శకులు తెలుగుభాష గొడ్డుబోయినట్టు 'పాడిందే పాటరా' అని పెట్టినపేర్లనే, తిరగేసి, ఎగరేసి ముక్కలుచేసి అతుకులేసీ పెడుతుంటారు. బాక్సాఫీసు బద్దలుకొట్టిన ఒక హిందీ చిత్రం పేరు 'దీవార్'. అంటే గోడ. యెంత సాదా పేరు. 'పల్లె నవ్వింది' నిర్మాతల్ని యీ విషయంలో అభినందించవలసిందే. చంద్రమోహన్, నూతన్ ప్రసాద్, జ్యోతి, ఉషాచౌదరి, కిరణ్ బాబు అనే కొత్త నటుడు నటిస్తున్న యీ చిత్రం శ్రీ శ్రీనివాసా కళామందిర్ పిక్చర్స్ పతకంతో, సి.హెచ్. రాఘవరావు, నూకల విష్ణువర్ధన రెడ్డి నిర్మాతలుగా, పింజల భాస్కరరావు దర్శకుడుగా, జి.కె. వెంకటేష్ సంగీత దర్శకుడుగా, బొల్లిముంత శివరామకృష్ణ సంభాషణల రచయితగా, జాలాది రాసిన రెండు పాటల రికార్డింగ్‌తో డిసెంబర్ 28 నుంచి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభించుకుంటోంది.

పట్నంపిల్ల పండగ చేసుకుంది

సినిమాలు విజయవంతంగా నడిచాక ఉత్స

'శివమెత్తిన సత్యం'లో కృష్ణంరాజు



వాలు జరుపుకోవడం వేరు, చిత్రం విడుదల కాకముందే, నిర్మాతలు తమ సాంకేతిక కళాకారులనీ, నటీనటులనీ, పత్రికలవారినీ ఆహ్వానించి పండుగ చేసుకోవడం వేరు. ఇటువంటి అరుదయిన ఉత్సవాన్ని 'పట్నంపిల్ల' చిత్ర నిర్మాత శ్రీ తాతాజీ యిటీవల మద్రాసులో జరిపారు. శ్రీ మోదుకూరి జాన్సన్, శ్రీ ఎఫ్. కృష్ణంరాజు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వారితోపాటు శ్రీ మురళీమోహన్ కూడా ఉచిత రీతిని నాలుగుముక్కలు మాట్లాడారు. కమల హాసన్, మురళీమోహన్, శ్రీదేవి, సత్యప్రియ, మోహన్‌బాబు తదితరులు నటించిన ఈ వర్ణచిత్రం విడుదలకు సిద్ధంగావుంది. కూర్పు, దర్శకత్వం సత్యం. మాటలు వీటూరి. సంగీతం చక్రవర్తి.

సృష్టి రహస్యాలకి జత ప్రతాప్‌గారి ప్రేమలత

ఇటు పరిశ్రమ దృష్టినీ, అటు ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షించిన కొత్తతరహా చిత్రం "సృష్టి రహస్యాలు" సృష్టించిన దర్శకుడు శ్రీ ప్రతాప్ తొలిచిత్రం విడుదల కాకముందే మరొక చిత్రానికి దర్శకత్వం వహిస్తూ, తమ ఒంటరి చిత్రానికి తోడు తెచ్చుకునే ప్రయత్నంలో వున్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాలలో షూటింగ్ జరుపుకొంటున్న ఆయన రెండవ చిత్రం 'ప్రేమలత.' జగ్గయ్య, నూతన్‌ప్రసాద్, జానకి, శశిరేఖ మొదలైనవారు ముఖ్యపాత్రలు పోషిస్తున్న 'ప్రేమలత'కి కృష్ణమోహన్, లక్ష్మీకళ అనే రెండు కొత్తపువ్వులు పూయబోతున్నాయి. ఈ చిత్రానికి సంగీతం సత్యం. బి. కె. మోహన్, బ్రహ్మయ్య, పి. కె. రామిరెడ్డి నిర్మాణత్రయం.

యువతరం జనవరిలో కదలబోతోంది

దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు దర్శకత్వంలో నటుడు శ్రీ మాదల రంగారావు నిర్మించనున్న 'యువతరం కదిలింది' చిత్ర నిర్మాణం యిప్పటికే ప్రారంభం కావలసింది.

'నాగమల్లి' పాటల రికార్డింగ్ జరిగినప్పుడు-ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, దర్శకుడు దేవదాసు, పి. సుశీల, నిర్మాత భాస్కరవర్మ





'భలేకృష్ణుడు' ఔట్‌డోర్ షూటింగులో జయప్రద, దర్శకుడు రాఘవేంద్రరావు, కృష్ణ, నృత్య దర్శకుడు సలీమ్

జనవరి తొలివారంలో పార్లమెంటు ఎన్నికలు ముగియగానే, కథాసంవిధానానికి తుది మార్పులు చేర్పులు చేసి జనవరిలోనే యీ చిత్ర నిర్మాణ రథాన్ని కదిలించడానికి శ్రీ రంగారావు సిద్ధంగా వున్నట్టు తెలుస్తోంది.

కుడి ఎడమైతే

కుడి ఎడమైతే నూరురోజుల పండుగ ఇటీవల మద్రాసులో ఘనంగా జరిగింది. తాతినేని ప్రకాశరావుగారి అబ్బాయి టి. ఎల్. ఎన్. ప్రసాద్ ఈ చిత్రానికి దర్శకుడు. శ్రీ ఎన్. టి. రామారావు, శ్రీ ఎల్. వి. ప్రసాద్, శ్రీ దాసరి నారాయణరావు వంటి పలువురు పెద్దలు శ్రీ టి.ఎల్.ఎన్. ప్రసాద్‌ని అభినందించారు. 1979 లో ప్రసాద్‌తోపాటు దర్శకులుగా పరిచయమైన కొందరు యితర యువదర్శకులు కూడా వేదికమీద ఆశీనులయ్యారు.


హేపీ బర్త్‌డే టూ మిస్ జయమాలిని

ఈనాడు తెలుగు సినిమాకి ముఖ్యంగా ఫిలింకంపెనీకూడా ముఖ్యమైన అవసరంగా మారిపోయిన కుమారి జయమాలిని తన (?) వ పుట్టిన రోజుని మద్రాసు ఉడ్‌లాండ్స్ హోటల్లో జరుపుకుని పత్రికలవారిని ప్రత్యేకంగా ఆహ్వానించగా, పత్రికా రచయితలు వెళ్ళి ఆమెని అభినందించి వచ్చారు.


ఉప 'సంహారం'

"జై సంతోషిమా" చిత్రం యిప్పటికీ దిగ్విజయవంతంగా నడుస్తోంది. కులమతాలతో సంబంధం లేకుండా, ఉత్తరభారత ప్రజల్లో అధికభాగం ప్రతి శుక్రవారంనాడు ఉపవాసం చేస్తున్నారు. చివరికి ఈ చిత్రం యిటీవల భర్త చనిపోయిన ఒక యువతిని సతీసహగమనానికి సైతం ప్రేరేపించింది. 'జై సంతోషిమా' చిత్రంలోని భజనగీతాలను గానంచేస్తూ ఆమె భర్త చితిమీద కూర్చుని సజీవ దహనమైపోయింది. వేలాది మంది స్త్రీ పురుషులు ఈ సంఘటనని చూసి కూడ యీ ఘోరాన్ని నిరోధించడానికి ప్రయత్నించకపోగా, అందరూ కలసి 'జై సంతోషిమా' సినిమా పాటల్ని బృందగానం చేశారు. (చండీఘర్ నుంచి వెలువడే ఆంగ్ల దినపత్రిక 'ది ట్రిబ్యూన్' వార్త.)

—దేవీదాసు



శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆ ధా రా లు

అడ్డం :

1. చక్రవర్తి (ఆరుగురిలోనివాడు కాదు)
3. బకాసురుడిది తీరు
5. బొంగరం తిరుగుడు
7. అల్లాగా?
9. పువ్వుల్లో పువ్వు
10. శ్రోతలకు మనవి
12. కాదంటే అన్యాయం
13. ఉనికి చిటికెడు సేపు
15. దీర్ఘాక్షరాలు
16. క....క....క....(భాష)
17. పాతనాణెం
18. 6 పదిచెయ్యడం
20. ఒకదేశం
22. 17కన్నా పాతనాణెం
23. గద్దెనెక్కినా పాలించలేదు
25. కొనడం ఆకర్షించడం
27. బ్రహ్మచర్యము
29. రెండు పిల్లులకు ఒక కోతి
31. చీకటిలో కనబడుతుంది
32. హద్దు (పరి చేరినా చేరకున్నా)

నిలువు :

1. తమ్మకంటి
2. ఎవరో గిరిగీస్తే
3. 11 రేడియో ఫీచర్
4. అర్థం అసంపూర్ణం
5. 2 తిరుగుబాటు
6. గౌతముడికి బుద్ధి చెప్పింది
7. అని
8. వైద్యుడు నిదానించేది
11. చూడు 3
14. ఆరగింపు
15. విద్యలకు విజయనగరం
18. కవికాని దండి
19. చెవులకు సంగీతం
21. జ్యోతిబాసు గణితం
22. వసంతంలో చిగురిస్తుంది
23. వాయుభోక్త
24. చేరేది కంచి
26. లక్ష్యం
28. మిత్రభేదంలో ముఖ్యపాత్ర
30. కాదు సేనాధిపతి.

జనవరి పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం : 1. మేయు 3. ప్రజ 5. కళావరు 7. యమగోల 9. వల 10. జయంతి 12. వింత 13. తోక 15. గాదం 16. డబ్బు 17. క్రియ 18. చప 20. త్రికం 22. పాప 23. మరాటీ 25. దివి 27. కలవాణి 29. కమ్మరిళ్లు 31. తడి 32. నిగ.

నిలువు : 1. మేళాలతో 2. యువ 3. ప్రమ 4. జగోవిందం 5. కవ 6. రుజ 7. యతి 8. లత 11. యంత్రం 14. కడప 15. గాయత్రి 18. చపలత్వ 19. సిరా 21. కందిరీగ 22. పాళ 23. మణి 24. టీక 26. విడు 28. వాడి 30. మ్మని.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి జనవరి 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

జనవరి ప్రహేళిక విజేతలు:

1) కె. జె. ఎం. కృష్ణారావు—ఏలూరు. 2) డా॥ నాగరాజు సురేంద్ర—హైదరాబాదు. 3) అంగర వెంకటగిరిజాకుమార్—హైదరాబాదు. 4) కె. పాండురంగనాయుడు—హైదరాబాదు. 5) యం. విజయలక్ష్మి—కావలి. 6) ఎం. శ్యామల—కర్నూలు. 7) పి. లకుమ—ఖమ్మం. 8) ఎమ్. నీలకంఠశాస్త్రి—లింగసముద్రం. 9) కె. శాంబశివరావు—నగరం. 10) కె. వెంకటరావు—విశాఖపట్నం.

గమనిక : జనవరి సంచిక పజిల్‌లో అసాధారణంగా చాలామంది గెలుపొందినందున లాటరీ వేసి పదిమంది విజేతలను ఎన్నుకోవడం జరిగింది—ఎడిటర్.

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024&Printed by D. HanumanthaRao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.


JYOTI · FEBRUARY · Rs 3/-
Regd No. 8669